మంగళవారం
02-9-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 342
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

ధన్కర్ అధికారిక నివాసం ఖాళీ

న్యూఢిల్లీ: ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన జగదీప్ ధన్కర్ దాదాపు ఆరు వారాల తర్వాత తన అధికారిక నివాసాన్ని ఖాళీ చేశారు. దక్షిణ ఢిల్లీ ఛతర్‌పూర్ ప్రాంతంలోని ఓ ప్రైవేటు ఫామ్‌హౌస్‌కు మారారు. మాజీ ఉపరాష్ట్రపతిగా ఆయనకు టైప్-7 అధికారిక నివాసం కేటాయించే వరకు తాత్కాలికంగా అక్కడ ఉంటారని అధికారులు ఓ వార్తాసంస్థకు తెలిపారు. ఆ ఫామ్‌హౌస్ ఐఎన్ఎల్‌డీ నేత అభయ్ చౌతాలాకు చెందినదిగా తెలుస్తోంది. ఆరోగ్య కారణాలు చూపుతూ జులై 21న ధన్కర్ ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేశారు. అప్పటినుంచి ప్రజాజీవితానికి దూరంగా ఉంటున్నారు. ఆయన ఇప్పటివరకు పార్లమెంట్ హౌస్ సమీపంలోని ఉపరాష్ట్రపతి భవనంలో ఉన్నారు.

ఉత్తరాంధ్ర, కోస్తాకు భారీ వర్షసూచన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఈశాన్య బంగాళాఖాతానికి ఆనుకొని ఉన్న మైన్మార్ తీరం మీదుగా ఉపరితల ఆవర్తనం సముద్ర మట్టానికి 5.8 కి.మీ ఎత్తులో విస్తరించి ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని ప్రభావంతో రానున్న 24 గంటల్లో ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందన్నారు. తీరం వెంబడి 40-50 కిమీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు

- మిగతా 2 లో

ఆగస్టు జీఎస్‌టీ వసూళ్లు రూ.1.86 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు ఆగస్టులో రూ.1.86 లక్షల కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే 6.5 శాతం వృద్ధి నమోదైంది. ఈ మేరకు సోమవారం కేంద్ర ఆర్థికశాఖ గణాంకాలు విడుదల చేసింది. గత నెలతో పోల్చుకుంటే మాత్రం వసూళ్ల మొత్తం తగ్గింది. జులై నెలలో రూ. 1.96 లక్షల కోట్లు వసూలయ్యాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో జీఎస్‌టీ చరిత్రలో అత్యధికంగా రూ.2.37 లక్షల కోట్ల వసూళ్లు వచ్చిన సంగతి తెలిసిందే. కాగా, ఆగస్టు జీఎస్‌టీ వసూళ్లలో ఆంధ్రప్రదేశ్ గణనీయమైన వృద్ధి కనబరించింది. గత ఏడాది

- మిగతా 2 లో

నాలుగేళ్ల స్థానికత తప్పనిసరి: సుప్రీం

న్యూఢిల్లీ: తెలంగాణలో వైద్య విద్య అభ్యసించాలనుకుంటున్న విద్యార్థులకు సుప్రీంకోర్టు ఒక ముఖ్యమైన తీర్పును వెలువరించింది. రాష్ట్రంలో నాలుగేళ్లపాటు చదివిన వారికే స్థానిక హోదా కల్పించాలన్న ప్రభుత్వ నిబంధనను సమర్థించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గతంలో జారీ చేసిన జీవో సరైనదేనని స్పష్టం చేస్తూ, దీనిపై భిన్నాభిప్రాయంతో ఉన్న తెలంగాణ హైకోర్టు తీర్పులను పక్కన పెట్టింది. వివరాల్లోకి వెళితే... తెలంగాణ మెడికల్ కళాశాలల్లో ప్రవేశం పొందాలంటే విద్యార్థులు తప్పనిసరిగా తొమ్మిదో తరగతి నుంచి 12వ తరగతి వరకు

- మిగతా 2 లో

ఇదీ లోకం!

అఫ్గాన్‌లో ఘోర విపత్తు

వరుసగా రెండు భారీ భూకంపాలు

800 మందికి పైగా మృతి...
2500 మందికి పైగా గాయాలు

కాబూల్: అఫ్గానిస్థాన్‌లో వరుసగా రెండు భారీ భూకంపాలు సంభవించాయి. ఈ ఘోర విపత్తు కారణంగా వందలమంది ప్రాణాలు కోల్పోగా, వేల సంఖ్యలో గాయాలపాలయ్యారు. భారీగా ఆస్తి నష్టం జరిగింది. తూర్పు అఫ్గాన్ ప్రాంతంలో ఆదివారం రాత్రి 11 గంటల 47 నిమిషాల సమయంలో తొలుత రిక్టర్ స్కేల్‌పై 6.0 తీవ్రతతో భారీ భూకంపం సంభవించింది. యూఎస్ జియోలాజికల్ సర్వే వివరాల ప్రకారం, నంగర్హార్ ప్రావిన్స్‌లోని జలాలాబాద్ సమీపంలో భూకంప కేంద్రం ఉన్నట్లు తేలింది. 8 కిలోమీటర్ల లోతులో అది కేంద్రీకృతమైంది. 20 నిమిషాల తర్వాత ఇదే ప్రావిన్స్‌లో 4.5 తీవ్రతతో మరో భూకంపం సంభవించింది. ఈ సారి

- మిగతా 2 లో

హైడ్రోజన్ బాంబు పేలుస్తా

- ఓట్ల చోరీ గుట్టు రట్టు చేస్తా
- మోదీ ఇక ప్రజలకు ముఖం చూపలేరు
- రాహుల్ సంచలన వ్యాఖ్యలు
- బీహార్‌లో ముగిసిన 'ఓటర్ అధికార్ యాత్ర'
- 'గాంధీ సే అంబేద్కర్' మార్చ్‌ను అడ్డుకున్న పోలీసులు

పట్నా: దేశంలో ఓట్ల చోరీకి సంబంధించి తాము ఇప్పటికే అణుబాంబు పేల్చామని... త్వరలోనే మరింత శక్తిమంతమైన హైడ్రోజన్ బాంబు పేలుస్తామని ఓటర్ అధికార్ యాత్ర ముగింపు సందర్భంగా రాహుల్‌గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటారని చెప్పారు. లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ అధ్వర్యంలో బీహార్‌లో కాంగ్రెస్ చేపట్టిన 'ఓట్ అధికార్ యాత్ర' ముగింపును పురస్కరించుకుని సోమవారం పట్నాలో 'గాంధీ సే అంబేద్కర్' మార్చ్ నిర్వహించారు. అయితే ఈ పాదయాత్రను పోలీసులు మధ్యలోనే అడ్డుకున్నారు. తొలుత ఇండియా ఐక్యసంఘటన నాయకులు మహాత్మా గాంధీ విగ్రహం వద్ద పుష్పగుచ్ఛాలుంచి నివాళి అర్పించిన అనంతరం పాదయాత్రను ప్రారంభించారు. ఈ యాత్ర ఎస్పీ వర్మ రోడ్, ఎగ్జిబిషన్ రోడ్, డాక్ బంగ్లా క్రాసింగ్ గుండా సాగింది. రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, వికాస్‌షీల్ ఇన్సాన్ పార్టీ చీఫ్ ముకేష్ సహనీ, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, పార్టీ జాతీయ కార్యదర్శివర్గసభ్యులు అనీరాజా, సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, టీఎంసీ ఎంపి యూసుఫ్ పఠాన్, శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్, ఇతర ఇండియా ఐక్యసంఘటన నాయకులు పాల్గొన్నారు. కాగా, 'గాంధీ సే అంబేద్కర్' పాదయాత్రను డాక్ బంగ్లా క్రాసింగ్ వద్ద పోలీసులు అడ్డుకోవడంతో నేతలు అక్కడే బైఠాయించారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ...బీహార్ ఒక విప్లవాత్మక రాష్ట్రం అని... ఓటర్

- మిగతా 2 లో

జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి అండగా నిలవండి

- తెలుగు వ్యక్తికి జాతీయ స్థాయిలో అవకాశం
- అజెండా, జెండా పక్కనబెట్టి మద్దతివ్వండి: రేవంత్ రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్: తెలుగు వారంతా ఒకే తాటిపైకి వచ్చి సుదర్శన్ రెడ్డికి అండగా నిలవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. నీలం సంజీవరెడ్డి, వీవీ గిరి, పీవీ నరసింహారావు, జైపాల్ రెడ్డి, వెంకయ్య నాయుడు, ఎన్టీ రామారావు వంటి మహామహులు గతంలో జాతీయ స్థాయిలో కీలక పాత్ర పోషించారన్నారు. తాజ్ కృష్ణలో సోమవారం ఇండియా ఐక్యసంఘటన ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ... సుదర్శన్ రెడ్డి పోటీ చేయడంవల్ల ఎన్డీయేకి గట్టి పోటీ ఇస్తున్నట్టయిందని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని మార్చాలని, రిజర్వేషన్లు రద్దు చేయాలని ఎన్డీయే కూటమి ఒకవైపు, రాజ్యాంగాన్ని... రిజర్వేషన్లను కాపాడుకోవాలని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలని ఇండియా ఐక్యసంఘటన మరో వైపు ఎన్నికల్లో దిగాయని పేర్కొన్నారు. ఉప రాష్ట్రపతి రాజీనామాను దేశ ప్రజలు గమనిస్తున్నారని, తెలుగు వ్యక్తికి జాతీయ స్థాయిలో అవకాశం వచ్చిందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్, వైఎస్ జగన్, చంద్రశేఖర్ రావు, ఓవైసీ తో పాటు ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన 42 మంది ఎంపీలు, 18 మంది రాజ్యసభ్యులకు ఆత్మ ప్రభోదానుసారం ఓటు వేయాలని విజప్తి చేశారు. జాతీయ స్థాయిలో తెలుగు భాష రెండో స్థానంలో ఉన్నప్పుడు తెలుగువారు కూడా ఆ స్థాయిలో ఉండాలన్నారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి గెలిస్తే తెలుగు వారి ప్రతిష్ట పెరుగుతుందన్నారు. 18 ఏళ్ల కు ఓటు హక్కు ఇచ్చిన రాజీవ్ గాంధీ ఆలోచన ఒక వైపు.. ఓట్ చోర్ ఆలోచనతో మరో పార్టీ ఇంకో వైపు దేశంలో ఉన్నాయన్నారు.

సహాయ, మరమ్మతు
పనులు వేగవంతం

- వర్షాలు, వరద నష్టాలపై రెండు రోజుల్లో సమగ్ర నివేదిక
- తీవ్రంగా దెబ్బతిన్న జిల్లాలకు తక్షణ సాయం రూ.10 కోట్లు
- విపత్తుల సమయంలో కలెక్టర్లు, ఎస్పీలు వెంటనే స్పందించాలి
- వరదలపై సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

విశాలాంధ్ర-హైదరాబాద్: రాష్ట్రంలో ఇటీవల భారీ వర్షాలు, వరదలతో దెబ్బతిన్న రోడ్లు, భవనాలు, చెరువులు, కుంటలకు మరమ్మతులు చేపట్టడంతో పాటు విద్యుత్ సబ్ స్టేషన్ల పునర్నిర్మాణం పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్ర విపత్తు ఉపశమన నిధులు (ఎస్డీఆర్ఎఫ్) నిధులున్నా నిబంధనల ప్రకారం వాటిని వ్యయం చేయడంలో అలసత్వం చూపడంపై ముఖ్యమంత్రి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతేడాది ఉమ్మడి ఖమ్మం,

- మిగతా 2 లో

వరద ప్రభావిత ప్రాంతాలను
చక్కదిద్దండి

- గృహాలు కోల్పోయిన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు
- పంట నష్టంపై సర్వే చేయండి
- అవసరమైన ప్రదేశాల్లో వైద్య శిబిరాలు
- అధికారులకు కూనంనేని ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : వరద ప్రభావిత ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పర్యటించి నష్ట నివారణకు చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధికారులను ఆదేశించారు. వరద ముంపునకు గురైన ప్రాంతాలపై ఎమ్మెల్యే ఆరా తీశారు. చరవాణిలో అధికారులతో మాట్లాడుతూ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించాలని అన్నారు. మున్సిపల్, ఆర్ అండ్ బీ, విద్యుత్, పంచాయతీ, పోలీస్, రెవెన్యూ తదితర జిల్లా, డివిజన్ అధికారులకు వివిధ సూచనలు చేశారు. కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నియోజకవర్గంలో వివిధ గ్రామాలు, బస్తీల్లోని అంతర్గత రహదారులు దెబ్బతిన్నాయని తక్షణమే పునర్నిర్మాణం చేపట్టి పరిస్థితిని చక్కదిద్దాలన్నారు. దెబ్బతిన్న విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలు

- మిగతా 2 లో

మహిళాభ్యున్నతికి కృషి

స్వయం సహాయక సంఘాల మహిళలకు చేప పిల్లల పెంపకం బాధ్యత

సంచార చేపల విక్రయ వాహనాల పంపిణీలో భట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్: మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధిలో దేశంలోనే తెలంగాణను రోల్ మోడల్‌గా నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ప్రజాభవన్‌లో సోమవారం మహిళలకు సంచార చేపల విక్రయ వాహనాలను పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన భట్టి మాట్లాడుతూ... మహిళాభ్యున్నతికి చేపట్టిన పథకాలను పరిశీలించేందుకు అన్ని రాష్ట్రాల వారు తెలంగాణకు వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 46 వేల చెరువుల్లో చేప పిల్లల పెంపకానికి రూ.122 కోట్లు విడుదల చేశామని చెప్పారు. రాబోయే రోజుల్లో చేప, రొయ్య పిల్లల పెంపకం బాధ్యతలను స్వయం సహాయక సంఘాల మహిళలకు అప్పగిస్తామన్నారు. ఆ మేరకు కార్యాచరణ రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు వారితో సోలార్ పవర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేయించి ప్రభుత్వమే వారి నుంచి విద్యుత్ కొనుగోలు చేసి ఆదాయం సమకూర్చే కార్యక్రమం

- మిగతా 2 లో

ఉగ్రవాదాన్ని అణచివేస్తాం

- ఎస్‌సీఓ సభ్యదేశాల ప్రతిన
- పహల్గాం ఉగ్రదాడికి ఖండన

టియాంజిన్: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రవాద దాడిని సోమవారం షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సభ్యదేశాలు తీవ్రంగా ఖండించాయి. అయితే పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థలకు స్వర్గధామంగా ఉందని భారతదేశం చాలా కాలంగా చెబుతున్నప్పటికీ ఉమ్మడి ప్రకటనలో పాకిస్థాన్ పేరు ప్రస్తావించకపోవడం గమనార్హం. చైనాలోని టియాంజిన్‌లో జరిగిన శిఖరాగ్ర సమావేశం ముగిసిన తర్వాత వెలువడిన సంయుక్త ప్రకటనలో, చైనా, టర్కీతో సహా సభ్య దేశాలు దాడిలో మరణించిన, గాయపడిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి, సంతాపం వ్యక్తం చేశాయి. అటువంటి చర్యలకు పాల్పడినవారు, చేయించినవారు, సాయం చేసినవారి ని చట్టం ముందు నిలబెట్టి శిక్షించాలని నొక్కిచెప్పాయి. ఏరూపంలో ఉన్నప్పటికీ ఉగ్రవాదం, వేర్పాటువాదం, తీవ్రవాదంపై ఉమ్మడి పోరాటాన్ని కొనసాగించాలని ప్రతిన బూనాయి. అటువంటి బెదిరింపులను ఎదుర్కోవడంలో సార్వభౌమ ప్రభుత్వాలు, వాటి సంస్థలు ప్రాథమిక బాధ్యతను కలిగి ఉన్నాయని సభ్య దేశాలు పునరుద్ఘాటించాయి. ఉగ్రవాద, వేర్పాటువాద , తీవ్రవాద గ్రూపులను కిరాయి ప్రయోజనాల కోసం ఉపయోగించుకునే ప్రయత్నాలు ఆమోదయోగ్యం కాదని సభ్య దేశాలు స్పష్టం చేశాయి. వీటిని అణచివేసేందుకు సభ్య దేశాలు చేస్తున్న ప్రయత్నాలను గుర్తిస్తున్నామని వెల్లడించాయి. పాకిస్థాన్ జరిగిన ఉగ్రవాద దాడులను కూడా ఎస్‌సీఓ సభ్యదేశాలు ఖండించాయి. వాటిలో మే 21న జరిగిన జాఫర్ ఎక్స్‌ప్రెస్ బాంబు దాడి, ఖుజ్‌దార్ దాడి కూడా ఉన్నాయి. ఇక ఉగ్రవాదాన్ని అణచివేస్తామని ప్రతినబూనిన సభ్య దేశాలు... గాజాలో ఇజ్రాయిల్ చేపడుతున్న సైనిక చర్యను ఖండించాయి. గ్లోబల్ కౌంటర్-టెర్రరిజం స్ట్రాటజీని పూర్తిగా అమలు చేయడంలో ఐక్యరాజ్యసమితి ముఖ్య పాత్ర పోషిస్తుందని ఎస్‌సీఓ పేర్కొంది. ఉగ్రవాద గ్రూపులను సంయుక్తంగా ఎదుర్కోవడానికి ఐరాస చార్టర్, అంతర్జాతీయ చట్ట సూత్రాలకు అనుగుణంగా సంబంధిత ఐరాస భద్రతా మండలి తీర్మానాన్ని

- మిగతా 2 లో

యుద్ధం ఆపండి: మోదీ | **పశ్చిమ దేశాలే కారణం: పుతిన్** 8 లో

ఐక్యంగా పోరాడదాం

- ఎస్‌సీఓ వేదికగా మోదీ పిలుపు
- పాక్ వైఖరిని ఎండగట్టిన భారత ప్రధాని

2 లో

విశాలాంధ్ర

పాక్ ప్రధానిని పట్టించుకోని మోదీ



టియాంజిన్: చైనాలోని టియాన్‌జిన్ వేదికగా షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) 25వ శిఖరాగ్ర సదస్సు సోమవారం ప్రారంభమైంది. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు భారత ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సహా వివిధ దేశాధినేతలు హాజరయ్యారు. మోదీతో పుతిన్, జిన్‌పింగ్ కరచాలనం చేస్తూ... ఆలింగనం చేసుకుంటూ... సరదాగా మాట్లాడుకుంటూ చిరునవ్వులు చిందిస్తున్న దృశ్యాలు అందరినీ ఆకర్షించాయి. ఆపరేషన్ సిందూర్ తర్వాత మొదటిసారిగా షాంఘై సదస్సులో భారత్, పాక్ ప్రధానులు ఎదురుపడిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అందులో మోదీ, పుతిన్ కలిసి వెళుతుండగా పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అక్కడే నిల్చున్నప్పటికీ... మోదీ ఆయనను పట్టించుకోకుండా, పలకరించకుండా వెళ్లిపోయిన దృశ్యాలు కనిపిస్తున్నాయి. మరో సందర్భంలో పుతిన్ అక్కడి నేతలను పలకరిస్తున్న సమయంలో పాక్ ప్రధాని అక్కడున్న వారిని దాటుకొని పుతిన్‌తో కరచాలనం చేయడానికి ప్రయత్నిస్తున్న దృశ్యాలు వైరల్‌గా మారాయి. సమావేశంలో చాలా సందర్భాల్లో మోదీ... పాక్ ప్రధానిని పట్టించుకోకుండా దూరంగా ఉన్నారు. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత్, పాక్ మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొన్న విషయం తెలిసిందే. షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సులో పుతిన్‌ను కలవడం సంతోషకరమైన విషయమని మోదీ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. ఆయనతో ఉన్న చిత్రాలను పంచుకున్నారు.

భారత్ చర్యలు రష్యా యుద్ధానికి ఆజ్యం

ట్రంప్ వాణిజ్య సలహాదారు నవారో ఆరోపణ

వాషింగ్టన్: రష్యా-ఉక్రెయిన్ యుద్ధం విషయంలో భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో సంచలన ఆరోపణలు చేశారు. రష్యాకు భారత్ ఒక 'లాండ్రోమ్యాట్' (దుస్తులు ఉతికే యంత్రం) గా మారిందని, మాస్కో నుంచి తక్కువ ధరకు చమురు కొనుగోలు చేసి, శుద్ధి చేసి, అధిక లాభాలకు అమ్ముకుంటూ యుద్ధానికి పరోక్షంగా నిధులు సమకూరుస్తోందని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్ చర్యల వల్ల రష్యా యుద్ధ యంత్రాంగానికి ఇంధనం అందుతోందని నవారో ఆరోపించారు. "భారత్ రష్యాకు ఒక లాండ్రోమ్యాట్ తప్ప మరొకటి కాదు. మీరు భారతీయ ప్రజల ఖర్చుతో బ్రాహ్మణులను లాభపడేలా చేశారు. మనం దానిని ఆపాలి" అని నవారో అన్నారు. భారతీయ శుద్ధి కర్మాగారాలు డిస్కౌంట్ పొందిన రష్యన్ ముడి చమురును కొనుగోలు చేసి, ప్రాసెస్ చేసి, అధిక ధరకు ఎగుమతి చేస్తున్నాయని ఆరోపించారు. భారత్ ఈ విధంగా రష్యా నుంచి చమురు కొని లాభాలకు అమ్ముకోవడం వల్ల ఉక్రెయిన్‌లో ప్రజలు చనిపోతున్నారని, ఆ దేశానికి సాయం చేసేందుకు అమెరికా పన్ను చెల్లింపుదారులు మరింత డబ్బు పంపాల్సి వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్... రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌లతో ఎందుకు అంటకాగుతోందో తనకు అర్థం కావడం లేదని నవారో వ్యాఖ్యానించారు. నవారో తన ఇంటర్వ్యూలో 'ప్రాఫిటీరింగ్ బ్రహ్మిన్స్' అనే పదాన్ని వాడడం చర్చనీయాంశమైంది. ఆ పదం వాడుకపై తీవ్ర స్థాయిలో విమర్శలు వస్తున్నాయి.

రాజకీయ పార్టీలు భిన్న అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నాయి. ట్రంప్ హయాంలో భారత ఎగుమతులపై విధించిన దిగుమతి సుంకాలను నవారో సమర్థించుకున్నారు. రష్యా, చైనాలతో భారత్ సంబంధాలు ప్రపంచ స్థిరత్వాన్ని దెబ్బతీస్తున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రధాని మోదీ చైనాలో జరుగుతున్న షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సదస్సులో పాల్గొంటున్న తరుణంలోనే నవారో ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

అంతలోనే స్వరం మార్పు...

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో భారత్‌పై నోటికి వచ్చినట్లు మాట్లాడిన కొద్ది గంటల్లోనే ట్రంప్ కార్యవర్గం మెల్లగా స్వరం మార్చింది. మోదీ-పుతిన్ ద్వైపాక్షిక భేటీకి కొన్ని నిమిషాల ముందు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా భారత్-అమెరికా సంబంధాలను కొనియాడారు. వీటిని మరింత బలోపేతం చేయడానికి చర్యలు తీసుకొంటున్నట్లు ప్రకటించారు. "భారత్-అమెరికా సంబంధాలు సరికొత్త శిఖరాలను అందుకొంటున్నాయి. 21వ శతాబ్దంలోనే ఓ అర్థవంతమైన సమగ్ర బంధం. ఈ నెలలో మా మిత్రత్వాన్ని ముందుకు తీసుకెళ్లే అంశాలపై దృష్టిపెడుతున్నాం. వీటిల్లో సృజనాత్మకత, వ్యాపారం నుంచి రక్షణ, ద్వైపాక్షిక అంశాలు ఉండనున్నాయి. ఇరుదేశాల ప్రజల మధ్య నెలకొన్న స్నేహమే మా సహకారానికి పునాదులుగా నిలిచి మమ్మల్ని ముందుకు నడిపిస్తుంది. అంతేకాదు మా ఆర్థికబంధంలోని అద్భుతమైన అవకాశాలను మేము గుర్తించాము" అని మార్కో రూబియో పేర్కొన్నారు. మరోవైపు ఇప్పటికే ట్రంప్ విధించిన సుంకాలు చాలావరకు చట్ట విరుద్ధమని అమెరికా ఫెడరల్ అప్పీల్స్ కోర్టు తీర్పు ఇచ్చింది. అధ్యక్షుడు ట్రంప్ తన ఆర్థిక అధికారాలను అతిక్రమించి అధికంగా టారిఫ్‌లను పెంచినట్లు పేర్కొంది. 7-4 తేడాతో అప్పీళ్ల కోర్టు న్యాయమూర్తులు ఈ తీర్పు వెలువరించారు. ఈ క్రమంలో రూబియో ప్రకటన నష్ట నివారణ చర్యల్లో భాగమేనని విశ్లేషకులు చెబుతున్నారు.

ఒకే కారులో మోదీ, పుతిన్

టియాంజిన్: సాధారణంగా పెద్దపెద్ద సదస్సుల్లో దేశాధినేతలు వేర్వేరు కార్ల కాన్వాయ్‌ల్లో వేదికల వద్దకు చేరుకొంటారు. కానీ, తియాంజిన్‌లోని షాంఘై సహకార సదస్సులో మాత్రం భారత ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఒకే కారులో బయల్దేరి వేదిక వద్దకు చేరుకోవడం విశేషం. ఈ విషయాన్ని స్వయంగా ప్రధాని ట్విటర్‌లో పంచుకొన్నారు. 'ఎస్‌సీవో సదస్సు వేదిక వద్ద ప్రొసీడింగ్స్ ముగిసిన తర్వాత... పుతిన్, నేను కలిసి ఒకే కారులో మా ద్వైపాక్షిక భేటీ వేదిక వద్దకు చేరుకొన్నాం. ఇద్దరి మధ్య చర్చలు ఎప్పుడూ లోతుగా జరుగుతాయి' అని పేర్కొన్నారు. ఇరు దేశాధినేతల మధ్య నెలకొన్న స్నేహబంధానికి ఇది గుర్తుగా నిలిచింది. కాగా, షాంఘై సహకార సదస్సుకు పుతిన్ తన వాహన కాన్వాయ్‌ను తీసుకొచ్చారు. దీనిలో ఆయన వాడే ఆరస్ సెనేట్ లిమోసిన్ కూడా ఉంది. దీనికి ప్రత్యేకంగా చైనా డిప్లొమేటిక్ లైసెన్స్ కేటాయించింది. అమెరికా అధ్యక్షుడు వాడే బీస్ట్‌లా దీనిలో కూడా రష్యా అధినేత రక్షణకు చాలా ఫీచర్లను అమర్చారు. ఈ కారు చాలా ఆకర్షణీయంగా రోల్స్ రాయిస్, బెంట్లీ మోడల్స్‌ను కలిపి తయారుచేసినట్లు అనిపిస్తుంది.

అఫ్గాన్‌లో ఘోర విపత్తు

(మొదటిపేజీ తరువాయి)

భూకంప కేంద్రం 10 కిలోమీటర్ల లోతులో ఉంది. కాగా విపత్తు కారణంగా 800 మందికి పైగా దుర్మరణం చెందగా... 2500 మంది వరకు గాయాలపాలైనట్లు ఆ దేశ అధికారిక మీడియా సంస్థ రేడియో టెలివిజన్ అఫ్గానిస్థాన్ ఈ సంగతి వెల్లడించింది. భూకంప ధాటికి కునార్ ప్రావిన్స్ తీవ్రంగా ప్రభావితమైనట్లు సమాచారం. భూకంప తీవ్రతకు సంబంధించిన వివిధ వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. బాధితులకు అత్యవసర సహాయం అవసరమని పోస్టులు పెడుతున్నారు. భూకంపం కారణంగా అనేక గ్రామాల్లోని ఇళ్లు పూర్తిగా నేలమట్టమయ్యాయని వార్దక్ ప్రావిన్స్ మాజీ మేయర్ జరీఫా ఘఫ్ఫారీ పోస్టు పెట్టారు. ఈ విపత్తు ధాటికి వందలాది కుటుంబాలు కకావికలమైనట్లు పేర్కొన్నారు. అఫ్గానిస్థాన్‌లోని కునార్, నోరిస్థాన్, నంగర్హార్ ప్రావిన్స్‌లు భూకంపం కారణంగా తీవ్రంగా నష్టపోయాయని తెలిపారు. ఇళ్లు కూలిపోవడంతో అనేక కుటుంబాలు వీధిన పడ్డాయని, వారి జీవితం అగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లోని మహిళలు, చిన్నారులు, వృద్ధులు తీవ్ర గాయాలపాలై ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని, బాధితుల పరిస్థితి దుర్భరంగా ఉందని తెలిపారు. అసమర్థ తాలిబన్ ప్రభుత్వం ఈ విపత్తును ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా లేదని ఆరోపించారు. ఈ సమయంలో కునార్ ప్రజలకు సాయం అత్యవసరమని, అంతర్జాతీయ సమాజం, మానవతా సంస్థలు సత్వరమే స్పందించి బాధితులను ఆదుకోవాలని కోరారు. అవసరమైన ఆహారం అందించి, ఆశ్రయం కల్పించాలని పోస్ట్ పెట్టారు. అ దేసమయంలో భూకంపం కారణంగా పలువురు మరణించారనే వార్త విని తాను చలించిపోయానని క్రికెటర్ రహ్మనుల్లా గుర్బాజ్ పోస్టు పెట్టారు. బాధితుల కుటుంబం కోసం ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. క్షతగాత్రులు సమీపంలోని ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని అంతకుముందు ఓ అధికారి తెలిపారు. 20 నిమిషాల వ్యవధి తర్వాత 4.5 తీవ్రతతో మరో భూకంపం వచ్చినట్లు పేర్కొన్నారు. గతేడాది అక్టోబర్ 7వ తేదీన అఫ్గానిస్థాన్‌లో 6.3 తీవ్రతతో భూకంపం సంభవించింది. ఆ వెంటనే అనేకసార్లు భూప్రకంపనలు సంభవించాయి. దీంతో 4,000 మంది మరణించారని తాలిబన్ ప్రభుత్వం అంచనా వేసింది. ఐక్యరాజ్యసమితి దాదాపు 1,500 మంది మరణాలు సంభవించాయని ప్రకటించింది. ఇటీవలి కాలంలో అఫ్గానిస్థాన్‌ను తాకిన అత్యంత ఘోరమైన ప్రకృతి వైపరీత్యం ఇది.

అన్ని విధాలుగా ఆదుకుంటాం: భారత ప్రధాని మోదీ

అఫ్గానిస్థాన్‌లో భారీ భూకంపం సంభవించి... వందలమంది ప్రజలు ప్రాణాలు కోల్పోవడంపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ విపత్తులో కుటుంబసభ్యులను, సన్నిహితులను కోల్పోయిన వారికి తగిన శక్తినివ్వాలని... గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. భూకంపం ధాటికి నష్టపోయిన అఫ్గాన్‌కు అన్ని రకాల మనవతా సాయం అందించి.. ఆ దేశాన్ని ఆదుకునేందుకు భారత్ సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు.

హైడ్రోజన్ బాంబు పేలుస్తా

(మొదటిపేజీ తరువాయి)

అధికార్ యాత్ర ద్వారా దేశానికి ఒక సందేశం ఇచ్చిందని పేర్కొన్నారు. తాము రాజ్యాంగాన్ని ఖూనీ చేయనీయబోమని, అందుకే యాత్ర చేపట్టామన్నారు. తాము చేపట్టిన ఈ యాత్రకు అద్భుత స్పందన వచ్చిందన్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చి 'ఓట్‌చోర్ గద్దీ చోడ్' అనే నినాదాన్ని ఇచ్చారన్నారు. తాను బీజేపీకి ఒక విషయం చెప్పాలనుకుంటున్నానన్నారు. 'మీరు అణు బాంబు కంటే పెద్దది ఏదైనా విన్నారా? అదే హైడ్రోజన్ బాంబు. బీజేపీ శ్రేణులారా సిద్ధంగా ఉండండి. హైడ్రోజన్ బాంబు వస్తోంది. ఓటు చోరీ వాస్తవికతను ప్రజలు త్వరలో తెలుసుకోబోతున్నారు' అని రాహుల్‌గాంధీ హెచ్చరించారు. ఆ తరువాత మోదీ దేశ ప్రజల్లో తలెత్తుకోలేరన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు దొంగిలించబడ్డాయని చెప్పారు. కర్నాటకలో బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ పరిధిలోని మహదేవపుర అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఓటు చోరీ ఎలా జరిగిందో తమ పార్టీ ఆధారాలతో సహా చూపించిందని చెప్పారు. బీహార్ యువతకు తాను చెప్పాలనుకుంటున్నానని.... ఓటు చోరీ అంటే హక్కుల చోరీ, ప్రజాస్వామ్య చోరీ, ఉపాధి చోరీ అని, మీ రేషన్ కార్డుతో పాటు ఇతర హక్కులను లాక్కుంటారని రాహుల్ పేర్కొన్నారు.

బీజేపీ, ఆర్ఎస్ఎస్ మాయలో నితీశ్: ఖర్గే

జేడీయూ అధినేత నితీశ్‌కుమార్ ఒకప్పుడు సోషలిజం గురించి మాట్లాడేవారని... కానీ ఆ తర్వాత బీజేపీ ఉచ్చులో పడిపోయారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నిప్పులు చెరిగారు. రాష్ట్ర ప్రజలు ఆయనను చెత్తకుండీలో విసిరివేస్తారన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు చోరీ (ఓట్ల దొంగతనం) ద్వారా గెలవడానికి ప్రయత్నిస్తున్నారని, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం త్వరలో ఓడిపోవడం ఖాయమని ఖర్గే ఉద్ఘాటించారు. ఎన్నికల పేదలు, వెనుకబడిన వర్గాలు, దళితులతో కూడిన కొత్త ప్రభుత్వం ఏర్పడుతుందని ఆయన స్పష్టం చేశారు. ఓటర్ అధికార్ యాత్ర దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైందని, దానిని భంగపరిచే ప్రయత్నాలు జరిగినా...బీహార్ ప్రజలు, మహాఘట్బంధన్ వెనక్కి తగ్గలేదన్నారు.

ఎస్ఐఆర్ పేరుతో హక్కులు లాక్కుంటున్నారు: హేమంత్

బీహార్‌లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఎస్ఐఆర్ పేరుతో ప్రజల హక్కులను లాక్కుంటున్నదని, ఇష్టానుసారం ఓటర్ల జాబితాలను తయారు చేస్తున్నారని జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ మండిపడ్డారు. ఎన్డీఏ ప్రభుత్వం విభజించి పాలించు విధానాన్ని అనుసరిస్తోందన్నారు. పాలక కూటమిని అధికారం నుండి తొలగించేందుకు ఇండియా ఐక్యసంఘటన పక్షాలు ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. బీజేపీ ప్రతిపక్ష నాయకులపై ఈడీ, సీబీఐ, ఇతర కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగిస్తోందని, అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆయన ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో తనను జైలుకు పంపారని, అసెంబ్లీ ఎన్నికల సమయంలో జైలు నుండి బయటకు వచ్చాక జార్ఖండ్‌లో భారీ మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో తాను జైలు నుండి బయటకు వచ్చి ఉంటే... వారు జార్ఖండ్‌లో ఒక్క స్థానం గెలిచి ఉండేవారు కాదన్నారు.

బీజేపీ అక్రమాలను సహించం: డి.రాజా

ప్రజాస్వామ్యాన్ని దొంగిలించడానికి బీజేపీ చేస్తున్న కుట్రల్ని సీపీఐ, ఇండియా ఐక్యసంఘటన అనుమతించవని, ప్రతి పౌరుడు తమ ఓటు వేస్తారని, ప్రజల ఐక్య బలం మోసపూరిత పాలనను ఓడిస్తుందని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా అన్నారు.

అవినీతిలో నితీశ్ భీష్మ పితామహుడు: తేజస్వీయాదవ్

బీహార్‌లో ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అనేక అక్రమాలకు పాల్పడిందని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ఆరోపించారు. నితీశ్ అవినీతిలో భీష్మ పితామహుడని ఆయన ఎద్దేవా చేశారు. బీహార్‌లో ఎస్ఐఆర్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై తేజస్వీ తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల కమిషన్ సహాయంతో ఇద్దరు బీజేపీ నాయకులు దేశంలో ప్రజాస్వామ్యాన్ని అంతం చేయాలనుకుంటున్నారని మండిపడ్డారు. బీహార్ ముఖ్యమంత్రికి స్పృహ లేదని, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఆయన ప్రభుత్వాన్ని అధికారం నుండి తరిమివేస్తారని తేజస్వి పేర్కొన్నారు.

సహాయ, మరమ్మతు పనులు వేగవంతం

(మొదటిపేజీ తరువాయి)

వరంగల్ జిల్లాల్లో వర్షాలతో తీవ్ర నష్టం వాటిల్లినా కేంద్రం నుంచి సరైన సహాయం అందకపోవడంపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. గతంలో కేంద్రం ఇచ్చిన హామీ నెరవేర్చకపోవడం... గతేడాదికి సంబంధించి రావల్సిన నిధులు... ప్రస్తుతం వ్యవసాయ, పశు సంవర్ధక, నీటిపారుదల, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, వైద్యారోగ్యం, విద్యుత్ శాఖల పరిధిలో వాటిల్లిన నష్టంపై సమగ్ర నివేదికలు రూపొందించాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఈ రెండు నివేదికలను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలోని బృందం ఈ నెల నాలుగో తేదీన ఢిల్లీలో కేంద్ర మంత్రులను కలిసి అందజేస్తుందని సీఎం తెలిపారు. భారీ వర్షాలు, వరదలతో వాటిల్లిన నష్టాలపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సచివాలయంలో సోమవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. వరదలతో రాష్ట్రవ్యాప్తంగా 257 చెరువులు, కుంటలకు గండి పడిందని అధికారులు తెలుపగా... ముఖ్యమంత్రి స్పందిస్తూ చిన్న నీటి పారుదల విభాగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని, ఆర్ఆర్ఆర్, ప్రధానమంత్రి క్రిషి సంచాయ్ యోజన, ఇతర కేంద్ర ప్రాయోజిత పథకాలను వినియోగించుకొని చిన్న నీటి వనరులకు మరమ్మతులు, పునరుద్ధరణ పనులు చేపట్టాలని సూచించారు. గతంలో నీటి వినియోగదారుల సంఘాల అధ్వర్యంలో చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు, డిస్ట్రిబ్యూటరీల వారీగా సంఘాలు ఉండేవని సీఎం గుర్తు చేశారు. నీటి వినియోగదారుల సంఘాలకు సంబంధించిన నిబంధనలు పరిశీలించి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్లు నూతన ప్రతిపాదనలతో నివేదిక సమర్పించాలని సీఎం ఆదేశించారు. నివేదికపై మంత్రివర్గంలో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని సీఎం తెలిపారు.

2.36 లక్షల ఎకరాల్లో పంట నష్టం

తమ ప్రాథమిక అంచనా ప్రకారం రాష్ట్రంలోని 82 మండలాల్లో 2.36 లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖ అధికారులు సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. రెండు రోజుల్లో పూర్తి వివరాలతో సమగ్ర నివేదిక సమర్పిస్తే కేంద్రం దృష్టికి తీసుకెళతామని సీఎం తెలిపారు. నీట మునిగిన సబ్ స్టేషన్ల స్థానంలో అధునాతన సామగ్రి, సామర్థ్యంతో కూడిన సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్‌ను సీఎం ఆదేశించారు. పురపాలక, పంచాయతీరాజ్, జీహెచ్ఎంసీ పరిధిలో వీధి దీపాల నిర్వహణ, ఏర్పాటుపై సమీక్ష నిర్వహించి పరిష్కారంతో రావాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు సీఎం సూచించారు. చెంగిచర్లతో పాటు జియాగుడ, అంబర్‌పేటలోని స్లాటర్ హౌస్‌ల్లో హలాల్, జట్కా సక్రమంగా జరిగేలా చూడాలని.. అధునాతన యంత్రాలు వాడేలా చూడాలని.. అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణ ఉండాలని, మాంసం విక్రేతలు అన్ని నిబంధనలు పాటించేలా చూడాలని, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, తాగు నీటి సరఫరా, పశు సంవర్ధక శాఖలు సమగ్ర నివేదికలు రూపొందించి రెండు రోజుల్లో అందజేయాలని సీఎం ఆదేశించారు.

భవనాల నిర్మాణం వేగవంతం

రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న నూతన వైద్య కళాశాలలు, నర్సింగ్ కళాశాలలు, ఆసుపత్రుల భవనాల పనులు వేగవంతం చేయడంతో పాటు వాటి ప్రారంభానికి తేదీలు నిర్ణయించాలని ఆ శాఖ కార్యదర్శి క్రిస్టియానా జోంగ్తూని సీఎం ఆదేశించారు. కామారెడ్డి, ఆదిలాబాద్, రాజన్న సిరిసిల్ల, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లతో సీఎం మాట్లాడి అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. సహాయక పనులు వేగవంతం చేయాలని, పరిహారాలు వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు. అన్ని శాఖలు ఎస్డీఆర్ఎఫ్ నిధులను సక్రమంగా వినియోగించడంతో పాటు సకాలంలో వినియోగితా పత్రాలు (యూసీ) సమర్పించాలని తెలిపారు.

మారుతున్న వాతావరణ పరిస్థితులతో ముస్ముందు అకాల వర్షాలు, వరదలు ఎక్కువగా వచ్చే ప్రమాదం ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు అప్రమత్తంగా ఉండడంతో పాటు విపత్తుల సమయంలో తక్షణమే క్షేత్ర స్థాయికి వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించాలని ఆదేశించారు.

ప్రస్తుతం వర్షాలకు తీవ్రంగా దెబ్బతిన్న జిల్లాల్లో పనులకు కంటింజెంట్ కింద కలెక్టర్లకు రూ.10 కోట్లు, సాధారణ నష్టం వాటిల్లిన జిల్లాల్లోని కలెక్టర్లకు రూ.5 కోట్ల చొప్పున నిదులు విడుదల చేస్తామని సీఎం తెలిపారు.

వరద ప్రభావిత ప్రాంతాలను చక్కదిద్దండి

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటు చేసి విద్యుత్తు సరఫరా పునరుద్ధరించాలని సూచించారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజలు అనారోగ్యంబారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అవసరమైన చోట వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు చికిత్స అందించాలన్నారు. ఇళ్లు కోల్పోయిన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. పంటల నష్టంపై సర్వే చేపట్టి నష్ట అంచనాను ప్రభుత్వానికి నివేదించడం ద్వారా బాధితులకు పరిహారం అందేవిధంగా చొరవ తీసుకోవాలని సూచించారు. నిర్వాసితులకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు అందితే ఉపేక్షించేదిలేదని కూనంనేని హెచ్చరించారు.

జీఎస్‌టీ వసూళ్లు రూ.1.86 లక్షల కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

ఆగస్టుతో పోలిస్తే... 21 శాతం ఎక్కువ వసూళ్లు వచ్చాయి. 2024లో ఇదే సమయానికి రూ.3,298 కోట్లు వసూలు కాగా... ఈసారి ఆ మొత్తం రూ.3,989 కోట్లకు చేరింది. తెలంగాణ విషయానికి వస్తే 12 శాతం వృద్ధి కనిపించింది. గత ఏడాది ఆగస్టులో రూ.4,569 కోట్లు వసూలు కాగా... ఈసారి రూ.5,103 కోట్లు వచ్చాయని కేంద్రం వెల్లడించింది. నిత్యం వాడే ఉత్పత్తులపై జీఎస్‌టీ రేట్లు తగిస్తామని ప్రధాని మోదీ ప్రకటించారు. దీపావళి నాటికి రేట్లు తగ్గించి పండగ ఆనందాన్ని రెట్టింపు చేస్తామని చెప్పారు. మోదీ ప్రకటన వెలువడిన వెంటనే ఆర్థిక మంత్రిత్వశాఖ... జీఎస్‌టీలో ఇకపై రెండు శ్లాబులే ఉండబోతున్నాయని వెల్లడించింది. ప్రస్తుతం 5, 12, 18, 28 శాతం జీఎస్‌టీ శ్లాబులు ఉన్నాయి. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో సెప్టెంబరు 3-4 తేదీల్లో జీఎస్‌టీ మండలి భేటీ కానుంది. ఈ సమావేశంలో జీఎస్‌టీ రేట్ల మార్పులపై నిర్ణయం తీసుకోనున్నారు. కొనుగోలుదార్ల ఆసక్తి, గిరాకీ బలంగా ఉన్నాయని, అయితే పన్ను రేట్లలో మార్పులు చేయొచ్చన్న అంచనాలతో వేచి చూసే ధోరణి పాటిస్తున్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు. ఈ కొనుగోళ్ల వాయిదా తాత్కాలికమేనని, జీఎస్‌టీ రేట్లపై స్పష్టత వస్తే అమ్మకాలు పుంజుకుంటాయని విశ్లేషిస్తున్నారు.

నాలుగేళ్ల స్థానికత తప్పనిసరి

(మొదటిపేజీ తరువాయి)

ఇక్కడే చదివి ఉండాలనే నిబంధనను రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. అయితే ఈ జీవోను సవాల్ చేస్తూ కొందరు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు సింగిల్ జడ్జి, ఆ తర్వాత డివిజన్ బెంచ్ ప్రభుత్వ నిబంధనకు వ్యతిరేకంగా తీర్పులిచ్చాయి. హైకోర్టు తీర్పులను సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం, రాష్ట్ర ప్రభుత్వ వాదనలతో ఏకీభవించింది. స్థానిక విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తీసుకొచ్చిన నిబంధన సరైనదేనని అభిప్రాయపడింది. ఈ క్రమంలో హైకోర్టు ఇచ్చిన తీర్పులను రద్దు చేస్తూ, ప్రభుత్వ జీవోను సమర్థిస్తూ సోమవారం తుది తీర్పును వెలువరించింది. సుప్రీంకోర్టు తాజా తీర్పుతో వైద్య విద్య ప్రవేశాల్లో స్థానికతపై నెలకొన్న వివాదానికి తెరపడినట్లయింది.

ఐక్యంగా పోరాడదాం

టియాంజిన్: చైనాలోని టియాంజిన్‌లో జరుగుతున్న ఎస్‌సీవో వేదికగా భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్ వైఖరిని ఎండగట్టారు. పాక్ పేరు ప్రస్తావించకుండా కొన్ని దేశాలు ఉగ్రవాదానికి బహిరంగంగా మద్దతిచ్చాయని దుయ్యబట్టారు. పాక్ ప్రధాని షెహబాజ్ సమక్షంలోనే ఆ దేశ వైఖరిని తప్పుబట్టారు మోదీ. ఉగ్రవాదం శాంతికి ముప్పుగా పరిణమించిందని పేర్కొన్నారు. ఉగ్రవాద సమస్యతో భారత్ నాలుగు దశాబ్దాలుగా ఇబ్బందులు పడుతోందని తెలిపారు. ఏ దేశానికైనా భద్రత, శాంతి, స్థిరత్వం అనేవి అభివృద్ధికి పునాదులని మోదీ పేర్కొన్నారు. "ఉగ్రవాదం శాంతికి ముప్పుగా పరిణమించింది. ఉగ్రవాద సమస్యలతో భారత్ 4 దశాబ్దాలుగా ఇబ్బందులు పడుతోంది. ఎస్‌సీవో సభ్యులుగా భారత్ కీలక భూమిక పోషిస్తోంది. ఎస్‌సీవో కోసం భారత్ విజన్, పాలసీ 3 పిల్లర్లపై ఆధారపడి ఉంది. భద్రత, అనుసంధానం, అవకాశాలు 3 పిల్లర్లుగా నిలుస్తాయి. ఉగ్రవాదం, వేర్పాటువాదం సవాళ్లుగా మారాయి. ఇటీవల పహల్గాం దాడి ఉగ్రవాదుల పైశాచికత్వాన్ని చాటింది. పహల్గాం దాడి వేళ భారత్‌కు మద్దతుగా నిలిచిన దేశాలకు కృతజ్ఞతలు" అని మోదీ పేర్కొన్నారు. ఉగ్రవాదం, వేర్పాటువాదం, తీవ్రవాదం పెద్ద సవాళ్లుగా మారాయని మోదీ అభిప్రాయపడ్డారు. ఉగ్రవాదం ఒక దేశ భద్రతకు మాత్రమే సవాలు కాదని, మానవాళి మొత్తానికీ ఉగ్రవాదం ఉమ్మడి సవాలని అన్నారు. ఉగ్రవాదంతో ఏ దేశం, ఏ సమాజం, ఏ పౌరుడూ సురక్షితం కాదని తెలిపారు. అందుకే ఉగ్రవాదంపై పోరులో దేశాలన్నీ ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు. అల్‌ఖైదా, అనుబంధ సంస్థలతో పోరులో భారత్ చొరవ చూపిందని, ఉగ్రవాదులకు ఆర్థిక సహకారానికి వ్యతిరేకంగా భారత్ గళం వినిపించిందన్నారు.

ఎస్‌సీవో సభ్య దేశాల మధ్య మరింత సహకారం అవసరం

అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణల కోసం ఎస్‌సీవో సభ్య దేశాల మధ్య మరింత సహకారం అవసరమని ప్రధాని మోదీ అభిప్రాయపడ్డారు. అనుసంధాన ప్రక్రియలో దేశాల సౌరభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను గౌరవించాలన్నదే తమ విధానమని స్పష్టం చేశారు. చైనా చేపడుతున్న బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్‌ను ఉద్దేశించి మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. అంతకుముందు చైనాలోని టియాంజిన్ వేదికగా 25వ షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సు అధికారికంగా ప్రారంభమైంది. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ అధ్యక్షతన జరుగుతున్న ఈ సదస్సుకు భారత ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సహా వివిధ దేశాధినేతలు హాజరయ్యారు. సదస్సు ప్రారంభ సమయంలో పుతిన్‌ను ప్రధాని మోదీ ఆత్మీయంగా పలకించారు. షేక్‌హ్యాండ్ ఇచ్చి ఆలింగనం చేసుకున్నారు. ఆ చిత్రాలను మోదీ తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు.

పుతిన్‌ను కలవడం ఎల్లప్పుడూ ఆనందంగా ఉంటుందని రాసుకొచ్చారు. జిన్‌పింగ్, పుతిన్‌తో సంభాషించిన చిత్రాలను కూడా పంచుకున్నారు. ఆ తర్వాత వారు ఎస్‌సీఓ సభ్యుల గ్రూప్ ఫొటో కోసం వేదిక వైపు నడిచారు.

ఉగ్రవాదాన్ని అణచివేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

అమలు చేయాలని తెలిపింది. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం ప్రధాన సవాల్‌గా మారిందని ఎస్‌సీఓ విడుదల చేసిన ప్రకటన పేర్కొంది.

అతిపెద్ద సదస్సు ఇదే!

షాంఘై సహకార సంస్థ అనేది 10 సభ్య దేశాల కూటమి. ఇందులో భారత్, రష్యా, చైనా, పాకిస్థాన్, ఇరాన్?, కజకిస్థాన్, కిర్గిస్థాన్, తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్, బెలారస్ ఉన్నాయి. ఏటా ఓ దేశం అధ్యక్ష బాధ్యతలు వహిస్తుండగా, ఈ సారి ఎస్‌సీఓ ప్లస్ సమ్మిట్‌ను చైనా భారీగా నిర్వహించింది. ఈ సదస్సులో టర్కీ, ఇండోనేసియా, మలేసియా, వియత్నాం, నేపాల్, మాల్దీవుల నేతలు హాజరయ్యారు. వీరితో పాటు వివిధ అంతర్జాతీయ సంస్థల అధికారులు పాల్గొన్నారు. దీంతో ఎస్‌సీఓ చరిత్రలోనే అత్యంత గొప్పగా ఈ సదస్సును నిర్వహించినట్లయింది.

ఉత్తరాంధ్ర, కోస్తాకు భారీ వర్షసూచన

(మొదటిపేజీ తరువాయి)

వెళ్లరాదని సూచించారు. రేపు విజయనగరం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం 5 గంటల సమయానికి విజయనగరం జిల్లా గుర్లలో 76.7 మిమీ, శ్రీకాకుళం జిల్లా లావేరులో 65.5 మిమీ, మన్యం జిల్లా జియమ్మవలసలో 63.7 మిమీ, విజయనగరం పెద్దనడిపల్లిలో 61.5 మిమీ, అనకాపల్లి జిల్లా నరసింగపల్లిలో 60 మిమీ చొప్పున వర్షపాతం నమోదైందని ప్రఖర్ జైన్ వెల్లడించారు. గోదావరి వరద నీటిమట్టం భద్రాచలం వద్ద ప్రస్తుతం 44.4 అడుగులు ఉందన్నారు. ధవళేశ్వరం కాటన్ బ్యారేజి వద్ద ఇన్‌ఫ్లో, ఔట్ ఫ్లో 11.91 లక్షల క్యూసెక్కులు ఉందని, మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతుందన్నారు.

మహిళాభ్యున్నతికి కృషి

(మొదటిపేజీ తరువాయి)

చేపట్టిందని తెలిపారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దేందుకు మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందజేస్తున్నామని వివరించారు. ప్రతి సంవత్సరం రూ.20 వేల కోట్లు వడ్డీ లేని రుణాలు పంపిణీ చేయాలని నిర్ణయించి మొదటి ఏడాదిలో రూ. 21,600 కోట్లు వడ్డీ లేని రుణాలు పంపిణీ చేసినట్టు చెప్పారు. శిల్పారామం వద్ద విలువైన స్థలాన్ని మహిళా సంఘాలకు ఇచ్చి ఆర్థికంగా వారిని ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. అన్ని జిల్లాల్లో డ్వాక్రా బజారులు ఏర్పాటు చేస్తామన్నారు. సంక్షేమ పథకాల రూపంలో ఇచ్చే ప్రతి రూపాయి రాష్ట్ర జీడీపీ పెరుగుదలకు దోహదపడుతుందన్నారు. బలమైన కుటుంబ వ్యవస్థ కేవలం మహిళల ద్వారానే సాధ్యమవుతుందన్నారు.

చేపల పరిశ్రమ... అభివృద్ధికి మైలురాయి: సీతక్క, శ్రీహరి

ప్రభుత్వ ప్రోత్సాహాలను మహిళలు అందిపుచ్చుకోవాలని, చేపల పరిశ్రమ అభివృద్ధికి మైలురాయి అని మంత్రులు సీతక్క, వాకిటి శ్రీహరి అన్నారు. ఆర్టీసీ అద్దె బస్సుల ద్వారా ఒక్కో మహిళా సంఘం ప్రతినెల రూ.70 వేలు సంపాదిస్తున్నట్లు తెలిపారు. పెట్రోల్ బంకుల ద్వారా ప్రతినెల సుమారు ఐదు లక్షల ఆదాయం మహిళా సంఘాలకు వస్తున్నట్లు చెప్పారు. మహిళల కోసం వడ్డీ లేని రుణాలు, ఉచిత రవాణా, రూ. 500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, సన్న బియ్యం పంపిణీ వంటి అనేక సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు. సోలార్ కంపెనీలు, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, ఈవెంట్ మేనేజ్‌మెంట్‌లను ప్రోత్సహిస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు.

వర్షాల దృష్ట్యా ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్ : రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలు, ఆస్తి, ప్రాణ, పంట నష్టాలపై రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, దనసరి అనసూయ సీతక్క అడ్లూరి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావులతో కలిసి ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, సంబంధిత అధికారులతో హైద్రాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహింస్తున్నారు. వర్షాల కారణంగా అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలను అప్రమత్తం చేయాలని వారు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, (రెవెన్యూ) కె.అనిల్ కుమార్, జడ్పీ సీఈవో పురుషోత్తం, డిపిఓ హరిప్రసాద్, ఈఈ పీఆర్ విద్యాసాగర్, డిఏఓ విజయనిర్మల, ఈఈ ఇరిగేషన్ వసంత్, ఎన్పిడీసిఎల్ ఎస్ఈ, సిపిఓ, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు వాగులు దాటకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు

విశాలాంధ్ర - గూడూరు/ కొత్తగూడ/గంగారం : మహబూబాబాద్ జిల్లా గూడూరు, కొత్తగూడ, గంగారం మండలాలలో గూడూరు ఎస్సై గిరిధర్ రెడ్డి, కొత్తగూడ ఎస్ఐ రాజకుమార్, గంగారం ఎస్సై రవికుమార్‌లు భారీ వర్షాలతో వాగులు వంకలు పొంగిపోతుంటే ప్రజలు వాగులు దాటకుండా సోమవారం హెచ్చరిక బోర్డులను పెట్టారు. గూడూరు పాకాల వాగు, కొత్తగూడ గాదేవాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. కొత్తపల్లి, కొత్తగూడ మధ్య కూడా వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఎవరు వాగు దాటే ప్రయత్నం చేయరాదంటూ పోలీసులు హెచ్చరించారు. భీముని పాద జలపాతం పాల నురగ లాగా ఉరకలు వేస్తున్నది. భీమునిపాద జలపాద సందర్శనలను అధికారులు, సిబ్బంది నిలిపివేశారు. కొత్తగూడ ఎమ్మార్వో రాజ్‌కుమార్ అధికారులతో సంప్రదింపులు జరిపి వాగులు పొంగే వైపు ప్రయాణికులు వెళ్ళరాదంటూ చేపల వేటకు వెళ్లే మత్స్యకారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

సురవరం సంస్మరణ సభకు తరలిన నేతలు

విశాలాంధ్ర బ్యూరో - నాగర్‌కర్నూల్ : భారత కమ్యూనిస్టు పార్టీ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి స్వగ్రామమైన గద్వాల జిల్లా కంచుపాడులో సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆయన సంస్మరణ సభకు నాగర్‌కర్నూల్ జల్లా నలుమూలల నుండి వందలాది మంది కమ్యూనిస్టు నాయకులు బయలుదేరి వెళ్లారు. సురవరం సుధాకర్ రెడ్డి సంతాప సభకు తెల్కపల్లి మండలం నుండి బయలుదేరి వెళ్లిన వారిలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కేశవులు గౌడ్, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి సూర్య శంకర్ గౌడ్, సిపిఐ తెల్కపల్లి మండల కార్యదర్శి వేనేపల్లి రవీందర్, ఏఐవైఎఫ్ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు దేశమోని ఆంజనేయులు సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బాలమురళితో పాటు శాఖ సెక్రెటరీ బుగ్గ స్వామి గౌడుగు విష్ణు, బుచ్చల్, సుల్తాన్ కృష్ణారెడ్డి జమ్ములు నారాయణ నరసింహ సంతాప సభకు వెళ్లిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కె కేశవులు గౌడ్ మాట్లాడుతూ సురవరం సుధాకర్ రెడ్డి రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగిన రోజుల్లో అందరికీ సుపరిచితుడని, ఆయన మరణం పార్టీకి ఈ ప్రాంతానికి ఎంతో లోటు అని పేర్కొన్నారు. కమ్యూనిస్టు పార్టీలో నిబద్ధతగా పనిచేసి విద్యార్థి దశ నుండి భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎదిగిన గొప్ప నాయకుడు సురవరం అని తెలిపారు.

పండుగలు సమాజంలో ఐక్యత, స్నేహభావాన్ని పెంపొందిస్తాయి

విశాలాంధ్ర - తొర్రూరు: గణపతి బప్పా ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో ఉండాలని, గ్రామాలు అభివృద్ధి చెందాలని టీపీసిసి వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లాలోని తొర్రూరు మున్సిపల్ పట్టణ కేంద్రంలోని 14వ వార్డు మండలంలోని పోలేపల్లి, మడిపెల్లి, కంటాయపాలెం గ్రామాల్లో గ్రామస్థుల ఆహ్వానం మేరకు టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి వినాయకచవితి సందర్భంగా పలు వినాయక మండపాలను సందర్శించి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం 14 వ వార్డులో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ ప్రజలతో కలిసి పండుగ వాతావరణాన్ని పంచుకున్నానని, గణపతి బప్పా ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని, గ్రామాలు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. పండుగలు సమాజంలో ఐక్యత, స్నేహభావానికి పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు, మండల నాయకులు, స్థానిక నాయకులు, మహిళలు, యువత, గ్రామస్థులు పాల్గొని వినాయక చవితి వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు.

సురవరం ఆశయ సాధనకు పోరాటం

విశాలాంధ్ర - వనపర్తి : సురవరం సుధాకర్ రెడ్డి సమ సమాజ ఆశయ సాధనకు పోరాటం సాగించాలని సిపిఐ అనుబంధ ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్, విజయ్ పట్టణ కార్యదర్శి రమేష్ పిలుపునిచ్చారు. సోమవారం గద్వాల జిల్లా ఉండవల్లి మండలం కంచుపాడు లో సిపిఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభకు పానుగల్ వనపర్తి గోపాల్పేట మండలాల నేతలు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. అంబేద్కర్ చౌరస్తాలో సుధాకర్ రెడ్డికి జోహార్లు అర్పించారు. ఉమ్మడి పాలమూరు జిల్లా కంచుపాడులో జన్మించి ప్రజా పోరాటాలు ఊపిరిగా జాతీయ రాజకీయాలకు ఎదిగిన మచ్చలేని నాయకుడు అన్నారు. దేశ సిపిఐ చరిత్రలో, తెలంగాణ రాష్ట్రం ఉన్నంతవరకు ఆయన పేరు చిరస్థాయిగా ఉంటుందన్నారు. తెలంగాణలో ఆయన పేరు చిరస్థాయిగా ఉండేలా దేనికైనా ఆయన పేరు పెడతామని సీఎం ప్రకటించటం సముచిత గౌరవం కాగలదన్నారు. దేశంలో కమ్యూనిస్టుల ఐక్యత అవసరమని తద్వారా ప్రజా పోరాటాలు బలోపేతమై ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయి అని ఆశించారన్నారు. ప్రతి కార్యకర్త సుధాకర్ రెడ్డి ఆశయ సాధనకు పనిచేయటమే నిజమైన నివాళి కాగలదన్నారు. మాజీ సర్పంచ్ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళావతమ్మ, సిపిఐ పట్టణ కార్యదర్శి రమేష్, జె. చంద్రయ్య, NFIW జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి, పట్టణ కన్వీనర్ జయమ్మ, పానగల్ మండల కార్యదర్శి కురుమయ్య, కమ్మావుల పెంటయ్య, కాటం చిన్న నారాయణ, కాకం కాశన్న, పెద్ద హనుమంతు, చిన్న రాముడు, చెన్నమ్మ, శిరీష ,జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

మచ్చలేని కమ్యూనిస్టు సురవరం

సుధాకరరెడ్డి సంస్మరణ సభలో వక్తలు

విశాలాంధ్ర-కర్నూలు: నడిగడ్డ నుండి దేశ నలుమూలల వరకు సురవరం చేసిన కృషిని మరువలేమని, సమాజంలో మార్పు కోసం మనవంతు పాత్ర పోషించినప్పుడే సురవరం సుధాకరరెడ్డికి మనమిచ్చే ఘనమైన నివాళి అని, దేశంలోనే మచ్చలేని కమ్యూనిస్టు నాయకుడని, పేదల కోసం, బడుగు బలహీన వర్గాల కోసం ఆయన చేసిన కృషి అనన్య సామాన్యమని వక్తలు కొనియాడారు. సురవరం సుధాకరరెడ్డి సంస్మరణ సభ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల నరసింహ అధ్యక్షతన సోమవారం జరిగింది. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్, మాజీమంత్రి నిరంజన్‌రెడ్డి, మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ తదితరులు సుధాకరరెడ్డి త్యాగాలను, పోరాటాలను కొనియాడారు. 60 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎదురులేని నాయకుడిగా ఎదిగి, లక్షలాదిమంది ప్రేమ పొందారన్నారు. నడిగడ్డ పాలమూరు వాసి కావడం ఎంతో గర్వకారణమన్నారు. తాను నమ్మిన సిద్ధాంతం కోసం తుది వరకు పనిచేశారన్నారు. ఆయన రెండుసార్లు పార్లమెంటు సభ్యుడిగా పనిచేశారని, లేబర్ కమిటీ చైర్మన్‌గా దేశంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపే దిశగా ప్రయత్నం చేశారని తెలిపారు. తన తండ్రి దేశ స్వాతంత్రం కోస పోరాడితే... సురవరం పేదల జీవితాల్లో మార్పు రావాలని, సోషలిస్టు సమాజం నిర్మాణం చేయాలని ఉద్యమించారన్నారు. కార్మికవర్గ రాజ్య స్థాపనే లక్ష్యంగా పోరాడారన్నారు. సీపీఐ జోగులాంబ గద్వాల జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, నాగర్‌కర్నూలు జిల్లా కార్యదర్శి ఫయాజ్ మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి బాలకిషన్, వనపర్తి జిల్లా కార్యదర్శి విజయరాములు, నారాయణపేట జిల్లా కార్యదర్శి నరసింహులు, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నరసింహ ఏఐటీయూసీ రాష్ట్ర నాయకురాలు ప్రేమ్‌పావని, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి అనిల్ కుమార్, కంట్రోల్ కమిషన్ సభ్యుడు ఆనంద్ జి, సీపీఐ కర్నూలు జిల్లా నాయకులు జగన్నాథం, కర్నూలు జిల్లా సహాయ కార్యదర్శి లెనిన్‌బాబు, మునెప్ప, సీపీఐ నాయకులు నాగార్జున, రవి, పెద్దబాబు, రంగన్న, ఆశన్న బతుకన్న, నీలి శ్రీనివాసులు, దొడ్డప్ప, నారదొడ్డి వెంకటరాములు, టీపీఎఫ్ రాష్ట్ర నాయకులు ప్రభాకర్, సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, సీఎల్‌సీ సుభాన్, అతికూర రహమాన్, కేశవులు గౌడ్, ప్రజానాట్యమండలి కళాకారులు, ప్రజాసంఘాల నాయకులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికి ప్రజావాణి

విశాలాంధ్ర బ్యూరో - సంగారెడ్డి : ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజలు, పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను, జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డి ఆర్ ఓ పద్మజరాణిలకు విన్నవిస్తూ ఫిర్యాదులను సమర్పించారు. రెవిన్యూ-16, పౌర సరఫరాల శాఖ 03, డి ఆర్ డి ఓ 04, వివిధ శాఖలకు సంబంధించి 21 మొత్తంగా 44 ఫిర్యాదులు అందాయి. ప్రతి దరఖాస్తును జాగ్రత్తగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారి వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. సమస్యల పరిష్కారానికి గడువులు నిర్దేశించి, ప్రజలకు త్వరితగతిన స్పందించాలన్నారు. ప్రజలకు అండగా నిలబడటం ప్రజావాణి ఉద్దేశమని, ప్రజల సమస్యలను తీర్చడమే పరమ కర్తవ్యమని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు

విశాలాంధ్ర- మరిపెడ: మహబూబాబాద్ జిల్లా మరిపెడలో రైతులు యూరియా సోమవారం కోసం రోడ్డెక్కారు. వరంగల్ - ఖమ్మం 563 జాతీయ రహదారిపై బైటాయించి సుమారు నాలుగు గంటలు రాస్తారోకో చేపట్టారు. యూరియా ఇచ్చేదాకా కదిలేది లేదంటూ భీష్మించుకొని కూర్చున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ వరి నాట్లు వేసి రోజులు గడుస్తున్నా యూరియా అందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజులుగా అర కొరగా లోడ్లు వస్తున్న యూరియా ఎందుకు అందివ్వటం లేదని ఆరోపించారు. టోకెన్ల కోసం రెండు రోజులు క్యూలైన్లో, యూరియా కోసం మూడు రోజులుగా క్యూ లైన్‌లో నిలబడినా ఫలితం లేదని వాపోయారు. పొలం పనులు వదులు కొని యూరియా కోసం సొసైటీలు, షాపుల ఎదుట పడి కాపులు కాయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, ఏవో వీరా సింగ్, సిఐ రాజ్ కుమార్, ఎస్సై బొలగాని సతీష్ రాస్తారోకో వద్దకు చేరుకొని సముదాయించడా నికి ప్రయత్నించిన రైతులు ససేమీర అన్నారు. రాస్తారోకోతో జాతీయ రహదారి పై కిలోమీటర్ ట్రాఫిక్ స్తంభించింది. అనంతరం ఏడిఏ విజయచంద్ర రాస్తారోకో వద్దకు చేరుకోని యూరియా అందిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు రాస్తారోకో విరమించారు. సిఐ రాజ్ కుమార్, ఎస్సై బోలగాని సతీష్‌లు ట్రాఫిక్‌ను క్లియర్ చేయించారు.

సింగరేణిలో 94 శాతం బొగ్గు ఉత్పత్తి సాధన

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి, సింగరేణి: సింగరేణిలో ఈ సంవత్సరం జులై ఆగస్టు 31 వరకు 94 శాతం బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించామని ఆర్జీ వన్ జనరల్ మేనేజర్ డి.లలిత్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణి వివిధ డివిజన్లలో మొత్తం 25644400 టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం కాగా 24190225 టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగిందని ఇది 94 శాతం ఉత్పత్తి సాధన అని ఆయన వివధ డివిజన్ల బొగ్గు ఉత్పత్తి తీరుతెన్నులను వివరించారు. కొత్తగూడెంలో 5.92 మి.ట (105%) ఇల్లందులో 1.06 మి.ట. (106%), మణుగూరులో 4.52 మి.ట.(103%), బెల్లంపల్లిలో 1.17 మి.ట(90%), మందమర్రిలో 0.65 మి.ట.(61%), శ్రీరాంపూర్‌లో 2.39 మి.ట.(91%), ఆర్.జి వన్ లో 1.59 మి.ట.(88%), ఆర్.జి -2 లో 3.30 మి.ట.(129%), ఆర్.జి-3లో 2.20 మి.ట.(88%), అడ్రియాల ప్రాజెక్టులో 0.063మి.ట. (15%), భూపాలపల్లిలో 1.29 మి.ట (76%), మొత్తం సింగరేణి సంస్థలో 94 శాతం బొగ్గు ఉత్పత్తి జరిగిందని ఆయన అన్నారు. దేశంలోనే, ఆర్జీ వన్‌లో మూసివేసిన మేడిపల్లి ఓపన్ కాస్టులో సింగరేణిలోనే మొట్ట మొదటిసారిగా సుమారు 4000 వేల కోట్లతో ప్రతిష్టాత్మకంగా 500 మెగావాట్స్ పంపుడ్ స్టోరేజ్ ప్లాంట్ ప్రాజెక్ట్ నిర్మించడం జరుగుతుందని ఆయన తెలిపారు. దీని ద్వారా పగలు సోలార్ విద్యుత్ ద్వారా క్యారిలోని నీటిని ఉపరితల స్టోరేజ్ ట్యాంక్‌లలోకి పంపి రాత్రి వేల క్వరిలోకి వదలటం ద్వారా విద్యుత్ ఉత్పత్తి అవుతుందని తెలిపారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లా సెక్యూరిటీ యూనియన్ నూతనకమిటి ఎన్నిక

విశాలాంధ్ర - లక్ష్మీదేవిపల్లి : ఉమ్మడి ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల సెక్యూరిటీ గార్డ్ యూనియన్ లో నూతన కమిటీని ఎన్నుకున్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ కొత్తగూడెం కార్యాలయంలో సమావేశమై ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. ఇందులో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.సోమన్న, రాష్ట్ర అధ్యక్షులు టి.సాంబయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.రాము, రాష్ట్ర కార్యదర్శి ఎస్.రమేష్ లు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగుల సంఘం, ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు టి. కిరణ్ కుమార్ కొత్త కమిటీల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఏర్పాటు చేసి ప్రకటించారు. నూతనంగా ఏర్పాటైన కమిటీలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గౌరవ అధ్యక్షులుగా కే. సుబ్రహ్మణ్య చారి, జిల్లా అధ్యక్షుడిగా సిహెచ్.లక్ష్మయ్య, కార్యదర్శిగా మాలోత్ రవీందర్, ఉపాధ్యక్షులుగా ఎస్.మహేశ్వరరావు, రంజిత్, సహాయ కార్యదర్శులుగా నవీన్, శేఖర్, కోశాధికారిగా సిహెచ్.బాలాజీ, ఈసీ మెంబర్లుగా ప్రకాష్, జానకిరామ్ ,శోభారాణి, మునీర్‌లను ఎన్నుకున్నారు. సెక్యూరిటీ గార్డ్స్ జీతభత్యాలు, ఇతర సమస్యల గురించి సుధీర్ఘాంగా చర్చించి పలు తీర్మానాలు చేశారు.

మెదక్‌ను చార్మినార్ జోన్‌లో కలపాలి

విశాలాంధ్ర బ్యూరో - మెదక్: మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలని, నూతన పెన్షన్ విధానం రద్దుచేసి పాత పెన్షన్ సాధించేవరకు నిర్విరామ పోరాటం చేస్తామని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల జేఏసీ చైర్మన్ దొంత నరేందర్ అన్నారు. సోమవారం మెదక్ కలెక్టరేట్లో జేఏసీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. సిపిఎస్ విధానం వల్ల సెప్టెంబర్ 2004 తర్వాత ప్రభుత్వ ఉద్యోగాలలో నియామకమైన ఉద్యోగులందరూ తాము దాచుకున్న డబ్బుకు భద్రత లేక ముసలితనం లో ఉద్యోగ విరమణ పొందిన అనంతరం ఏ విధంగా మా జీవితకాలం గడపాలో తెలియక అయోమయానికి గురై తీవ్ర మనోవేదన చెందుతున్నా రన్నారు. జిల్లాను రాజన్న జోన్ నుండి చార్మినార్ జోన్‌కు కలిపే విధంగా త్వరలోనే అన్ని వర్గాల ఉద్యోగులతో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. రాజన్న జోన్లో కలవడం ద్వారా విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు చదువులలో, ప్రభుత్వ నియామకాలలో, పదోన్నతులలో తీవ్రంగా నష్టపోతున్నారని వివరించారు. చార్మినార్ జోన్ సాధన కోసం వెనకాడే ప్రసక్తే లేదన్నారు. అనంతరం అదనపు పాలనాధికారి నగేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ నిరసనలో జేఏసీ సెక్రెటరీ జనరల్ విట్టల్, టీఎన్జీవో, టీజీవో, ట్రేస, ఎస్టియు, యుటిఎఫ్, అధ్యక్ష కార్యదర్శులు మీనికి రాజ్‌కుమార్, నాగభూషణం, మహేందర్ గౌడ్, రాజగోపాల్ గౌడ్, పద్మారావు, చరణ్ సింగ్, శ్రీనివాస్, పోచయ్య, టీఎన్జీవో జిల్లా సహాధ్యక్షులు ఇక్బాల్ పాషా, కోశాధికారి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు పజాలుద్దీన్, సంయుక్త కార్యదర్శిలు శంకర్, శివాజీ, క్రీడల కార్యదర్శి గోపాల్, ప్రచార కార్యదర్శి నర్సింలు, కార్యవర్గ సభ్యులు సతీష్, సలావుద్దీన్, మెదక్, నర్సాపూర్, అల్లాదుర్గ్, ఏడుపాయల వనదుర్గ, రామాయంపేట యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు రామా గౌడ్, శేషాచారి, ధర్మా చందర్, సూర్య శ్రీనివాస్, ప్రభాకర్, ప్రశాంత్, టి పి ఎస్ ఎఫ్ అధ్యక్షులు కుమార్, పంచాయతీ కార్యదర్శుల ఫోరం అధ్యక్షులు నగేష్, సంతోష్, శ్రీకాంత్, ప్రవీణ్, నవీన్, క్లాస్ ఫోర్త్ యూనియన్ కార్యదర్శి రిజ్వానలి, పరమేష్, సోహైల్, వెంకటేష్, వేణు,ధనుంజయ్ పాల్గొన్నారు.

ఘనంగా అన్నప్రసాదం పంపిణీ

విశాలాంధ్ర - నేరేడుచర్ల : నేరేడుచర్ల పట్టణ కేంద్రంలో గల ఆర్కే కాంప్లెక్స్ వద్ద వరసిద్ధి గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 8వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన వరసిద్ధి గణపతి విగ్రహం రాచకొండ దినేష్ సింధు దంపతులు ఏర్పాటుచేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బైరెడ్డి జితేందర్ రెడ్డి నాగలక్ష్మి దంపతుల సహకారంతో అన్న ప్రసాదం పంపిణీ పట్వారి కాంప్లెక్స్ నందు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎస్సై రవీందర్ నాయక్, కొనతం చిన్న వెంకటరెడ్డి, చల్లా శ్రీలత రెడ్డి, నాగండ్ల వెంకటేశ్వరరావు,నూకల సందీప్ రెడ్డి, బచ్చలకూరి ప్రకాష్ చింతమల్ల జయ బాబు, నాగండ్ల శ్రీధర్ వెంకటరెడ్డి, సోమిరెడ్డి, ఐత సుమంత్, కట్ట రామారావు, అరి బండి సురేష్ బాబు, వెంగళరావు, కొనతం నాగిరెడ్డి, తాళ్ల సురేష్ రెడ్డి, చింతమల్ల సైదులు, తాళ్ల సురేష్ రెడ్డి,పాండు నాయక్, ఆకారపు వెంకటేశ్వర్లు, గెల్లి శ్రీనివాస్, నీలా శ్రీనివాస్, గోల్లా శ్రీనివాస్, పమిడిమర్రి వాసు, మోహన రెడ్డి, అనిల్, కందిబండ రవి పాల్గొన్నారు.

గృహ నిర్మాణ పనుల్లో స్థానికులకే ప్రాధాన్యత ఇవ్వాలి

విశాలాంధ్ర బ్యూరో- పెద్దపల్లి : పెద్దపల్లి జిల్లాలో నూతన గృహ నిర్మాణ పనులను చేపడుతున్న ఇంటి యజమానులు, బిల్డర్లు, ప్లంబింగ్, ఎలక్ట్రికల్, టైల్స్, మార్బుల్ పనులకు స్థానిక యూనియన్ కార్మికులనే నియమించుకోవాలని శ్రీ రాజరాజేశ్వర టైల్స్ అండ్ మార్బుల్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు తాండ్ర సదానందం, సాంస్కృతిక కళాకారుల సంక్షేమ సంఘం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మంద భాస్కర్ యాదవ్, జిల్లా అధ్యక్షుడు కల్లేపల్లి రవి కోరారు. సోమవారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ స్థానికేతర కార్మికులు తక్కువ ధరకు పని చేయడానికి ముందుకు వస్తున్నప్పటికీ, వారి పని నాణ్యత ఆశించిన స్థాయిలో ఉండటం లేదని అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. నాసిరకం పనుల వల్ల ఇంటి యజమానులకు ఆర్థిక నష్టాలు వాటిల్లుతున్నాయని, పని మధ్యలో వదిలి వెళ్లిపోవడం, సమస్యలు తలెత్తినప్పుడు అందుబాటులో లేకుండా పోవడం వంటి ఘటనలు తరచుగా చోటు చేసుకుంటు న్నాయని వారు తెలిపారు. స్థానిక యూనియన్‌లో సభ్యులుగా ఉన్న కార్మికులను నియమించుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని, స్థానిక కార్మికులు తాము చేసే పనికి పూర్తి బాధ్యత తీసుకుంటారన్నారు. ఒకవేళ భవిష్యత్తులో ఏవైనా సమస్యలు వచ్చినా వాటిని పరిష్కరించడానికి అందుబాటులో ఉంటారని భరోసా కల్పించారు. పని కోసం పెదపల్లికి వచ్చే ఇతర ప్రాంతాల కార్మికులు సైతం స్థానిక యూనియన్‌లో చేరి సహకరించాలని అసోసియేషన్ నాయకులు తెలిపారు. దీనివల్ల కార్మికులందరికీ ఒక వేదిక ఏర్పడుతుందని, పని నాణ్యత మెరుగుపడతాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం ద్వారా స్థానిక వృత్తులకు మద్దతు లభిస్తుందని, సమాజంలో సోదరభావం కూడా పెంపొందుతుందని అసోసియేషన్ ఆశాభావం వ్యక్తం చేశారు. కోశాధికారి గడ్డం తిరుమల్, ప్రచార కార్యదర్శి మిరినల రవీందర్ రావు, ఉప్పు వెంకటేశ్వర్లు, భరణి రమేష్ పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆమె కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సోమవారం మొత్తం 99 ఫిర్యాదులు రాగా, అందులో జిల్లా అధికారులకు 30, రెవెన్యూ శాఖకు 69 ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో పలు అంశాలపై సమీక్షించారు. వీధి కుక్కల సమస్య ఎక్కువగా ఉన్నందున వీధి కుక్కలపై పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఎంపీడీవోలు వెంటనే పంచాయతీ కార్యదర్శులతో ఈ విషయంపై సమావేశం నిర్వహించాలన్నారు. ప్రత్యేక అధికారులు హాస్టళ్లు, పాఠశాలలు తనిఖీ చేయాలని చెప్పారు. దర్తి ఆబా జనజాతీయ యోజన తదితర పథకాల కింద చేపట్టిన యూనిట్ల గ్రౌండింగ్ తదితర అంశాలను కలెక్టర్ సమీక్షించారు. ప్రత్యేక అధికారులు మండలాలను సందర్శించినప్పుడు ఏదైనా చిన్న చిన్న పనులు మంజూరు చేయవలసి వస్తే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, స్పెషల్ కలెక్టర్ సీతారామ రావు, గృహ నిర్మాణ శాఖ పిడి రాజకుమార్, ఆర్డీవోలు, జిల్లా అధికారులు ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు.

3న చంద్రుగొండలో ముఖ్యమంత్రి పర్యటన

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : ఈ నెల 3న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాలోని చంద్రుగొండ మండలంలో పర్యటించనున్నారు. ఈ మండలంలో ఇటీవలే రెండు దఫాలు ఖరారైన ముఖ్యమంత్రి పర్యటనను అనివార్య కారణాలతో వాయిదా వేశారు. ముచ్చటగా మూడవసారి ఈనెల మూడవ తేదీ ముఖ్యమంత్రి వస్తారని అధికారికంగా ప్రకటించారు. దీంతో పర్యటన ఏర్పాట్లలో జిల్లా యంత్రాంగం నిమగ్నమైంది. చంద్రుగొండ మండలంలోని మారుమూల గిరిజన గ్రామం బెండలపాడు కు ముఖ్యమంత్రి రానున్నారు. రాష్ట్రంలోనే తొలిసారిగా ఇందిరమ్మ ఇళ్లను లాంచనంగా ప్రారంభించడానికి సియం వస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సి ఎం రేవంత్ రెడ్డి కొన్ని గిరిజన కుటుంబాలతో మాట్లాడే విధంగా ఏర్పాటు చేయనున్నారు. ఈ గ్రామం చుట్టూ అటవీ ప్రాంతం తోపాటు ఎత్తయిన గుట్టలు ఉండటంతో పోలీసులు పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు. ఇళ్ల ప్రారంభోత్సవం తర్వాత ఇదే మండలంలోని దామరచర్ల గ్రామంలో పెద్ద ఎత్తున సభ నిర్వహించేందుకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి. కొన్ని రోజులుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు వరదలు సంభవిస్తున్న నేపథ్యంలో చివరి క్షణంలో ముఖ్యమంత్రి పర్యటన కొనసాగుతుందా లేదా అనే సందేహాలు కూడా వ్యక్తం అవుతున్నాయి.

ట్రాఫిక్ డైవర్షన్ చేస్తున్నాం : డీఎస్పీ : ముఖ్యమంత్రి పర్యటన ఖరారైన నేపథ్యంలో చంద్రుగొండ మండలం మీదుగా వచ్చే వాహనాలను ట్రాఫిక్ డైవర్షన్ చేస్తున్నట్లు కొత్తగూడెం డిఎస్పి అబ్దుల్ రహమాన్ వెల్లడించారు. వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ చర్యలను చేపట్టడం జరుగుతుందన్నారు. వీయం బంజర నుండి చంద్రుగొండ మీదుగా కొత్తగూడెం వైపు వచ్చే వాహనాలు కల్లూరు, తల్లాడ, ఏన్కూరు, జూలూరుపాడు మీదుగా కొత్తగూడెం చేరుకోవాలని డిఎస్పీ సూచించారు. అదే విధంగా కొత్తగూడెం నుండి వివిఎం బంజర వైపు ప్రయాణించే వాహనదారులు కూడా జూలూరుపాడు, ఏన్కూరు,తల్లాడ మీదుగా వెళ్లాలని ఆయన తెలిపారు. ఈ ట్రాఫిక్ డైవర్షన్ 3వ తేదీ ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని ఆయన చెప్పారు.

గిరిజన, గిరిజనేతరుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - భద్రాచలం : ఏజెన్సీలో నెలకొన్న గిరిజన గిరిజనేతరుల భూ సమస్యలను సత్వరం పరిష్కరించాలని సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ట ఆదేశించారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశాల ప్రకారం సోమవారం భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏజెన్సీ ఏరియా పరిధిలో గిరిజన రైతుల సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో గ్రామాల నుండి వచ్చిన గిరిజనుల దరఖాస్తులు స్వీకరించి, క్షుణ్ణంగా పరిశీలించి అర్హత మేరకు భూమికి సంబంధించిన అన్ని డాక్యుమెంట్లను, రికార్డులను పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తానని ఆయన అన్నారు. మణుగూరు మండలానికి చెందిన భూ సమస్య, పురుషోత్తపట్నం గ్రామానికి చెందిన ఉషారాణి పట్టాదారు పాసుపుస్తకం ఇప్పించెందుకు, రామానుజవరం గ్రామానికి చెందిన నరసయ్య తన పొలం సమస్య గురించి, కర్నే బాబురావు ఓపెన్ కాస్ట్ లో తన భూమి తీసుకున్నారని న్యాయం చేయ్యాలని దరఖాస్తులు చేసుకున్నారు. ఇలా ఐటిడిఏ పరిధిలో అధిక శాతం భూ సమస్యలపైనే దరఖాస్తులు రావడం గమనార్హం. ఈ కార్యక్రమంలో ఏవో రాజేంద్రనాథ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలి

విశాలాంధ్ర - కోదాడ : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు తక్షణమే యూరియా సరఫరా చేసి ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షులు బొల్లు ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కోదాడ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం నందు సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అనంతరం పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఆర్డిఓ సూర్యనారాయణకు అందించారు. రైతులు యూరియా కోసం గంటల తరబడి క్యూ లైన్‌లో వేచి ఉన్న యూరియా దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే తెలంగాణ పట్ల పక్షపాత ధోరణి వీడి యూరియాను సరఫరా చేయాలన్నారు. అదేవిధంగా అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి 20000, వేసంగిలో ప్రభుత్వం కొనుగోలు చేసిన సన్నారకం ధాన్యానికి 500 రూపాయలు బోనస్ వెంటనే చెల్లించడంతోపాటు రెండు లక్షల రూపాయల పైన ఉన్న వ్యవసాయ రుణాలను తక్షితమైన రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జాతీయ నాయకులు దొడ్డ వెంకటయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు, మాతంగి ప్రసాద్, గెల్లి పుల్లయ్య, రాజు, భూక్య గోపాల్, నాగేశ్వరరావు, నరసింహారావు, కొండయ్య పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి

విశాలాంధ్ర - సూర్యాపేట బ్యూరో : పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి ఫిర్యాదులను జిల్లా అధికారులు చొరవ తీసుకొని యుద్ధప్రతిపాదికన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన కలెక్టరెట్ సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరించిన అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ వివిధ అంశాలను సమీక్షిస్తూ కొన్ని శాఖల్లో ఎక్కువ రోజుల నుండి ప్రజావాణి ఫిర్యాదులు పెండింగ్లో ఉన్నాయని, అలాంటి శాఖల అధికారులు పెండింగ్ ఫిర్యాదులపై దృష్టి సారించి తక్షణం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కాగా ఈ సోమవారం భూములకు సంబంధించి 41 ఫిర్యాదులు, ఎంపీడీవోలకు 13, మున్సిపల్ కమిషనర్లకి 8, ఇతర అధికారులకు 14 ఫిర్యాదులు, మొత్తం 76 ఫిర్యాదులు వచ్చాయి. వీటన్నింటిని సంబంధిత శాఖల అధికారులకు పంపడం జరిగిందని, జాగ్రత్తగా అన్నిటిని పరిశీలించి జాప్యం లేకుండా వేగంగా పరిష్కరించెందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. డి ఆర్ డి ఓ పిడి వివి అప్పారావు, డిపి ఓ యాదగిరి, డి ఏ ఓ శ్రీధర్ రెడ్డి, డి సీ ఓ పద్మ, డి ఈ ఓ అశోక్, డి ఎం హెచ్ ఓ చంద్రశేఖర్, డి ఎస్ ఓ మోహన్ బాబు, ఈ డి ఎస్ సీ కార్పొరేషన్ శ్రీనివాస్ నాయక్, సంక్షేమ అధికారులు శంకర్, దయానందరాణి, సుదర్శన్ రెడ్డి, సంతోష్ కిరణ్ హాజరుయ్యారు.

సంపాదకీయం

ఓట్ల దోపిడీదార్లకు హెచ్చరిక

పద్నాలుగు రోజులపాటు బిహార్ లో జరిగిన ఓట్ చోరీ యాత్ర సోమవారం ముగిసింది. ఈ యాత్ర కేవలం కాంగ్రెస్ యాత్ర కాదు. అది ఒక్క రాహుల్ గాంధీ యాత్ర కాదు. ఈ పద్నాలుగు రోజుల పొడవునా రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్.జె.డి.) నేత తేజస్వీ యాదవ్ ఈ యాత్రలో భాగస్వామి అయ్యారు. "ఇండియా" ఐక్య సంఘటన లోని వివిధ పార్టీల నాయకులు కూడా ఈ యాత్రలో పాల్గొన్నారు. ఆఖరి రోజు యాత్రలో "ఇండియా" ఐక్య సంఘటనలోని పార్టీలు కూడా యాత్రలో కనిపించారు. ఆచరణలో ప్రతిపక్ష పార్టీలు ఇంత పకడ్బందీగా ఇదివరకెన్నడూ కనిపించి ఉండదు. "ఇండియా" ఐక్య సంఘటనలోని పార్టీల నాయకులు గతంలో అనేక సార్లు ఉమ్మడి సమావేశాలు నిర్వహించి ఉండవచ్చు. జనం మధ్య కనిపించి ఉండవచ్చు. కానీ సోమవారం నాడు కనిపించిన ప్రతిపక్ష ఐక్య సంఘటన అపూర్వమైంది. ముగింపు సమావేశంలో ప్రధానంగా రాహుల్ గాంధీ, తేజస్వీ యాదవ్ బీజేపీ నాయకత్వంలోని ఎన్.డి.ఎ. కూటమి గుండెల్లో రైళ్లు పరుగెత్తించారు. "ఓట్ చోరీ అంటే అధికార దోపిడీ, రిజర్వేషన్ల దోపిడీ, ఉపాధి దోపిడీ, విద్య దోపిడీ, ప్రజాస్వామ్యం దోపిడీ, యువత భవిష్యత్తు దోపిడీ అని రాహుల్ గాంధీ గర్జించడం మోదీ ప్రభుత్వాన్ని కంపింప చేసింది. "ఫ్యాక్టరీలు గుజరాత్‌లో పెడ్తారా, విజయం బిహార్ లో కావాలా? ప్రజాస్వామ్య రక్షణ కావాలా లేదా రాచరికం కావాలా?" అని ప్రశ్నించి తేజస్వీ యాదవ్ అధికార పక్షం గుండెల్లో గునపాలు దింపారు. బీజేపీ అబద్ధాల ఫ్యాక్టరీ, ఉత్పత్తిదారు, పంపిణీదారు అని కూడా తేజస్వీ దుయ్యబట్టారు. జైలులో పెడ్తామన్న బెదిరింపులతో భయపడేదే లేదు అని ప్రతిపక్ష నాయకులు స్పష్టం చేశారు. బిహార్ ప్రజాస్వామ్యానికి జన్మస్థలం లాంటిదని, అలాంటి చోట ప్రజాస్వామ్యాన్నే సమాధి చేయాలని బీజేపీ అగ్ర నాయకులిద్దరూ కుట్ర చేస్తున్నారని తేజస్వీ నిజానికి అత్యంత దగ్గరగా ఉన్న ఆరోపణ మోపారు. బిహార్ లో అధికారంలో ఉన్న డబులు ఇంజన్ సర్కారులో ఒక ఇంజన్ అవినీతితో నడుస్తోందని, రెండో ఇంజన్ నేరమయమై పోయింది అని తేజస్వీ యాదవ్ ఘాటైన విమర్శలు సంధించారు. వచ్చే నవంబర్ లో బిహార్ శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి. రాహుల్ గాంధీ, తేజస్వీ యాదవ్ చెప్పిన మాటల లక్ష్యం ఆ ఎన్నికలు కూడా అయి ఉండొచ్చు. కానీ సమగ్ర, నిశితమైన ఓటర్ల సవరణ పేరుతో జరుగుతున్న మార్పులు చేర్పుల్లో జరుగుతున్న దుర్మార్గాన్ని బిహార్ మూలమూలకే కాదు, దేశవాసులందరికీ చేరవేయడంలో ఈ పద్నాలుగు రోజుల యాత్ర సఫలమైంది. ఫలితాల మాట బిహార్ శాసనసభ ఎన్నికల తరవాత తేలొచ్చునేమో కానీ జనాన్ని చైతన్యవంతులను చేయడానికి, ఎన్నికల కమిషన్ ను మోదీ ఎలా గుప్పెట్లో పెట్టుకుని ఎన్ని దుర్మార్గాలకు పాల్పడుతోందో బయట పెట్టడానికి ఈ యాత్ర బాగా దోహదం చేసింది. బిహార్ మొత్తం ఓట్ల దొంగతనానికి వ్యతిరేకంగా పోరాడవలసిన అవసరాన్ని గుర్తు చేసింది. రాహుల్ తేజస్వీ కేవలం ఓట్ల దొంగతనం గురించే కాకుండా అవినీతిని కూడా పెద్ద ఎత్తున ఎత్తి చూపడం ద్వారా అవినీతిని కూడా ప్రధాన చర్చనీయాంశం చేసేశారు. ఒక్క ఇంజినీర్ ఇంట్లో వందకోట్లకు పైగా పట్టుబడ్డ అంశాన్ని ప్రధానాంశంగా మలిచారు. నోట్ల కట్టలను తగులబెడ్తున్నారని గుర్తు చేశారు. అధికారం తమ చేతుల్లోకి వచ్చిన తరవాత అవినీతికి పాల్పడ్డ ఏ అధికారినీ వదలిపెట్టబోమని తేజస్వీ హెచ్చరించారు. ప్రతిపక్షాలు ఇస్తున్న హామీలన్నింటినీ నితీశ్ కుమార్ కాపీ కొట్టి అమలు చేయక తప్పని పరిస్థితి ఏర్పడింది. బిహార్ లో రెండు వారాలపాటు జరిగిన ఓట్ చోరీ యాత్రలో భాగస్వాములైన పార్టీలన్నీ తమ శక్తి సామర్థ్యాలను స్పష్టంగా ప్రదర్శించాయి. యాభై ఏళ్లనాటి ఎమర్జెన్సీని పదే పదే ప్రస్తావించే మోదీ ప్రభుత్వం సరిగా అదే జూన్ 25న బిహార్ లో సమగ్ర, సునిశిత ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇది ఎమర్జెన్సీ కన్నా ఎంత భీకరమైందో ప్రతిపక్షాలు ఎత్తి చూపాయి. పెద్ద నోట్లరద్దు, జి.ఎస్.టి. మొదలైన చర్యల ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను మోదీ ప్రభుత్వం ఎలా కుళ్లబొడిచిందో ప్రతిపక్షాలు గుర్తు చేశాయి. ఓటర్ల జాబితా సవరణ మిషతో ఇప్పుడు ఓట్ల దొంగతనానికి పాల్పడుతున్నారని, ప్రజాస్వామ్య వ్యవస్థను కుళ్లబొడుస్తున్న వైనాన్ని ప్రతిపక్షాలు సమర్థంగా ఎత్తి చూపగలిగాయి. బిహార్ జనాభాలో 20 శాతం మంది ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్తారన్న సాకుతో ఆ ఓటర్ల పేర్లన్నీ జాబితాలోంచి తొలగించే ప్రయత్నం సాగింది. కానీ ప్రజలు ఆందోళనకు దిగడంతో చివరకు 65 లక్షల మంది ఓటర్లను ఓటర్ల జాబితానుంచి తొలగించారు. ఈ సమస్యకు ఇంకా తెరపడలేదు. బిహార్ ప్రజలు తమ హక్కులను కాపాడుకోవడాని మళ్లీ ఉద్యమించడానికి వెనుకాడరు అని గత రెండు వారాల పరిణామాలు భరోసా కల్పిస్తున్నాయి.

ఓటర్ అధికార యాత్ర పూర్తి అయిన సందర్భంలో రాహుల్ గాంధీ హైడ్రోజన్ బాంబు వస్తోంది జాగ్రత్త అని హెచ్చరించారు. మహాత్మా గాంధీని హతమార్చిన శక్తులే ఇప్పుడు రాజ్యాంగ హత్యకు పాల్పడుతున్నాయి కానీ ఇది ససేమిరా జరగనివ్వబోం అని రాహుల్ స్పష్టం చేశారు. కర్నాటకలోని మహదేవ్ పురాలో జరిగిన ఓట్ల చోరీని బయట పెట్టడం ఆటం బాంబు అయితే ఇక హైడ్రోజన్ బాంబు వస్తోంది కాచుకోండి అని రాహుల్ గాంధీ హెచ్చరించారు. రెండు వారాలుగా బిహార్ లోని వివిధ ప్రాంతాలలో సాగిన ఓట్ అధికార్ యాత్రకు జనం నుంచి వచ్చిన స్పందన చూస్తే ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడానికి ప్రజలు ఎంతటి త్యాగాలకైనా సిద్ధంగా ఉన్నారన్న ఆశాభావం కలుగుతోంది. ఈ సారథ్యం వహించిన పార్టీలు ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉండొచ్చు. కానీ వచ్చే శాసనసభ ఎన్నికలు ఈ పరిస్థితిని తారుమారు చేయడం ఖాయం అన్న విశ్వాసం కలుగుతోంది. ఈ పరిణామం సాకారం అయితే అది కేవలం బిహార్ కే పరిమితం కాదు. దాని ప్రకంపనలు దేశం నలుమూలలా ప్రతిధ్వనించక మానవు. బిహార్ లో జరిగిన యాత్ర కేవలం ఓట్ల దొంగతనానికి వ్యతిరేకంగా జరిగింది మాత్రమే కాదు. నితీశ్ కుమార్ దుష్పరిపాలనను ఎండగట్టడానికి మాత్రమే పరిమితం అయింది కాదు. యాత్ర పొడవునా జన విస్ఫోటనం చూస్తే బిహార్ ప్రజల స్వరం దేశమంతటా ప్రతిధ్వనిస్తోందన్న భావన కలుగుతోంది. ఈ యాత్ర కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వానికి, మోదీ, అమిత్ షా ద్వయం కుయుక్తులకు, ప్రజాస్వామ్యాన్ని అంతంచేసే ప్రయత్నాలని నిలవరించడానికి ఉద్దేశించిందని శిలా లిఖితమైన మాటలా గోచరిస్తోంది. నిరంకుశ ధోరణులు ఎదురైనప్పుడల్లా ప్రజలు ప్రజాస్వామ్య పరిరక్షణకు నడుం కట్టారని గుర్తుంచుకోవాలి.

ఆడవాళ్లూ మీకు జోహార్లు

చింతపట్ల సుదర్శన్

సాటి కుక్కలతో వీరోచితంగా పోరాడి అరిచి, గీపెట్టి, భవ్వు భవ్వులతో అదిరించి బెదిరించి సాధించి కడుపు నింపుకుని ఇంటిదారి పట్టిన డాగీ, 'డస్ట్‌బిన్' ల దగ్గర తన స్వేచ్ఛా విహారానికి అడ్డు వచ్చిన మనుషుల్నీ, కుక్కల్నీ ఎదిరించి నిలిచి గెలిచి నమలాల్సినవి నమిలి ఒంట్లోకి మరునాటి దాకా కావలసిన శక్తిని 'డిపాజిట్' చేసుకుని ఇంటి దోవ పట్టిన డాంకీ మెట్ల దగ్గర కల్సుకున్నవి.

అరుగు మీద ఎవరో కూచుని ఉన్నారు. మెళ్లో నించి వేళ్లాడుతున్న పట్టీలో బ్యాండేజి కట్టుకున్న చేయి కనిపిస్తున్నది. ఎవరా మనిషి మోర ఎత్తి మొరగనా అంది డాగీ. ప్రతి దానికీ ప్రతిపక్ష పార్టీ వాడిలా మొరగడమేనా? ఎవరో కనిపించడం లేదా? ఐ సైట్ ప్రాబ్లం వచ్చినట్టుంది నీకు అరుగు మీద విరిగిన చేతికి బ్యాండేజీతో ఉన్నది మరెవరో కాదు. మనవాడే...మన బ్రోనే అంది డాంకీ.

రంగస్థలం

అవును సుమా అబ్బాయే అని నాలుక కొరుక్కుంది డాగీ. అరుగు ఎక్కి తమ తమ జాగాల్లో సెటిలయిన డాగీ, డాంకీలకు అబ్బాయి మూలుగులు వినిపించేయి. ఏమైంది బ్రో! చేతికి ఆ కట్టు ఏమిటి? అని ఆదుర్దాగా అడిగింది డాంకీ. అవును 'బ్రో' ఆ చేయి అలా హేంగర్‌కు తగిలించిన తెల్లచొక్కాలా ఉన్నదేమిటి అనడిగింది ఆందోళనగా డాగీ.

ఏం చెప్పమన్నారు! పుటుక్కు జరజర డుబుక్కు మే, సొమ్మొకడిది సోకు ఒకడిది అంటూ నిట్టూర్చాడు అబ్బాయి. ఇలాగ తెలుగు జాతీయాలు చెప్తే ఏం అర్థమవుతుంది కాస్త అర్థం అయ్యేట్టు చెప్పరాదూ అంది డాంకీ. ఎవరో జ్వాలను రగిలించారు, వేరెవరో దానికి బలి అయినారు అని పాట కూడా ఉంది. చెప్పడానికి ఏం ఉంది. చూస్తున్నారుగా నిక్షేపంగా ఉండిన నా వామ హస్తం విరిగింది. డాక్టర్ కట్టుకట్టి, రెండో మూడో వారాల దాకా బ్యాండేజీ అలంకరించిన చేతిని మోస్తూ తిరగమన్నాడు అబ్బాయి.

చేయి విరిగిందా! ఎవరితో గొడవ పడ్డావు. ఫైట్ బాగా జరిగిందా. అయినా మేం మాంసం కొట్టు దగ్గర గుంపుగా చేరి కొట్టుకుంటాం, కొట్టుకుంటాం అంటే అరుచుకుంటామన్న మాట. కానీ ఎవరికీ కాళ్లూ చేతులూ విరగవు అంది డాగీ. ఆపుతావా నీ 'డాగరిల్' బ్రదర్ చెప్పనీ అంది డాంకీ.

మన వాళ్లు ఎన్నికల్లో గెలిచి సర్కారు వారు అవడానికి, ఎన్ని రకాల ఉచితాలు వెతుకుతున్నారో జనాన్ని ఉచ్చులో పడెయ్యడానికి కొత్త కొత్త ఎరల్ని వెదుకుతున్నారు. వాటిల్లో ఇదొకటి. ఇదే స్త్రీ శక్తి అని నామకరణం చేసిన మహిళా ఉచిత బస్సు ప్రయాణం అదే నా చేతిని నిర్దయగా, కర్కశంగా పాశవికంగా విరిచేసింది అన్నాడు అబ్బాయి.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం మగవాడివైన నీకు ఎందుకు నచ్చుతుంది కుళ్లు, కుతంత్రం కదా అంది డాగీ. ఇస్తారయ్యా ఓట్ల కోసం, సీట్ల కోసం ఎన్ని ఉచితాలు ఇవ్వవచ్చో, వెదికి వెదికి కనిపెట్టి కనిపెట్టి ఇస్తారు అందువల్ల నీకు వచ్చిన కడుపునొప్పి ఏమి? అనడిగింది డాంకీ. కడుపు నొప్పి కాదు చేయినొప్పి. స్టాండులో నిలబడి నిలబడి కాలు నొప్పి. ఆధార్ కార్డులు పట్టుకుని వచ్చిన బస్సు మీదల్లా విరుచుకుపడుతున్నారు ఆడవాళ్లు. సీట్లన్నీ ఉచితమే. టికెట్లన్నీ జీరోలే. ఎలాగో కష్టపడి బస్సెక్కి ఓ సీట్లో కూచున్నా. ఆ సీట్లో తన చున్నీ వేసి, రిజర్వు చేసుకుందట ఓ ఇల్లాలు. అదీ ఒక్క సీటుకి కాదట వెనకాల ఉన్న అయిదు సీట్లకు కూడానట. నా ఖర్మ అట్లా కాలింది. ఆ దొడ్డ ఇల్లాలి గావుకేకలకు చెవులు చిల్లులు పడ్డయి. అక్కడ్నించి లేచి వస్తుంటే ఒకచోట చెప్పులతో కొట్టుకుంటున్న దృశ్యం చూసి కళ్లు బైర్లు కమ్మినవి. ఆ తోపులాటలో, నిలబడటానికి ఊతంగా పట్టుకున్న కడ్డీ కొట్టుకుని ఫట్టుమని విరిగింది చేయి. కిటికీల్లోంచి సీట్లల్లో ఆడ కూతుర్లు విసిరేసిన జేబు రుమాళ్లతో సంపాదించిన జాగీర్లకు సంబంధించిన 'సీటు పట్టు' యుద్ధాల కారణంగా ఎంతమంది కళ్లూ, కాళ్లూ, చేతులూ పోగొట్టుకుంటున్నారో అన్నాడబ్బాయి, చేతి కట్టుకేసి దిగులుగా చూసుకుంటూ.

కొందరు రాజకీయ నాయకులు కొన్ని నియోజక వర్గాలమీద ఇలాగే 'దస్తీ' లు, తువ్వాళ్లు వేసి జీవితాంతం తామే కూచుంటారు. నన్నడిగితే ఓట్ల జాబితాలు సరిచెయ్యలేని ఎలక్షన్ కమిషన్లూ, ఎన్నికలూ అవసరం లేదు. సభల్లో తువ్వాళ్లూ, చేతి రుమాళ్లూ వేసి సీట్లు సాధించమని అన్ని పార్టీల వాళ్లనూ లోపలికి తోసేస్తే సరి 'రాజ్యము వీరభోజ్యము' అన్న మాట కరెక్టయ్యేది అంది డాగీ. ప్రతి బస్సులో 'మగవారికి మాత్రమే' అని ఓ రెండు సీట్లయినా కనీసం కేటాయిస్తే బాగుండేది అంది డాంకీ.

మందు తాగినా మగాళ్లు ఓట్లు వెయ్యడంలేదని, ఆడవాళ్లూ మీకు జోహార్లు అంటున్నారు మనల్ని ఏలుకోవాలనుకునేవారు. ఇక ముందు ముందు మరెన్ని 'అనుచితాలు' ఉచితంగా ఇస్తారో, ఎందరు మగవాళ్ల తాట తీస్తారో, చేతులు విరగ్గొడతారో, ఆ ప్రజాస్వామ్య ప్రభువుకే తెలియాలి అంటూ అరుగు దిగాడు అబ్బాయి.

అటకెక్కిన కౌలు రైతులకిచ్చిన హామీలు

పి.జమలయ్య

ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడు నెలలు పూర్తవుతున్నది. వాస్తవంగా పంటలు పండిస్తున్న కౌలురైతులందరికీ గుర్తింపు కార్డులు జారీ కాలేదు. అన్నదాత సుఖీభవ పథకం అక్టోబర్‌కు వాయిదా పడింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాక ముందే గుర్తింపుకార్డులు ఇవ్వాలని మొత్తుకున్నప్పటికి ఇవ్వకుండా రెండున్నర నెలలు జాప్యం చేశారు. పంటలువేసే కాలంలో రుణాలు అందించకుండా నిర్లక్ష్యం చేశారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ఆర్థిక సహాయం అవసరమైన వారికి ఇవ్వకుండా అవసరంలేని వాళ్లకే ముందస్తుగా ఇచ్చారు. ఇప్పుడు సమీక్ష సమావేశాలు వేసి కౌలు రైతుల సంక్షేమం గురించి మాట్లాడటం బాధాకరం. ఆగస్టు 18 న రాష్ట్ర సచివాలయంలో వర్చువల్‌గా వ్యవసాయ, బ్యాంకు, రెవెన్యూ సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి అర్హులైన కౌలు రైతులందరికీ సిసిఆర్సి కార్డుల ఆధారంగా "స్కేల్ ఆఫ్ ఫైనాన్స్" నిబంధనల ప్రకారం పంట రుణాలు మంజూరు చేయాలని లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్లను వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు ఆదేశించారు.

కౌలురైతులకు రుణాల మంజూరు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేసేందుకు అధికారులు అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు మాట్లాడుతూ గతేడాది నిర్దేశించుకున్న లక్ష్యంలో 91శాతం మంది కౌలు రైతులకు సిసిఆర్సి కార్డులు అందజేశామని తెలిపారు. ఈ అంశాన్ని పరిశీలించినప్పుడు 91 శాతం సిసిఆర్సి కార్డులు ఇచ్చినట్లు పేర్కొన్నప్పటికీ ఆ కార్డులు కౌలు రైతులకు అందలేదు. కంప్యూటర్‌లోనే ఉండిపోయాయి. మరొక అంశం ఏంటంటే ఒక కౌలురైతు సాగు చేస్తున్న భూమి ఎన్ని సర్వే నెంబర్లలో ఉంటే ఒక్కొక్క సర్వే నెంబర్‌కు ఒక్కొక్క కార్డు ఇచ్చి గతంలో ఎన్నడూలేని విధంగా 91 శాతం కౌలు గుర్తింపు కార్డులు ఇచ్చామని చెప్పుకోవడం చాలా విడ్డూరంగా ఉంది. కౌలు గుర్తింపు కార్డులు పొందిన కౌలు రైతుల జాబితాను రైతు సేవా కేంద్రంలో కానీ, గ్రామ సచివాలయంలోగానీ బహిరంగ పరచలేదు. సిసిఆర్సీ కార్డుల జాబితాను పరిశీలించడానికి అందుబాటులో ఉంచకుండా విస్తృతంగా ఇచ్చామని చెప్పుకోవడం ఆశ్చర్యంగా ఉంది. ఈ వర్చువల్ సమావేశంలో ప్రముఖంగా పేర్కొన్న మరొక అంశం ఏమిటంటే గడచిన సంవత్సరంలో రెండు సీజన్‌లకు కలిపి రూ.4 వేలకోట్లు పంట రుణాలివ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా, రూ.4,474.11 కోట్లు రుణాలు మంజూరు చేశామన్నారు. ఇది మరీ విచిత్రంగా ఉంది. గత ఖరీఫ్ సీజన్‌లోనే కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలంటే భూ యజమాని సదరు బ్యాంకులో బకాయి ఉన్నా లేదా ప్రస్తుతం పంట రుణం తీసుకున్నా ఆ సర్వే నంబరు గల భూమిపై ఎటువంటి పంట రుణాలు జారీ చేయకూడదని "స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్" లో రూపొందించుకొని అన్ని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్లకు, బ్యాంక్ బ్రాంచ్‌లకు సర్క్యులర్ జారీ చేశారు.

రాష్ట్రంలో భూమి కలిగిన యాజమానులు తమ భూములను కౌలురైతులకు ఇచ్చి బ్యాంకుల నుంచి పంటలు రుణాలు తీసుకునే వారు గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. అలాంటప్పుడు కౌలు రైతులకు పంట రుణాలు ఏ విధంగా ఇచ్చారో సమాధానం చెప్పటంలేదు. ఏదో కొంతమందికి ఇచ్చి అందరికి ఇచ్చామని చెప్పుకోవడం బాధాకరం. ఒకవేళ ఇచ్చారని అనుకున్న పంట రుణాలు పొందిన కౌలు రైతులు జాబితాను బ్యాంకు వద్ద గాని, రైతు సేవా కేంద్రం వద్ద గాని, గ్రామ సచివాలయం వద్ద గాని బయట పెట్టడంలేదు. ఎవరికి రుణాలు ఇచ్చారో కూడా తెలియదు. సిసిఆర్సీ కార్డుల ఆధారంగా పంట రుణాలు పొందితేనే వాస్తవంగా పంట రుణాలు తీసుకున్నట్టు లెక్క. అలా గాకుండా "సెల్ఫ్

> నూతనంగా కౌలు గుర్తింపు కార్డులు జారీ చేసిన జాబితాతో పాటు రుణాలు పొందిన వివరాలు సంబంధిత ఆఫీసుల వద్ద బహిరంగ పర్చితే వాస్తవంగా కార్డులు పొందిన వారెవ్వరో, పంటరుణాలు తీసుకుంటున్న వారి వివరాలు వెలుగులోకి వస్తాయి. ఈ కృషిలో వివిధ శాఖల పనితీరు పారదర్శకత ఏమిటో కుడా ప్రజలకు బోధపడుతుంది. లేకపోతే కార్డులు జారీ చేసిన రెవెన్యూ శాఖ, రుణాలు ఇస్తున్న బ్యాంకుల నిజాయితీని శంకించవలసి ఉంటుంది.

హెల్ప్ గ్రూపులల్లో ఉన్న కౌలురైతుల మహిళలకు రుణాలు ఇచ్చి ఆ రుణాలను పంట రుణాలుగా మార్చి లెక్కలు చెప్పటం హాస్యాస్పదంగా ఉంది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 5.9 లక్షల సిసిఆర్సీ కార్డులిచ్చామని ఇందులో 75,858 కార్డులు రెన్యువల్ చేసినట్లు చెప్పారు. ప్రతి ఏడాది ఏప్రిల్ మొదటి వారంలోనే కౌలుగుర్తింపు కార్డు జారీ ప్రక్రియ ప్రారంభించేవారు. కూటమి సర్కారు వచ్చిన నేపథ్యంలో ఈసారి రెవిన్యూ శాఖ ద్వారా కాకుండా వ్యవసాయ శాఖ ద్వారా కార్డులు ఇస్తామని, దానికి అనుగుణంగా నూతన చట్టం తీసుకురానున్నామని ఘంటాపథంగా చెప్పారు. చట్టం రాలేదు. దాదాపు రెండున్నర నెలలు నిర్లక్ష్యం చేసి కార్డుల జారీ ప్రక్రియ మొదలు పెట్టకుండా రెవిన్యూ శాఖ నిద్దుర పోయింది. ఆ సంగతే మరిచిపోయారు. గతంలో ఎన్నికల సందర్భంగా కూటమినేతలు "ఆంధ్రప్రదేశ్ పంట సాగుదారు హక్కుల చట్టం" ద్వారా కౌలు గుర్తింపు కార్డులు పొందడం సాధ్యం కావడం లేదని, దాన్ని రద్దు చేస్తామని చెప్పి ఆ పని చేయకుండా పాత చట్టం ప్రకారం గుర్తింపు కార్డులు ఇస్తున్నారు. నూతనంగా తీసుకొస్తామని చెప్పిన చట్టం గురించి ప్రస్తావించక పోవడం చాలా బాధాకరం. వాగ్దానాలు, హామీలు ఏనాడో అటకెక్కాయి.

సమీక్ష సమావేశంలో పేర్కొన్న మరొక అంశం ఏమిటంటే గుర్తింపు కార్డులు పొందిన కౌలు రైతులకు ఈ ఏడాది మొత్తంగా రూ.8 వేలకోట్లు రుణాలు మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్ధారించుకోగా, ఇప్పటి వరకూ రూ.838 కోట్లు మంజూరు చేశామన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం ఎటువంటి హామీ లేకుండా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు ఇవ్వాలని సమావేశంలో ఆదేశించారు. ఈ ఆదేశాలను ఆచరణలో అమలు పరిశీలిస్తే "ఎద్దు మూతికి చిక్కం కట్టి వరిగడ్డి వాము దగ్గరికి తీసుకెళ్లి మేత మేయమన్నట్లు" ఉంది. పైన తెలియజేసిన విధంగా స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనలకు ఆంధ్రప్రదేశ్ పంట సాగు ద్వారా హక్కుల చట్టంలోని సెక్షన్ 5 లో పేర్కొన్న నియమాలకు విరుద్ధంగా నిబంధన రూపొందించి పంట రుణాలు కౌలు రైతులకి ఇవ్వాలని ఆదేశించడం కౌలు రైతులను నమ్మించడానికి తప్ప మరొకటి కాదు. ఈ ఖరీఫ్ సీజన్‌లో ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం, మూలపాడు గ్రామంలో 9 ఎకరాలు కౌలు చేస్తున్న నిమ్మగడ్డ వాసు గత రెండు నెలల నుంచి గుర్తింపు కార్డు ఇవ్వమని గ్రామ సచివాలయ అధికారులను అడుగుతుంటే అదిగో ఇదిగో అని చెబుతూ ఇంతవరకు ఇవ్వలేదు. విజయవాడ రూరల్ మండలం పైడూరుపాడులో పెయ్యల నాగరాజుకు గుర్తింపు కార్డు ఇస్తామని చెబుతూ ప్రదక్షిణలు చేయించు కుంటున్నారు తప్ప కార్డు ఇవ్వడం లేదు. పశ్చిమగోదావరి జిల్లా ఉండి మండలం, పాందువ గ్రామానికి చెందిన నలుగురు దేవాదాయ కౌలురైతులకు పంటరుణాలు ఇస్తామని చెబుతూ కాలయాపన చేస్తున్నారు తప్ప ఇంతవరకు అందజేయలేదు.

నూతనంగా కౌలు గుర్తింపు కార్డులు జారీ చేసిన జాబితాతో పాటు రుణాలు పొందిన వివరాలు సంబంధిత ఆఫీసుల వద్ద బహిరంగ పర్చితే వాస్తవంగా కార్డులు పొందిన వారెవ్వరో, పంటరుణాలు తీసుకుంటున్న వారి వివరాలు వెలుగులోకి వస్తాయి. ఈ కృషిలో వివిధ శాఖల పనితీరు పారదర్శకత ఏమిటో కుడా ప్రజలకు బోధపడుతుంది. లేకపోతే కార్డులు జారీ చేసిన రెవెన్యూ శాఖ, రుణాలు ఇస్తున్న బ్యాంకుల నిజాయితీని శంకించవలసి ఉంటుంది. అర్హులైన కౌలు రైతులందరూ లబ్ధిపొందేలా అన్ని రకాల చర్యలు చేపట్టాలని సమావేశంలో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. చాలా సంతోషం కానీ వాస్తవంగా చెప్పాలంటే గత దశాబ్ద కాలం నుంచి వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు, బ్యాంకుల ఉన్నతాధికారులు, రెవిన్యూ శాఖ ఉన్నతాధికారులు నిర్వహిస్తున్న సమీక్ష సమావేశంలో ఉమ్మడి నిర్ణయాలు కూడా చేస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం నుంచి చట్టబద్ధమైన విధానాలు రూపొందించకుండా సమీక్షా సమావేశాల్లో పేర్కొన్న మినిట్స్, సూచనలు, సలహాలు, ఆచరణలో అమలు కానీ ఆదేశాలు చేసినప్పటికీ ఫలితం శూన్యం. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులకు రుణాలు అందించి ఆదుకోవాలనే ఒక దృఢమైన సంకల్పం ఉంటే స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌ను ఎత్తివేయాలి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం రెండు లక్షల రూపాయల వరకు పంట హామీపై రుణాలు జారీ చేయాలి. కౌలు రైతు సాగు చేస్తున్న భూమి యొక్క దామాషాను బట్టి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణాలు ఇవ్వాలి. వీటిని అమలు చేయాలంటే చట్టబద్ధమైన విధానాలను తీసుకు రావాలి. కౌలురైతులకు నిర్దేశించిన పథకాలు అమలుపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కోసం ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయవలసిన ఆవశ్యకతను గుర్తించాలి. అప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది. కౌలు రైతులకు ప్రయోజనం చేకూరుతుంది.

- ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం, ప్రధాన కార్యదర్శి

దిమ్మ తిరిగిన అమెరికా పాలకులు

టి.ఎస్.అశోక్

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు జి జిన్‌పింగ్‌ల మధ్య ఆదివారం జరిగిన చర్చలు రెండు దేశాలకు సానుకూలంగా ఉన్నాయి. ఇరు దేశాల మధ్య దీర్ఘకాలంగా ఉన్న వైరుధ్యాలు సమసిపోయి స్నేహ సంబంధాలు ఏర్పడే సూచనలు కనిపిస్తున్నాయి. అయితే ఇరుదేశాల నాయకుల మధ్య ఆదివారం జరిగిన చర్చలు అనేక విషయాలలో సానుకూలంగా ఉన్నాయని వార్తలు వస్తున్నాయి. చైనా-భారత్ దేశాలపైనే గాక, అనేక దేశాల పైన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అలవిమాలిన సుంకాలను విధించి బెంబేలెత్తించాడు. ఈ సుంకాలు విధించడానికి ప్రభుత్వానికి అధికారంలేదని కోర్టు తీర్పునిచ్చింది. ఈ నేపథ్యంలో ట్రంప్ ఏం చేయాలా అని తర్జన భర్జన పడుతున్న సమయంలోనే భారత్-చైనాల మధ్య స్నేహ సంబంధాలు మెరుగయ్యే పరిస్థితి కనిపించడంతో ఒక విధమైన ఆందోళనకు గురవుతున్నారు. చైనా నగరం తియాన్‌జిన్‌లో షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సభలు జరిగాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని మోదీ-జిన్‌పింగ్‌లు విడివిడిగా చర్చలు జరిపారు. పశ్చిమదేశాల నగరాల్లో విధాన నిర్ణయాలను తీసుకునే అధికారులు అలాగే పాలకులు వాస్తవంగా భారత ప్రధాని వాషింగ్టన్‌కు దూరమై చైనాతో స్నేహ సంబంధాలను ఏర్పరచుకున్నారన్న సూచనలతో ఆశ్చర్యపోతున్నారు.

అమెరికా, ఐరోపా దేశాల సీనియర్ దౌత్యవేత్తలు భారత్-చైనాలలో వచ్చిన మార్పులను చూసి అచ్చెరువ పడుతున్నారు. హిమాలయ వ్యాలీలో గల్వాన్‌లో జరిగిన ఘర్షణలు భారత్-చైనాల మధ్య వైరుధ్యాలు తీవ్రంగా ఉన్నాయి. ఆనాటి నుంచి భారత్-చైనాల మధ్య విమానాల రాకపోకలు నిలిచిపోయాయి. నాలుగుదేశాలతో కూడిన క్వాడ్‌సంస్థ సైతం తాజా పరిణామాల పట్ల వ్యతిరేకతను ప్రకటించింది. ఇదే సమయంలో రష్యాతో కలిసి చైనా ఎస్‌సీఓలో తమకు స్థానం ఇవ్వాలని క్వాడ్‌లో కొన్ని దేశాలు కోరుతున్నాయి. అమెరికా ప్రతిపాదించిన క్వాడ్‌కు వ్యతిరేకంగా కొన్ని దేశాలు ఏకమవుతున్నాయి.

తియాన్‌జిన్‌లో మోదీ జిన్‌పింగ్‌ల మధ్య 50 నిమిషాలపాటు చర్చలు జరిగాయి. సాధారణంగా దౌత్యపరమైన చర్చలు 50 నిమిషాలకుపైగా జరగడం ఉండదు. 2020 లో గల్వాన్ లోయలో జరిగిన ఘర్షణల నాటి నుంచి భారత్-చైనాల మధ్య అనేక అంశాలలో విభేదాలున్నాయి. హిమాలయాల్లోని ఎగువప్రాంతాలలో రెండుదేశాల సైన్యం పలుమార్లు ఘర్షణ పడ్డాయి. రెండు దేశాల మధ్య దౌత్యసంబంధాలు తీవ్రంగా నిలిచిపోయాయి. అయితే, భారత్‌కు చైనా నుంచి వాణిజ్యపరమైన వస్తువులు, అనేక రంగాలకు చెందిన ఎగుమతులు జరుగుతున్నాయి. భారత్ దేశంనుంచి జరిగే ఎగుమతులు తక్కువగా ఉన్నాయి. ఫలితంగా చైనా భారతదేశంపై అనేక అంశాలలో ఉన్నత స్థాయిలో ఉంది. రష్యా నుంచి భారతదేశం తక్కువ ధరకు ముడిచమురును దిగుమతి చేసుకుని దాన్ని శుద్ధిచేసి ఇతర దేశాలకు అమ్ముకుంటున్నారన్న అభిప్రాయం ట్రంప్‌కు ఉన్నది. ఈ విధంగా క్రూడాయిల్‌ను దిగుమతి చేసుకోకుండా నిలిపివేస్తే భారతదేశంపై 50శాతం సుంకాలు విధించబోనని ట్రంప్ షరతు విధించాడు. తాజాగా మోదీ, జిన్‌పింగ్‌ల మధ్య చర్చలు జరిగి ముఖ్య అంశాలలో సానుకూలత ఏర్పడిందని తెలియడంతోనే ముందు ముందు ఎలాంటి చర్యలు తీసుకోవాలని ట్రంప్ తికమక పడుతున్నారు.

మరోవైపు ట్రంప్ ఆరోగ్యంపై తీవ్రమైన వార్తలు వస్తున్నాయి. భారత్ మీద 50 శాతం సుంకాలు విధించి అనేక రంగాలకు నష్టం కల్పించినప్పటికీ మోదీ ఏమాత్రం స్పందించకుండా ఎస్‌సీఓ సభల్లో పాల్గొనేందుకు వెళ్లి ప్రత్యేకంగా జిన్‌పింగ్‌తో సాధారణ దౌత్య సంబంధాల చర్చలకంటే వీరివురుమధ్య జరిగిన చర్చలు సానుకూలత ఏర్పడడంపై భారతదేశంలో ప్రభుత్వ వర్గాలు ఇంకా ఇతర పక్షాలు సానుకూల వ్యాఖ్యలు చేశాయి.

ట్రంప్ తమకు సన్నిహిత స్నేహితుడని, ట్రంప్‌కు సానుకూలంగా ఎన్నికల్లో ప్రచారంచేసిన మోదీ ఈ అంశంపై ఈరోజు ఏమాత్రం మాట్లాడలేని పరిస్థితి ఎదురైంది. వివిధపార్టీల రాజకీయాల నాయకులు చాలాకాలంగా చైనా పట్ల తీవ్ర వ్యతిరేకతను కలిగిఉన్నారు. అకస్మికంగా చైనా భారత్‌ల మధ్య "సాంస్కృతిక స్నేహం" ఏర్పడుతుందని అభిప్రాయపడ్డారు. నిజంగా రెండు దేశాలమధ్య సంబంధాలు ఎక్కువ కాలం నిలుస్తాయా అనికూడా సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. చాకచక్యంగా ఇరునాయకుల మధ్య చర్చలు మెరుగైన సంబంధాలు ఏర్పడతాయని ఆశిస్తున్నారు. రెండు గొప్ప దేశాలమధ్య మెరుగైన సంబంధాలు ఉండటం ఎంతో అవసరం. ముఖ్య అంశాల విషయంలో భారత్ తప్పుచేస్తోంది. అయితే భారత్ విదేశాంగ విధానంలో పొరపాట్లు అరుదుగా జరుగుతాయి. ప్రచ్ఛన్నయుద్ధం నాటినుంచి న్యూ దిల్లీ వ్యూహాత్మకమైన స్వయంప్రతిపత్తిని కోరుతున్నది. అయితే ఈ అంశాలలో సానుకూలతను సాధించలేకపోయింది. పశ్చిమదేశాలు ఆంక్షలను విధించడం వలన ఆర్థిక మాంద్యంనుంచి బైటపడుతున్నామని జిన్‌పింగ్ తెలిపారు. అమెరికా మనపైన కక్షతీర్చుకున్నట్లుగా ప్రవర్తించడంతో సంబంధాలు దెబ్బతిన్న నేపథ్యంలో బీజింగ్ భారత్‌ను కౌగలించుకుంటుందా? అని భావిస్తున్నారు. ట్రంప్ సుంకాలు, రాజకీయాలు, ద్రవ్యోల్బణం పెరుగుతుండటం మోదీ ప్రభుత్వాన్ని కల్లోలపరుస్తున్నాయి. భవిష్యత్తు పరిణామాలు ఎలా ఉంటాయో కానీ చైనా పట్ల అనేక సందేహాలను కొందరు రాజకీయ నాయకులు, పత్రికా రచయితలు వ్యక్తం చేస్తున్నారు. మరికొద్ది కాలంలో పూర్తి సమాచారం వ్యక్తం అవుతుందని ఆశిద్దాం.

అమిత్ షా లక్ష్యంగా ఉగ్ర చొరబాట్లు

భారత సైన్యం దీటైన జవాబు

కశ్మీర్: జమ్మూకశ్మీర్‌లో వాతావరణ విధ్వంసం కారణంగా ప్రతిచోటా జనజీవనం అస్తవ్యస్తమైంది. అకాల వర్షాలతో, అనుకూలంగా లేని వాతావరణాన్ని ఉగ్రవాదులు ఆసరాగా చేసుకోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. వారి ప్రతి ప్రయత్నాన్ని భద్రతా దళాలు భగ్నం చేస్తున్నాయి. జమ్మూకశ్మీర్‌లోని పూంచ్ సెక్టార్ పరిధిలోని ఎల్‌ఓసీలోకి చొరబడేందుకు ఉగ్రవాదులు చేసిన ప్రయత్నాన్ని సైన్యం భగ్నం చేసింది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా లక్ష్యంగా సోమవారం ఉగ్రవాదులు చొరబాట్లకు ప్రయత్నిస్తుండగా భారత సైన్యం భగ్నం చేసిందని ఉన్నతాధికారులు తెలిపారు. సైన్యానికి చెందిన వైట్ నైట్ కార్ప్స్ ఎక్స్‌లో ఒక పోస్ట్ చేసింది. 'సైనికులు అన్ని ప్రాంతాలలో అప్రమత్తంగా ఉన్నారు' అని తెలిపింది. ఆర్మీ సెర్చ్ ఆపరేషన్ యూనిట్ మొదటి ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశానికి చేరుకున్నప్పుడు రెండు వైపులా మళ్లీ కాల్పులు ప్రారంభమయ్యాయని ఒక అధికారి తెలిపారు. రెండు వైపుల నుంచి కాల్పులు కొనసాగుతున్నాయని చెప్పారు. భారత సైన్యం ఈ ప్రాంతంపై పూర్తి నియంత్రణను కలిగి ఉందని, అక్రమంగా చొరబడటానికి ప్రయత్నించిన కొంతమంది ఉగ్రవాదులను మట్టుపెట్టడంతో పాటు ఇంకా ఎంతమంది మిగిలి ఉన్నారో తెలుసుకోడానికి గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గత నెలలో భారీ వర్షాలు, ఆకస్మిక వరదల కారణంగా పరిస్థితిని అంచనా వేయడానికి అమిత్ షా జమ్మూ పర్యటనకు వచ్చారు. ఈక్రమంలో ఈ ఉగ్రచొరబాటు ప్రయత్నం జరిగింది. సోమవారం ఉదయం 5.30 గంటల ప్రాంతంలో బాలాకోట్ సాధారణ ప్రాంతంలోని వైట్ నైట్ కార్ప్స్ దళాలు నియంత్రణ రేఖ సమీపంలో అనుమానాస్పద కార్యకలాపాలను గమనించాయి. వెంటనే అప్రమత్తమైన దళాలు చొరబాటుకు యత్నిస్తున్న ఉగ్రవాదులపై కాల్పులు జరిపాయి. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ నుంచి ఉగ్రవాదులు దేశంలోకి చొరబడటానికి ప్రయత్నిస్తున్నారని సైనికాధికారి తెలిపారు. తెల్లవారుజామున బాలాకోట్‌లోని డబ్బి గ్రామం సమీపంలో ఉగ్రవాదుల కార్యకలాపాలు కనిపించాయని, ఆ తర్వాత మొదటి ఎన్‌కౌంటర్ జరిగిందని ఆయన చెప్పారు. ఉగ్రవాదులు కాల్పుల నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నించారని, అయితే అదనపు దళాలను రప్పించి, మొత్తం ప్రాంతాన్ని చుట్టుముట్టి, క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించామని పేర్కొన్నారు. ఈ ఘటనకు కొన్ని రోజుల ముందు... చొరబాటుకు ప్రయత్నించిన ఇద్దరు ఉగ్రవాదులను సైన్యం హతమార్చింది.

తగ్గిన గ్యాస్ సిలిండర్ ధర

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా వాణిజ్య వినియోగదారులకు ఉపశమనం కలిగించేలా చమురు మార్కెటింగ్ కంపెనీలు 19 కిలోల ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ ధరను రూ.51.50 తగ్గించాయి. కొత్త ధరలు రెస్టారెంట్లు, హోటళ్లు, ఇతర వాణిజ్య సంస్థలకు ఉపశమనం కలిగిస్తాయి. సోమవారం నుంచే ఈ ధరలు అమల్లోకి వచ్చాయి. 14.2 కిలోల డొమెస్టిక్ సిలిండర్ల ధరల్లో ఎలాంటి మార్పు లేదు. 19 కిలోల వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ ధర ఢిల్లీలో రూ.1,580, కోల్‌కతా రూ.1,683, ముంబై రూ.1,531, చెన్నై రూ.1,737.5, 2025 ఏప్రిల్-జులై మధ్య ఢిల్లీలో రూ.138, కోల్‌కతాలో రూ.144, ముంబైలో రూ.139, చెన్నైలో రూ.141.5 తగ్గాయి. 14.2 కిలోల డొమెస్టిక్ సిలిండర్ ధర ఏప్రిల్ 8, 2025న రూ.50 పెరిగినప్పటి నుంచి మార్పు చేయలేదు. ప్రస్తుత ధరలు ఢిల్లీలో రూ.853, కోల్‌కతాలో రూ.879, ముంబైలో రూ.852.50, చెన్నైలో రూ.868.50గా ఉంది.

అద్దెకు అవ్వతాతలు

న్యూఢిల్లీ: వృద్ధులను అద్దెకిచ్చే జపాన్‌లోని విధానాన్ని ఆగ్రాలోని రామ్‌లాల్ వృద్ధాశ్రమం భారత్‌లో మొట్టమొదటిసారిగా ప్రారంభించింది. ఇందులో భాగంగా వృద్ధాశ్రమంలో ఉన్న సీనియర్ సిటిజన్లను నెలవారీ అద్దెకు తీసుకోవచ్చు. ఇందుకోసం అద్దెకు తీసుకోవాలనుకున్న కుటుంబాలు వృద్ధాశ్రమం వద్ద రూ.11 వేలు డిపాజిట్ చేయాలి. ఇందులో సగం అద్దెకు వెళ్లే సీనియర్ సిటిజన్లకు ఇస్తారు. మిగిలిన మొత్తాన్ని వృద్ధాశ్రమం నిర్వహణకు ఉపయోగిస్తారు. ఈ అద్దె విధానం ఆలోచన కేవలం ఆర్థికపరమైనది కాదని... లోతైన భావోద్వేగపరమైనదని వృద్ధాశ్రమం స్పష్టం చేసింది. కాగా, నేడు చిన్న కుటుంబాల్లో అవ్వతాతలు లేకపోవడం వల్ల చిన్నారులకు నీతి కథలు చెప్పేవారు ఉండటం లేదు. అదే సమయంలో వృద్ధులు ఈ లోటును పూడ్చే అవకాశం ఉంది.

మోసగాళ్లే గొప్ప నాయకులు: గడ్కరీ



నాగపూర్: నిజాయతీ, అంకితభావంతో జీవించాలని, సత్వర ఫలితాల కోసం అడ్డదారులు ఎంచుకోవద్దని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ప్రజలకు సూచించారు. 'ఏది సాధించాలనుకున్నా ఓ షార్ట్‌కట్ ఉంటుంది. దాంతో త్వరగా గమ్యాన్ని చేరుకోవచ్చు. ఉదాహరణకు రహదారి నిబంధనలను ఉల్లంఘించి రోడ్డు దాటొచ్చు. కానీ, షార్ట్‌కట్ వాడారంటే అది మిమ్మల్ని షార్ట్‌గా కట్ చేసేస్తుంది. అందుకే మన సమాజంలో నిజాయతీ, విశ్వసనీయత, అంకితభావం, నిజం అనే విలువలు ఉన్నాయి. దీర్ఘకాలిక విజయం ఎప్పుడూ నిజంపై ఆధారపడి ఉంటుంది. అంతిమంగా నిజమే గెలుస్తుందని భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పాడు' అని గడ్కరీ పేర్కొన్నారు. నాగపూర్‌లో సోమవారం అఖిల భారత మహానుభావ పరిషత్తు నిర్వహించిన కార్యక్రమంలో గడ్కరీ మాట్లాడారు. తన దైనందిన జీవితంలో(రాజకీయాల్లో) నిజం మాట్లాడటం నిషేధమని గడ్కరీ వ్యాఖ్యానించారు. 'నేను పనిచేసే రంగంలో మనస్ఫూర్తిగా మాట్లాడటం నిషేధం. ఎవరైతే ప్రజలను మోసం చేస్తారో వారే గొప్ప నాయకులు' అని తనదైన శైలిలో చమత్కరించారు.

ఈ 20 పెట్రోల్‌పై పిటిషన్ కొట్టేసిన సుప్రీం

న్యూఢిల్లీ: ఇరవై శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ (ఈ 20 పెట్రోలు) సురక్షితం కాదంటూ కొంతకాలంగా సామాజిక మాధ్యమాల్లో పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఈ 20 పెట్రోల్ వాడకాన్ని సవాల్ చేస్తూ న్యాయవాది అక్షయ్ మల్హోత్రా వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ముడి చమురు దిగుమతులపై ఆధారపడటాన్ని, వాహన ఉద్గారాలు తగ్గించడం, ఇంధన భద్రత, పర్యావరణ సంరక్షణ వంటి లక్ష్యాలు చేరుకోవడానికి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. ఈ తీర్పుతో దేశవ్యాప్తంగా ఈ 20 పెట్రోల్‌ను వినియోగించాలనే ప్రతిపాదన కార్యరూపం దాల్చడానికి ముందడుగు పడింది. 20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ సురక్షితం కాదంటూ కొన్ని కథనాలు వెలుగులోకి వచ్చాయి. ఈ 20 ఇంధనం పాత వాహనాల సామర్థ్యాన్ని దెబ్బతీస్తుందా? డ్రైవింగ్‌ను దెబ్బతీస్తుందా? అని వాహనదారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సహజవాయువు మంత్రిత్వశాఖ ఇటీవల వివరణాత్మక స్పష్టతనిచ్చింది. ఆ భయాలన్నీ నిరాధారమైనవని పేర్కొంది. శాస్త్రీయ ఆధారాలు, నిపుణుల విశ్లేషణకు అనుగుణంగా లేవని వెల్లడించింది. ఇథనాల్ కలిసిన పెట్రోల్‌తో ఎలాంటి ఇంజిన్ సమస్యలు తలెత్తవని మంత్రిత్వశాఖ వెల్లడించింది.

విద్యార్థినిపై ప్రిన్సిపాల్ లైంగిక దాడి

అలీగఢ్: ఉత్తరప్రదేశ్‌లోని అలీగఢ్‌లో దారుణం జరిగింది. విచక్షణ మరచి ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపాల్ ఓ విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. విద్యార్థినికి ప్రేమ లేఖలు రాసి వేధించడంతో పాటు వివాహం చేసుకోవాలని ఒత్తిడి చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఆయనను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అలీగఢ్ జవాన్ బ్లాక్‌లోని ఒక గ్రామంలో ఈ ఘటన వెలుగు చూసింది. ఇక్కడి తాలిబ్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపాల్ షకీల్ అహ్మద్... అదే స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ విద్యార్థి భయపడి ఇంటికి చేరుకున్న తర్వాత ఈ విషయాన్ని తల్లికి చెప్పింది. వెంటనే బాధితురాలి తల్లి డీఎం, ఎస్పీలను కలిసి ఘటనపై ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి ప్రిన్సిపాల్ షకీల్ అహ్మద్‌ను అరెస్టు చేసి జైలుకు పంపారు. అదే సమయంలో బాధిత విద్యార్థినిని వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి తరలించారు.

చైనాకు మోకరిల్లిన మోదీ: జైరాం రమేశ్

న్యూఢిల్లీ: భారత్, చైనా ఉగ్రవాద బాధిత దేశాలేనంటూ ప్రధాని నరేంద్ర మోదీ షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సమావేశంలో మాట్లాడటాన్ని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ సోమవారం తీవ్రంగా విమర్శించారు. పహల్గామ్ దాడి అనంతరం భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో చైనా పాత్రపై మోదీ మౌనం ఎందుకు వహించారని జైరాం రమేశ్ ప్రశ్నించారు. కాగా, 'చాలాకాలంగా చైనా ఉగ్రవాదంపై రెండు నాలుకల ధోరణి అవలంబిస్తోందని భారత్ విమర్శిస్తోంది. ప్రధాని మోదీ మాత్రం చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో చైనా, భారత్ రెండు దేశాలు ఉగ్రవాదానికి బలవుతున్నాయని చెప్పారు. అంటే మోదీ వ్యాఖ్యలనుబట్టి చూస్తే ఏనుగు.. డ్రాగన్ ముందు లొంగిపోవడం కాకపోతే మరేమిటని జైరా రమేష్ ఎక్స్ పోస్టులో మోదీని ప్రశ్నించారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో పాకిస్థాన్‌తో చైనా జుగల్‌బందీ గురించి అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో జరిగిన సంభాషణలో మోదీ మౌనంగా ఉండటం దేశ వ్యతిరేకత విషయమని భారత సైనిక ఉన్నతాధికారులే స్వయంగా వెల్లడించారు. దీనిపై మోదీ సమాధానమేమిటని జైరాం రమేశ్ ప్రశ్నించారు. 56 అంగుళాల ఛాతీగల నాయకుడు చైనా పట్ల తనకున్న వైఖరిని మరోసారి బయటపెట్టారు. జూన్ 19, 2020 (లదాఖ్ గాల్వాన్ లోయలో చైనా, భారత్ సైన్యానికి జరిగిన ఘర్షణల్లో 20 మంది భారత సైనికులు చనిపోయారు)న చైనాకు క్లీన్‌చిట్ ఇవ్వడం ద్వారా మోదీ జాతీయ ప్రయోజనాలకు ద్రోహం చేశారని నిందించారు. తాజాగా తియాంజిన్‌లో మోదీ వ్యాఖ్యలు అపఖ్యాతి పాలైన రోజుగా మిగిలిపోతుందని జైరాం రమేశ్ అన్నారు.

ప్రేమ విఫలమై... యువకుడి ఆత్మహత్య

లక్నో: తాను ప్రేమించిన అమ్మాయి దక్కకపోవడంతో మనస్తాపం చెందిన ఒక ఫొటోగ్రాఫర్ తన దుకాణంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఉత్తరప్రదేశ్ మధురలోని గోవింద్ నగర్ పోలీస్ స్టేషన్ ప్రాంతంలో జరిగింది. తన సూసైడ్ నోట్‌లో తన మరణానికి అమ్మాయి కుటుంబమే కారణమని పేర్కొన్నాడు. రాజస్థాన్‌లోని డీగ్ జిల్లా లాలావాలి గలి మెయిన్ బజార్‌లో నివసిస్తున్న ధర్మేంద్ర, తన మేనల్లుడు ఉదిత్ (25) శ్రీ కృష్ణ జన్మస్థాన్ సమీపంలోని పోత్రా కుండ్ దగ్గరలో ఫోటో షాపు పెట్టుకుని జీవిస్తున్నాడు. అతను ప్రతివారం ఇంటికి వచ్చేవాడని, రెండేళ్లుగా తన మేనల్లుడు చౌక్ బజార్‌కు చెందిన ఒక అమ్మాయిని ప్రేమించినట్లు ధర్మేంద్ర వెల్లడించాడు. మొబైల్ ఫోన్ విషయంలో ఆ అమ్మాయి తో రెండు రోజుల క్రితం గొడవ పడ్డాడని చెప్పుకొచ్చాడు ఈ వివాదంతో ఆ అమ్మాయి ఉదిత్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసిందని, బాధితురాలి ఫిర్యాదు మేరకు ఉదిత్‌పై చలాన్ దాఖలు చేసినట్లు తెలిపారు.

పంజాబ్, హిమాచల్, ఉత్తరాఖండ్‌కు రెడ్ అలర్ట్

న్యూఢిల్లీ: ఉత్తర భారతదేశాన్ని భారీ వర్షాలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. వందలాది రహదారులు, వేలాది ఇళ్లు వరదల్లో కొట్టుకుపోయాయి. రూ.వేల కోట్ల మేర భారీ నష్టం జరిగింది. ఈ నేపథ్యంలో మరో రెండు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలకు భారత వాతావరణ శాఖ సోమవారం రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఉత్తరాఖండ్‌లో తీవ్రంగా వర్షాలు కురిసే అవకాశమున్నందున నివాసితులు జాగ్రత్తగా ఉండాలని, సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామి సూచించారు. కాగా, ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి వర్షాల వల్ల హిమాచల్‌ప్రదేశ్‌లో 300 మందికి పైగా చనిపోయారు. తాజాగా చంబాలో 16 మంది మృతి చెందారు. సిమ్లాలో కొండచరియలు విరిగిపడి ఇల్లు కూలిపోయి ముగ్గురు మృతి చెందారు. ఇక పంజాబ్‌లో సంభవించిన వరదల వల్ల అన్ని కాలేజీలు యూనివర్సిటీలు, విద్యాసంస్థల్ని బుధవారం వరకు మూసివేయాలని విద్యాశాఖామంత్రి హర్‌జోత్ సింగ్ బైన్స్ ఆ శాఖ అధికారులకు ఆదేశాలిచ్చారు. పంజాబ్‌లో గురుదాస్‌పూర్, హోషియార్‌పూర్, కపుర్తలా, జలంధర్, పాటియాలా, నవాషహర్ జిల్లాలకు భారత వాతావరణశాఖ రెడ్ అలర్ట్ ప్రకటించింది. హిమాచల్ ప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని స్థానిక వాతావరణ కేంద్రం పేర్కొంది. దీంతో రాష్ట్రంలో రెడ్ అలర్ట్ జారీ చేసింది. దీంతో ఐదు జిల్లాల్లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు మూసివేశారు. గత నెలలో హిమాచల్ ప్రదేశ్‌లో 72 శాతం అధిక వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడటం, ఆకస్మిక వరదలు సంభవించడంతో ఆదివారం 666 రోడ్లు మూసివేశారు. ఇందులో ఓల్డ్ హిందూస్తాన్ టిబెట్ రోడ్డు, మండి-ధరంపూర్ రోడ్డు, హత్కోటి-పావోంటా రోడ్డు, ఔట్-సైంజ్ రోడ్డు మూడు జాతీయ రహదారులు ఉన్నాయి. హమీర్‌పూర్ పట్టణం నుంచి సుజన్‌పూర్ వైపు 12 కి.మీ దూరంలో ఉన్న చబుత్రా గ్రామంలోని దళిత బస్తీలో ఆదివారం భారీ వర్షం కారణంగా ఆరు ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. మరో 15 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఢిల్లీలో ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

చిరువ్యాపారికి రూ.141 కోట్ల పన్ను నోటీసు

లక్నో: ఓ చిరువ్యాపారికి ఏకంగా రూ.141 కోట్ల పన్ను నోటీసు జారీ అయిన ఘటన ఉత్తరప్రదేశ్‌లో వెలుగులోకి వచ్చింది. యూపీలోని బులంద్‌షహర్ ప్రాంతంలో ఓ చిన్న కిరాణా దుకాణం నడుపుతున్న సుధీర్ అనే వ్యక్తి... రూ.141 కోట్లకు పైగా అమ్మకాలపై ఆదాయపు పన్ను విభాగం అధికారుల నుంచి వచ్చిన నోటీసు చూసి కంగుతిన్నాడు. గుర్తుతెలియని వ్యక్తులు తన పాన్‌కార్డును దుర్వినియోగం చేసి... ఢిల్లీలో ఆరు కంపెనీలు నడుపుతున్నారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఇదేవిధంగా తనకు సంబంధం లేని అమ్మకాలపై 2022లోనూ సీజీఎస్టీ కార్యాలయం నుంచి నోటీసు అందిందని, ఆ కంపెనీలతో తనకు ఎలాంటి సంబంధం లేదని అప్పుడే పన్ను విభాగ అధికారులకు వివరించానని తెలిపారు. మళ్లీ జులై 10న తాను రూ.141 కోట్ల అమ్మకాలు చేసినట్లు మరో నోటీసు వచ్చిందన్నారు. అందులో ఆయన పేరు, చిరునామా, పాన్ నంబర్ ఉండటమే కాకుండా ఢిల్లీలో ఆరు కంపెనీలను నడుపుతున్నట్లు ఉందన్నారు. దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. కొందరు ఆర్థిక, సైబర్ నేరగాళ్లు బ్యాంకు ఖాతాలు తెరవడానికి, షెల్ కంపెనీలు సృష్టించడానికి, రుణాలు పొందడానికి లేదా పన్నులు ఎగవేతకు ఎవరైనా మరొక వ్యక్తి పాన్ వివరాలను చట్టవిరుద్ధంగా ఉపయోగిస్తుంటారని అధికారులు పేర్కొన్నారు. ఇటువంటి మోసాల గురించి పన్ను నోటీసులు వచ్చిన తర్వాతో లేదా రికవరీ కాల్స్ చేసినప్పుడో బయటపడుతుందన్నారు. అందువల్ల ప్రజలు తమ పాన్‌కార్డు వివరాలను బయటి వ్యక్తులతో పంచుకోవద్దని, తమ క్రెడిట్ నివేదికలను క్రమం తప్పకుండా తనిఖీ చేసుకుంటూ ఉండాలని సూచించారు. పాన్ కార్డును ఆధార్‌తో లింక్ చేయడం వల్ల ఇటువంటి మోసాలను చాలావరకు అరికట్టవచ్చని తెలిపారు. ఇటీవల ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ పారిశుద్ధ్య కార్మికుడికి రూ.34 కోట్లు చెల్లించాలని నోటీసులు అందిన సంగతి తెలిసిందే.

షరతులు అతిక్రమిస్తున్నారు

జరాంగే దీక్షపై హైకోర్టు ఆగ్రహం

ముంబై: మరాఠా కోటా ఉద్యమకారుడు మనోజ్ జరాంగే నిరాహార దీక్ష నాలుగో రోజుకు చేరుకుంది. ఓబీసీ కేటగిరిలో మరాఠాలకు రిజర్వేషన్ ఇవ్వాలంటూ ముంబై ఆజాద్ మైదాన్‌లో శుక్రవారం నుంచి ఆయన నిరాహార దీక్ష చేస్తున్నారు. దీంతో జనజీవనానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ క్రమంలో మనోజ్ జరాంగేపై ముంబై హైకోర్టు సోమవారం మండిపడింది. జరాంగే సారథ్యంలోని నిరసనలు శాంతియుతంగా లేవని, ఏ షరతుల మీద దీక్షకు అనుమతించామో వాటిని ఉల్లంఘిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. నగరం మొత్తం స్తంభించిపోతోందని, దక్షిణ ముంబైలోని కీలక ప్రాంతాలు నిరసనకారులతో నిండిపోతున్నాయని కోర్టు పేర్కొంది. కోటా నిరసలకు వ్యతిరేకంగా ఆర్మీ ఫౌండేషన్ దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయమూర్తులు రవీంద్ర ఘుగే, గౌతమ్ అంఖాడ్‌తో కూడిన ధర్మాసనం ప్రత్యేక విచారణ జరిపింది. మరాఠాలను కుంబీలుగా గుర్తించి ఓబీసీల్లో చేర్చాలని, అప్పుడు ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో మరాఠాలకు రిజర్వేషన్లు వస్తాయని జరాంగే డిమాండ్‌గా ఉంది. తన డిమాండ్ రాజ్యాంగబద్ధమైనదని, కుంబీలు, మరాఠాలు ఒకే సామాజికవర్గంగా ప్రభుత్వ రికార్డులు కూడా చెబుతున్నాయని ఆయన అంటున్నారు. ప్రభుత్వం తన డిమాండ్లు అంగీకరించకుంటే మంచినీళ్లు కూడా తాగడం మానేస్తానని ఆయన హెచ్చరించారు. మరాఠాలకు రిజర్వేషన్లు సాధించేంత వరకూ ముంబై విడిచిపెట్టే ప్రసక్తే లేదని ప్రకటించారు.

నిబంధనల ఉల్లంఘన కాదు

రష్యా చమురు కొనుగోలుపై భారత్

న్యూఢిల్లీ: రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడంలో భారత్ ఎలాంటి నిబంధనలు ఉల్లంఘించలేదని కేంద్ర పెట్రోలియం శాఖమంత్రి హర్దీప్‌సింగ్ పూరి చెప్పారు. ది హిందూ పత్రికకు ఆయన రాసిన వ్యాసంలో సోమవారం ఈ విషయాన్ని వెల్లడించారు. భారత్ అన్ని అంతర్జాతీయ నిబంధనలను పూర్తిగా గౌరవించడం వల్లే చమురు బ్యారెల్ ధర 200 డాలర్లకు చేరకుండా చూసిందని హర్దీప్‌సింగ్ పూరి అన్నారు. కొందరు విమర్శకులు రష్యా చమురుకు భారత్ లాండ్రోమ్యాట్‌గా మారిందని విమర్శిస్తున్నారని, వాస్తవానికి అవి ఏమాత్రం దగ్గరగా లేవని చెప్పారు. రష్యా నుంచి భారత్ దిగుమతి చేసుకొనే చమురు ధరలు జీ-7 దేశాలు విధించిన ప్రైస్ క్యాప్‌కు అనుకూలంగా ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. ఈ వ్యూహాన్ని జీ-7 దేశాలు రష్యా ఆదాయాన్ని నియంత్రించడం కోసం అమల్లోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ప్రపంచ చమురుధరలను స్థిరీకరించే యంత్రాంగంగా భారత్ పనిచేస్తోంది. ప్రస్తుతం న్యూఢిల్లీ చమురు దిగుమతుల్లో రష్యా వాటా 37 శాతంగా ఉంది. అమెరికా ఆంక్షలకు ఏమాత్రం భయపడకుండా రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ కొనసాగిస్తోంది. మరోవైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వాణిజ్య సలహాదారు ఇటీవల మాట్లాడుతూ 'క్రెమ్లిన్‌కు భారత్ లాండ్రోమ్యాట్ వలే పనిచేస్తోంది. ఓ వర్గం లబ్ధి పొందేందుకు భారత ప్రజలను పణంగా పెడుతోంది. మనం దానిని అడ్డుకోవాలి. అది ఉక్రెయిన్ వాసులను చంపుతోంది. మనం (అమెరికన్లు) చెల్లింపుదారులుగా ఏం చేయాలో అది చేయాలి. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి అధినేత అయిన మోదీ ఓ గొప్ప నాయకుడు. కానీ, పుతిన్, జిన్‌పింగ్‌తో ఎందుకు అంటకాగుతున్నారో నాకు అర్థం కావడంలేదు' అంటూ పరుష వ్యాఖ్యలు చేశారు. అంతకు ముందు అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ కూడా భారత్‌లోని సంపన్న కుటుంబాలు మాత్రమే రష్యా చమురుతో లబ్ధిపొందుతున్నాయని అపరిపక్వ వ్యాఖ్యలు చేశారు.

కిమ్స్ కడల్స్ వైద్యుల ఘనత

సికింద్రాబాద్: సికింద్రాబాద్‌లోని కిమ్స్ కడల్స్ ఆస్పత్రి వైద్యులు అద్భుత ఘనత సాధించారు. నవజాత శిశువును గుజరాత్‌లోని సూరత్ నుంచి హైదరాబాద్‌కు తీసుకొచ్చి ప్రాణాలు కాపాడారు. గుజరాత్‌లోని సూరత్ నగరంలో నివాసం ఉంటున్న ఓ తెలుగు కుటుంబంలో నెలలు నిండకముందే శిశువు పుట్టింది. తీవ్ర అనారోగ్య సమస్యలు చుట్టుముట్టడంతో పలు అవయవాలు పని చేయడం మానేశాయి. అక్కడి ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందించినా ఫలితం లేకపోయింది. దీంతో చిన్నారి తండ్రి సికింద్రాబాద్‌లోని కిమ్స్ కడల్స్ ఆస్పత్రిని సంప్రదించారు. ఎయిర్ అంబులెన్స్‌లో తీసుకొద్దామని ప్రయత్నించినా... ఆర్థిక ఇబ్బందుల కారణంగా రోడ్డు మార్గంలో తీసుకురావాల్సి వచ్చింది. దీంతో ఏకంగా 1300 కి.మీ దూరం ప్రయాణించి సూరత్ నుంచి హైదరాబాద్‌కు శిశువును తీసుకొచ్చి సికింద్రాబాద్ కిమ్స్ కడల్స్ ఆస్పత్రిలో చికిత్స అందించారు. ప్రస్తుతం శిశువు పూర్తిగా కోలుకున్నట్లు ఆస్పత్రి క్లినికల్ డైరెక్టర్, పసికందుల వైద్యనిపుణుడు డాక్టర్ బాబు ఎస్. మాదర్కర్ మీడియాకు వెల్లడించారు. ఈ ప్రయత్నంలో మొత్తం 31 మంది సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు. కిమ్స్ కడల్స్, రెడ్ హెల్త్ అంబులెన్స్ సంయుక్త అధ్వర్యంలో రోడ్డు మార్గంలో శిశువును ఆస్పత్రికి తీసుకొచ్చినట్లు చెప్పారు. మొత్తం 15 మంది వైద్యులు, నర్సులు, బయోమెడికల్ సిబ్బంది, మార్కెటింగ్ సిబ్బంది, 11 మంది బ్యాక్ ఎండ్ నిపుణులు, ఐదుగురు పరోక్ష సహాయకులు చిన్నారి తరలింపులో నిర్విరామంగా కృషి చేసినట్లు చెప్పారు. ఆస్పత్రికి వచ్చేసరికి చిన్నారికి మల్టీ ఆర్గాన్ సమస్యలు ఉన్నాయని, దాదాపు రెండు నెలలపాటు శిశువును ఆస్పత్రిలోనే ఉంచి చికిత్స అందించామని అన్నారు. ఇప్పుడు పూర్తిగా కోలుకున్నట్లు చెప్పారు.

ఎన్డీయే తమిళనాడు సీఎం అభ్యర్థి ఈపీఎస్

అన్నామలై, పళనిస్వామి మధ్య కుదిరిన రాజీ

చెన్నై: తమిళనాడు రాజకీయాల్లో కీలక మలుపు చోటుచేసుకుంది. బీజేపీ మాజీ అధ్యక్షుడు కన్నన్ అన్నామలై, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి తమ మధ్య విభేదాలను పక్కనపెట్టి ఒక్కటయ్యారు. ఇద్దరూ కలిసి ఒకే వేదికపై సందడి చేయడమే కాకుండా... సీఎం అభ్యర్థి ఎవరనే విషయంపైనా స్పష్టత ఇచ్చారు. గతంలో ఈపీఎస్‌పై అన్నామలై ఏ స్థాయిలో విరుచుకుపడ్డారో తెలిసిందే. 'పళనిస్వామి ఓ తెలివితక్కువోడు' అంటూ బహిరంగంగానే విమర్శలు గుప్పించారు. దీనికి కౌంటర్‌గా 'అన్నామలై బుద్ధిహీనుడు, ఆస్పత్రిలో చేర్పించాలి' అని ఈపీఎస్ వర్గం ఎదురుదాడి చేసింది. అప్పటి నుంచి వీళ్లిద్దరి మధ్య వైరం కొనసాగుతూ వచ్చింది. ఈ ఇద్దరూ ఎన్డీయే సమావేశాల్లో కలిసి మెలిగినట్లు కనిపించేది కాదు. అయితే శనివారం చెన్నైలో జరిగిన జీకే మూపనార్ వర్ధంతి కార్యక్రమంలో ఇద్దరూ ఒకే వేదికపై కనిపించడం రాజకీయ వర్గాలను ఆశ్చర్యానికి గురి చేసింది. మాజీ ముఖ్యమంత్రి, ఎన్డీయే తరఫున సీఎం అభ్యర్థి ఎడపాడి పళనిస్వామి ఇప్పుడు మాట్లాడారంటూ అన్నామలై తన ప్రసంగాన్ని ప్రారంభించారు. '2026లో మార్పు రావాలి, పేదల అభివృద్ధికి ప్రభుత్వం పని చేయాలి. ఎన్డీయే సీఎం అభ్యర్థిగా ఈపీఎస్ ఉన్నారు' అని అన్నారు. దీంతో వీళ్ల రాజకీయ ఐక్యత చర్చకు దారి తీసింది. పళనిస్వామి, అన్నామలై మధ్య విభేదాలు తమిళనాడు ఎన్డీయే కూటమిలో రాజకీయంగా గణనీయమైన ప్రభావం చూపించాయి. వ్యక్తిగత విమర్శలతో పాటు అన్నాడీఎంకే అవసరం ఎన్డీయేకు లేదన్నట్లుగా అన్నామలై వ్యవహరించారు. పైగా సీఎం అభ్యర్థిగా ఈపీఎస్ వర్గం చేసిన ప్రకటనను ఖండించారు. ఈ తీరుతో రెండు పార్టీల మధ్య దూరం పెరిగింది. ఈ రాజకీయంతో ఈపీఎస్ వర్గం బలపడగా... బీజేపీ పరిస్థితి దారుణంగా తయారైంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే కూటమికి ఒక్క సీటు కూడా రాలేదు. దీంతో అన్నామలై వైఖరినే మార్చాల్సిన అవసరం బీజేపీకి ఏర్పడింది. అందుకే 2026 అసెంబ్లీ ఎన్నికల కోసం వ్యూహం మార్చి... ఈపీఎస్‌ను సీఎం అభ్యర్థిగా ప్రకటించింది. అన్నామలై కూడా పార్టీ నిర్ణయాన్ని గౌరవిస్తూ ఈపీఎస్‌కు మద్దతు ప్రకటించినట్లు ఆయన మాటల్లోనే తెలుస్తోంది. వీళ్ల కలయికపై ఆదివారం అన్నామలైకి ప్రశ్న ఎదురైంది. దానికి ఆయన స్పందిస్తూ.. 'పార్టీ చెప్పింది, ప్రధాని మోదీ చెప్పారు. అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకుంటే దానిని శిరసావహించడం కేడర్‌గా నా బాధ్యత. అది అర్థం చేసుకోండి' అని అన్నామలై వ్యాఖ్యానించారు. గత విమర్శలపై ప్రశ్నించగా వ్యక్తిగత అభిప్రాయాలు వేరే. పార్టీ కేడర్‌గా క్రమశిక్షణ పాటించాలి కదా. ఉదాహరణకు 'డీఎంకే మంత్రిపై నాకు ఎంత కోపం ఉన్నా... వ్యక్తిగతంగా ఆ వ్యక్తిని నేను గౌరవిస్తాను. ఇది అంతే. పార్టీ చెప్పినట్లే అన్నామలై వింటాడు' అని ఆయన వివరణ ఇచ్చారు. అన్నామలై 2011 బ్యాచ్‌కు చెందిన మాజీ ఐపీఎస్ అధికారి. కర్నాటకలో ఆయన పోలీస్ అధికారిగా సేవలందించారు. 2019లో పోలీస్ ఉద్యోగానికి రాజీనామా చేసి.. 2020లో బీజేపీలో చేరారు. తమిళనాడు బీజేపీ అధ్యక్షుడిగా పనిచేసి... 'సింగం'గా ప్రజాదరణ పొందారు. అయితే వరుసగా ఎన్నికల్లో పార్టీ సరైన ఫలితాలు రాబట్టకపోవడంతో బీజేపీ అధిష్ఠానం ఆయనను అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పించింది. తాజా పరిణామం... అన్నాడీఎంకే, బీజేపీ మధ్య విభేదాలు తొలిగాయనడానికి సంకేతంగా నిలిచింది. 2026 ఎన్నికల కోసం ఈపీఎస్ నాయకత్వంలో కూటమి ముందుకు సాగుతుందన్న సంకేతాలు స్పష్టంగా అందించింది.

విశాలాంధ్ర హైదరాబాద్

రెవెన్యూ, స్టాంప్స్ - రిజిస్ట్రేషన్, సర్వే విభాగాలను అనుసంధానం చేసేలా ఒకే సాఫ్ట్‌వేర్ : మంత్రి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజలకు మరింత మెరుగైన పారదర్శక సేవలు అందించడానికి వీలుగా అవినాభావ సంబంధమున్న రెవెన్యూ, స్టాంప్స్, రిజిస్ట్రేషన్, సర్వే విభాగాలను అనుసంధానం చేసేలా సాఫ్ట్ వేర్‌ను రూపొందిస్తున్నామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. రిజిస్ట్రేషన్లకు సర్వే మ్యాప్‌ను జతచేయాలని భూభారతి చట్టంలో పేర్కొనడం జరిగింది. దీనిని దృష్టిలో పెట్టుకొని భూభారతి పోర్టల్ సర్వే మ్యాప్ లింక్ చేసేలా భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని సాఫ్ట్ వేర్‌ను అభివృద్ధి పరుస్తున్నామని తెలిపారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం లోని తన కార్యాలయంలో సోమవారం ఈ అంశంపై రెవెన్యూ, స్టాంప్స్, రిజిస్ట్రేషన్, సర్వే విభాగం, ఎన్ఐసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భూ భారతి పోర్టల్‌లో ఎలాంటి సాంకేతిక సమస్యలు రాకుండా పోర్టల్ నిర్వహణ మరింత సులభతరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎన్ఐసి అధికారులకు సూచించారు. నక్షా లేని ఐదు గ్రామాలలో రీసర్వే కొలిక్కివచ్చిన నేపథ్యంలో మిగిలిన 408 గ్రామాల్లో మరి కొద్ది రోజుల్లోనే రీసర్వేను ప్రారంభించబోతున్నామని తెలిపారు. రెవెన్యూ కార్యదర్శి డి.ఎస్.లోకేష్ కుమార్, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ ఐ.జీ.రాజీవ్ గాంధీ హనుమంతు, సిసిఎల్ఎ కార్యదర్శి మంధా మకరంద్. ఎన్.ఐ.సి. ఎస్.ఐ.ఓ ప్రసాద్, విజయ్‌మోహన్, కృష్ణ పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు మిక్కిలినేని మను చౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి అదనపు కలెక్టర్లు రాధికగుప్తా, విజయేందర్ రెడ్డిలతో కలిసి కలెక్టరు (88) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అన్నారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం ఉండకూడదని కలెక్టరు అన్నారు. అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ హరిప్రియ వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

యుపిఎస్‌సి సివిల్ సర్వీస్ పరీక్ష నిర్వహణపై సమీక్ష

విశాలాంధ్ర - హైదరాబాద్ : యు.పి.ఎస్.సి సివిల్ సర్వీస్ (మెయిన్) పరీక్షలు విజయవంతంగా నిర్వహించడం జరిగిందని జిల్లా రెవెన్యూ అధికారి ఈ. వెంకటాచారి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో యు.పి.ఎస్.సి. (మెయిన్) పరీక్ష నిర్వహణపై గత మాసంలో జరిగిన సివిల్ సర్వీసెస్ (మెయిన్) పరీక్ష నిర్వహణను సంబంధిత అధికారులతో సమీక్షించారు. పరీక్ష నిర్వహణలో ఎటువంటి సమస్యలు తలెత్తలేదని, పరీక్ష సాఫీగా పూర్తయిందని వెన్యూ సూపర్వైజర్, లోకల్ ఇంస్పెక్టింగ్ ఆఫీసర్, వివిధ శాఖాధికారులు పేర్కొన్నారు. విధులు కేటాయించిన వివిధ అధికారులు సమన్వయంతో వ్యవహరించి, గత పరీక్షల వలె ఈ పరీక్షనూ విజయవంతంగా నిర్వహించినందుకు విధులు నిర్వహించిన అధికారులను డిఆర్ఓ అభినందించారు. ఈ సమావేశంలో సూపరిండెంట్ ప్రవీణ్ కుమార్, ఎండి. రహీం, జాహిరుద్దీన్, వెన్యూ సూపర్వైజర్, లోకల్ ఇంస్పెక్టింగ్ ఆఫీసర్లు, వివిధ శాఖాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బొజ్జ గణపయ్యకు ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపనపల్లిలో గల హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక మండపంలో గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి. గంగాధర్ రెడ్డి, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బసుత్కర్ జగదీశ్వర్ రావు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ విఘ్నాధిపతి వినాయకుని పూజించడం ద్వారా చేపట్టే పనుల్లో ఆటంకాలు తొలగి, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలు కలుగుతాయి. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్ నిగమ్, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు రాఘవేంద్ర, సాయి కిరణ్, ప్రణీత్, జయకర్, నవీన్, నిఖిల్, హేమంత్, తేజ, ప్రసాద్, వంశీ, నరేష్, జస్వంత్, మణికంత, రూపేష్, వినీత్, శ్రీను, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి జీవిత భీమా అవసరం

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఆర్థిక భరోసాకు ప్రతి కుటుంబానికి జీవిత భీమా అవసరమని వినాయక్ నగర్ డివిజన్ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మీ తెలిపారు. లైఫ్ ఇన్సూరెన్స్ 69 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆనంద్ బాగ్ లోని ఎల్ఐసీ కార్యాలయంలో ఘనంగా బ్రాంచ్ మేనేజర్ బొంతు బిక్కు, అడ్మినిస్ట్రేషన్ అధికారి భానుల ఆధ్వర్యములో నిర్వహించిన వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి ఇన్సూరెన్స్ వీక్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1956 సెప్టెంబర్ 1న ఎల్ఐసీ 245 ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలతో కలిపి ఆర్డినెన్సు ద్వారా భారత ప్రభుత్వము స్థాపించిందన్నారు. జీవిత భీమా కుటుంబ భద్రతను కలిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డెవలప్మెంట్ ఆఫీసర్స్, ఏజెంట్‌లు, కస్టమర్స్, జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ పోస్టర్, సావనీర్‌ను ఆవిష్కరించిన మంత్రులు

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఈసారి అపూర్వ రీతిలో నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. డా.బీఆర్. అంబేద్కర్ సచివాలయంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కతో కలిసి మంత్రి జూపల్లి కృష్ణారావు బతుకమ్మ పోస్టర్, సావనీర్‌ను ఆవిష్కరించారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 21 - 30 వరకు 9 రోజుల పాటు 9 వేడుకలు, ప్రత్యేక కార్యక్రమాల వివరాలను మంత్రి జూపల్లి వెల్లడించారు. తెలంగాణ పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోంది. పర్యాటకం - తెలంగాణ సంస్కృతి ఈ రెండింటి మేళవింపుగా మిస్ వరల్డ్ ఈవెంట్ ను విజయవంతంగా నిర్వహించామన్నారు. రాష్ట్రంలో నిర్వహించే పండగల విశిష్టత, మన సంస్కృతి అంతర్జాతీయ పర్యాటకులకూ తెలిసేలా కార్యక్రమాలు ఏర్పాటు చేసి వారిని ఆకర్షించాలనే ప్రత్యేక కార్యచరణను రూపొందించామన్నారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన బతుకమ్మ ఉత్సవాలను ప్రభుత్వం మరింత ఘనంగా నిర్వహించి, మన సంస్కృతి సంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పబోతున్నాం. బ్రెజిల్‌లో ఏటా ఘనంగా నిర్వహించే 'రియో కార్నివాల్' తరహా కార్యక్రమాలను తెలంగాణలోనూ చేపట్టాలనే ప్రణాళికను రూపొందించామన్నారు. ఈనెల 21న వేయిస్తంభాల గుడిలో బతుకమ్మ వేడుకలు ప్రారంభమవుతాయి. గిన్నిస్ బుక్ రికార్డ్స్ సాధించే లక్ష్యంతో ఈనెల 28న ఎల్బీ స్టేడియంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తాం. హుస్సేన్‌సాగర్‌లో "ఫ్లోటింగ్ బతుకమ్మ" కార్యక్రమం ఈసారి ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ఢిల్లీ, ముంబై నుండి హైదరాబాద్‌కు వచ్చే అన్ని విమానాలలో బతుకమ్మ వెల్కమ్ డ్యాన్స్ ను ప్రదర్శిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా కళాశాలల్లో విద్యార్థులంతా పాల్గొనేలా వేడుకలుంటాయి. బతుకమ్మకు జాతీయస్థాయి ప్రచారం కోసం కొన్ని విమానయాన సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నాం" అని మంత్రి జూపల్లి వివరించారు. తెలంగాణ సంస్కృతీ, సాంప్రదాయాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోందని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. తెలంగాణ సంస్కృతి-సంప్రదాయాల ప్రతీకగా, ప్రపంచ స్థాయి ఉత్సవంగా బతుకమ్మ వేడుకలను నిర్వహించేందుకు పర్యాటక శాఖ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం ప్రశంసనీయమని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మహిళలందరూ కలిసి ఆట పాటలతో జరుపుకునే గొప్ప పండుగ మన బతుకమ్మ అని, ఈ పండుగ పువ్వులనే కాదు, చెరువులను కూడా పూజించే పండుగ అని చెప్పారు. మన సంస్కృతి, సంప్రదాయాలను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ క్రాంతి వల్లూరు, భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనానికి సర్వం సన్నద్ధం

విశాలాంధ్ర - హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో గణేష్ నిమజ్జన కార్యక్రమం సురక్షితంగా, ఎకో ఫ్రెండ్లీ విధానంలో సాఫీగా జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ తెలిపారు. సోమవారం జీహెచ్ఎంసీ కమిషనర్ నెక్లెస్ రోడ్డు మార్గంలో పీపుల్స్ ప్లాజా, సన్ రైజింగ్ పాయింట్, లేక్ వ్యూ పార్క్ బతుకమ్మ కుంట, సంజీవయ్య పార్క్ బేబీ పాండ్‌లలో నిమజ్జన ఏర్పాట్లను అదనపు కమిషనర్ రఘు ప్రసాద్‌తో కలసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. బ్యారికేడింగ్, లైటింగ్, క్రేన్‌ల ఏర్పాటు, కంట్రోల్ రూమ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆర్ వి కర్ణన్ నిమజ్జన ఏర్పాట్లను వెల్లడించారు. గ్రేటర్ హైదరాబాద్ నగరంలో 20 ప్రధాన లేక్‌లతోపాటు జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 72 కృత్రిమ కొలనులలో నిమజ్జనం కోసం ఏర్పాట్లు చేశామన్నారు. నిమజ్జనం సాఫీగా చేసేందుకు మౌలిక సదుపాయాలతో పాటు నిధులను జీహెచ్ఎంసీ కేటాయించిందని చెప్పారు. నగరంలోని అన్ని ప్రధాన లేక్‌లలో 134 స్థిర క్రేన్‌లు, 259 మొబైల్ క్రేన్‌లు ఏర్పాటు చేశామన్నారు. హైడ్రా, పర్యాటకశాఖ సమన్వయంతో హుస్సేన్ సాగర్‌లో 9 బోట్లను, డిఆర్ఎఫ్ టీంలను, 200 గత ఈతగాళ్లను సిద్ధంగా ఉంచామన్నారు. పోలీసు సహకారంతో 13 కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేశామన్నారు. 303.3 కిలోమీటర్ల మేర ప్రధాన ఊరేగింపు మార్గంలో గణేష్ విగ్రహాల నిమజ్జన ఊరేగింపు సజావుగా జరిగేందుకు 160 గణేష్ యాక్షన్ టీం లను డిప్లాయ్ చేశామన్నారు. వేడుకల్లో స్వచ్ఛతకు పెద్దపీట వేసేలా 14,486 మంది శానిటేషన్ వర్కర్స్ ను మూడు షిఫ్టులలో పని చేస్తున్నారని కమిషనర్ తెలిపారు. వినాయక చవితి ప్రారంభం నుంచి ఇప్పటివరకు 125 జీసీబీలు, 102 మినీ టిప్పర్‌లు ఉపయోగించి 3000 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను సేకరించి డంప్ యార్డుకు తరలించామని చెప్పారు. రోడ్డు సేఫ్టీ డ్రైవ్‌లో భాగంగా ఇప్పటి వరకు గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా 90 శాతంకు పైగా గుంతలను పూడ్చివేశామన్నారు. వర్షాలతో దెబ్బతిన్న మిగతా గుంతలను ఇంజనీరింగ్ విభాగం పూడ్చుతుందన్నారు. గణేష్ నిమజ్జనం సజావుగా, సాఫీగా జరిగేలా చూస్తున్నామని కమిషనర్ ఆర్ వి కర్ణన్ తెలిపారు. సకాలంలో గణేష్ ప్రతిమలను నిమజ్జనానికి తరలించాల్సిందిగా కమిషనర్ నిర్వాహకులకు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

భారీ వర్షాలతో చెరువులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలి

అధికారులను ఆదేశించించిన ముఖ్యమంత్రి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : భారీ వర్షాల సమయంలో చెరువులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో చెరువుల పరిస్థితి పైన సమగ్ర అధ్యయనం చేయాలని సూచించారు. ఇప్పటి వరకు విపత్తు నిర్వహణ నిధుల కింద చేపట్టిన పనుల వివరాలతో కలెక్టర్లు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. వర్షాలు, వరదల కారణంగా జరిగిన పంట నష్టం అంచనా వేసి తక్షణమే నివేదిక పంపడంతో పాటు, గత సంవత్సరం ఏర్పాటు చేసిన ఎస్డి ఆర్ ఎఫ్ వరదల సమయంలో బాగా పనిచేసిందని, ఎన్డీ ఆర్ ఎఫ్‌తో పని లేకుండా ఎస్డీఆర్ ఎఫ్ సిబ్బందిలో నైపుణ్యాలు పెంచాలని తెలిపారు. రాష్ట్రంలో వర్షాల కారణంగా 1052 చోట్ల 1023 కిలోమీటర్ల మేరకు రోడ్లు దెబ్బతిన్నాయని సీఎం దృష్టికి అధికారులు తేగా, రోడ్ల డ్యామేజ్ పైన సమగ్ర నివేదిక తయారు చేయాలని సూచించారు. హెచ్ఎండీఏ పరిధిలో చెరువుల నోటిపై వెంటనే జరగాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వరదలలో చనిపోయిన వారి కుటుంబాలకు 5 లక్షల రూపాయల పరిహారం అందించాలని, చనిపోయిన జంతువులకు కూడా పరిహారం ఇవ్వాలని సూచించారు. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిందేనని, కింద స్థాయి అధికారులు కూడా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అందరు కలెక్టర్లు, ఎస్పీలు జిల్లాలోనే ఉండి నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, మరి కొన్ని రోజులు వర్షాలు పడే అవకాశం ఉన్నందున డిజాస్టర్ మేనేజ్మెంట్ పైన సమగ్ర నివేదిక తయారు చేసి కేంద్రానికి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా నుండి కలెక్టర్ మను చౌదరి, మేడ్చల్ డిసిపి కోటిరెడ్డి, మల్కాజిగిరి డిసిపి పద్మజ, అదనపు కలెక్టర్లు రాధికగుప్తా, విజయేందర్ రెడ్డి, డిఆర్ఓ హరిప్రియ, ఆర్డీఓలు ఉపేందర్ రెడ్డి, శ్యాంప్రకాష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమీషనర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతనిస్తూ పరిష్కరించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమవేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో భాగంగా తమ సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, డీఆర్ఓ సంగీతతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం (92) ఫిర్యాదులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి జిల్లా అధికారులతో మాట్లాడుతూ హాస్టల్స్, పాఠశాల విద్యార్థులకు అందించే ఆహారాన్ని తయారు చేసే చోటు, వంటగది పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. ఈ నెల 6వ తేదీన నిర్వహించే గణేష్ నిమజ్జనంలో కావలసిన ఏర్పాట్లు చేయాలని, ఎలాంటి సంఘటనలు జరగకుండ చూడాలని సూచించారు. జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మోటూరి నారాయణరావుకు తెలుగు తేజం పురస్కారం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి రచయితల సంఘం అధ్యక్షుడు, ఎస్ వీ ఫౌండేషన్ చైర్మన్, కవి, రచయిత, సీనియర్ జర్నలిస్టు డాక్టర్ నారాయణరావును తెలుగు తేజం అవార్డు వరించింది. శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో వ్యవహారిక భాషా తెలుగు భాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని నరసారావు పేటలోని భువన చంద్ర టౌన్ ఆడిటోరియంలో జరిగిన తెలుగు భాషా దినోత్సవ సంబరాలలో భాగంగా ప్రముఖ కవి, తెలుగు వెలుగు సాహిత్య వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మోటూరి నారాయణరావుకు తెలుగు తేజం పురస్కారాన్ని అందించారు. తెలుగు భాష, సంస్కృతి, తెలుగు సాహిత్యం, కళల పరిరక్షణ కోసం పనిచేస్తున్న వివిద సాహితీ సంస్థల ప్రతినిధులకు, కవులకు, సాహితీ వేత్తలకు ఈ అవార్డులను అందించారు. శ్రీ శ్రీ కళా వేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, నరసరావుపేట పేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద్ బాబు, పింగళి వెంకయ్య మనుమడు జీవీఎస్ నరసింహులు, శ్రీ శ్రీ కళా వేదిక జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరీ భూషణం ఆధ్వర్యంలో కవి సార్వభౌముడు శ్రీనాధుడు ముని మనుమడు కావూరి శ్రీనివాస్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. డాక్టర్ మోటూరి నారాయణరావు మాట్లాడుతూ.. దశాబ్ద కాలంగా ఎస్ వీ ఫౌండేషన్, తెలుగు వెలుగు సాహిత్య వేదిక ద్వారా పలు సాహిత్య, సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్న నేపథ్యంలో శ్రీ శ్రీ కళా వేదిక వారు తెలుగు తేజం పురస్కారం అందించటం సంతోషంగా ఉందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ప్రముఖ చమత్కార కవి కేవీఎల్ కామేశ్వరరావు, కవులు మండికారి బాలాజీ, భోగెల ఉమాకవి, దబ్బీరు గోవిందరావు, బాలచందర్ సాదే, గుర్రపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చీకటి వ్యవహారాలు నడుపుతున్న కాంగ్రెస్, బీజేపీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : కాంగ్రెస్ బీజేపీ కలిసి తెలంగాణలో చీకటి వ్యవహారాలు నడుపుతున్నాయని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ అన్నారు. 42 శాతం రిజర్వేషన్ ఇస్తే ప్రభుత్వ చేతులు లేకపోతున్నాయని, కేసీఆర్ సేవలను తగ్గించడానికి ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్సీ డా. దాసోజు శ్రావణ్ మీడియాతో మాట్లాడుతూ బీసీలకు 42శాతం రిజర్వేషన్ విషయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం దుర్మార్గపు బూటకాలను చూపిస్తున్నదని అన్నారు. బీసీ ప్రజల భావోద్వేగాలను దృష్టిలో ఉంచకపోవడం, రాష్ట్రపతి వద్ద బిల్ ఉన్నప్పటికీ జంతర్మంతర్ వద్ద ధర్నాలు, ఆర్డినెన్సు ద్వారా నాటకాలు సృష్టించబడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. బీసీ బిల్లుకు పార్టీ తరఫున మద్దతు ఇవ్వగా, బీసీ ఆర్డినెన్సుకు కూడా మద్దతు ఇచ్చారని, రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి రాజ్యాంగాన్ని గౌరవించడం అసంపూర్ణం అని డా. శ్రావణ్ స్పష్టం చేశారు. కేబినేట్ మంత్రులు సరైన పద్ధతులు పాటించడం లేదని ఆయన తెలిపారు. బుసాని వెంకటేశ్వర్ రావు సర్వేలో 160 కోట్లు వ్యయం చేయబడినప్పటికీ తప్పు సర్వే చూపించబడిందని, 2014లో కేసీఆర్ చేసిన సర్వేతో పోలిస్తే పెద్ద తేడా ఉందని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ప్రజల సంఖ్యను సరిగ్గా అంచనా వేయడానికి కూడా సామర్థ్యం లేదని చెప్పారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ల విషయంలో ఆసక్తి చూపకపోవడం, కేంద్ర మంత్రులు, ఎంపీలు ఉన్నా కూడా కాంగ్రెస్, బీజేపీ పార్టీలు తెలంగాణలో చీకటి వ్యవహారాలను కొనసాగిస్తున్నాయని విమర్శించారు.

కేసీఆర్ సేవలను తగ్గించడానికి, తప్పుడు సర్వేలు, అసమర్థ నిర్ణయాలతో ప్రజలపై బురద జల్లుతున్నారని, రాష్ట్ర పంట ఉత్పత్తి, రైతుల సమస్యలు, గురుకుల హాస్టల్స్‌లో విద్యార్థుల భోజనం, ఆరోగ్య సమస్యలు ప్రభుత్వ నిర్లక్ష్యానికి ప్రత్యక్ష ఉదాహరణలు అని డా. శ్రావణ్ తెలిపారు. డా. దాసోజు శ్రావణ్ ఈ అసమర్థత, నాటకాలు, రాజ్యాంగం పట్ల ఆసక్తి లేకపోవడం రాష్ట్రానికి, ప్రజలకు నష్టాన్ని కలిగిస్తున్నదని స్పష్టంగా చెప్పారు.

అనుమతుల పేరుతో వేధింపులు తగదు...

ఎన్‌వోసీల జారీలో అలసత్వంపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం...

విశాలాంధ్ర - హైదరాబాద్ : బహుళ అంతస్తుల భవనాలు, ఇతర నిర్మాణాలకు సంబంధించి అనుమతుల జారీ విషయంలో జాప్యంపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్ఎండీఏ పరిధిలో బిల్డ్ నౌ కింద పనుల అనుమతుల విషయంపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సోమవారం సాయంత్రం సమీక్షించారు. బహుళ అంతస్తుల భవనాలు, గేటెడ్ కమ్యూనిటీల నిర్మాణం, ఇతర అనుమతుల విషయంలో ఉద్దేశపూర్వకంగా కొందరు అధికారులు అలసత్వం చూపుతున్నారని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మండిపడ్డారు. అనుమతుల జాప్యంలో ఆలస్యానికి కారకులను గుర్తించి వారిని సరెండర్ చేయాలని హెచ్ఎండీఏ కార్యదర్శి ఇలంబర్తిని సీఎం ఆదేశించారు. ముఖ్యంగా నీటి పారుదల శాఖ విభాగం అధికారులపై పలు ఆరోపణలు వస్తున్నాయని... వాటిని ఎంతమాత్రం సహించేది లేదని సీఎం హెచ్చరించారు. హెచ్ఎండీఏ పరిధిలోని చెరువులు, నాలాల, ఇతర నీటి వనరులకు సంబంధించి లైడార్ సర్వేను తక్షణమే చేపట్టాలని సీఎం ఆదేశించారు. సమగ్రమైన వివరాలున్నప్పుడు మాత్రమే ఎటువంటి వివాదాలకు తావుండదని సీఎం అన్నారు. జీహెచ్ఎంసీ, హైడ్రా, ఇరిగేషన్ అధికారులతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ త్వరగా అనుమతులు మంజూరు చేయాలని సీఎం హెచ్ఎండీఏ సెక్రటరీని ఆదేశించారు. సమీక్షలో హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, హైడ్రా కమిషనర్ రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

స్థలం కేటాయింపుపై ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్కాజిగిరి శాసన సభ నియోజకవర్గ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదివారం రాష్ట్ర ఐ.టీ., ఇండస్ట్రీస్, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్ శాఖల మంత్రి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రివర్యులు శ్రీధర్ బాబుని అసెంబ్లీలో మర్యాదపూర్వకంగా కలిసి, మల్కాజిగిరి నియోజక వర్గంలో తెలంగాణ బ్రాహ్మణ సంఘానికి స్థలాన్ని కేటాయించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి అభినందనీయమని బ్రాహ్మణ సంఘం నాయకులు పేర్కొన్నారు.నియోజకవర్గంలో బ్రాహ్మణ కుటుంబాలు పెద్ద సంఖ్యలో ఉన్న నేపథ్యంలో, వివాహాలు, కర్మకాండలు, ఇతర సామాజిక కార్యక్రమాల నిర్వహణ కోసం ఒక సమగ్ర బ్రాహ్మణ కమ్యూనిటీ భవనం అవసరమని వారు వివరించడం బ్రాహ్మణుల పట్ల శ్రద్ధను తెలియజేస్తున్నారు. ఈ స్థల కేటాయింపు ద్వారా పేద బ్రాహ్మణ కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే హితవు చెప్పారు. తెలంగాణ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు మల్కాజిగిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లి మర్రి రాజశేఖర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బ్రాహ్మణ సమాజం సంక్షేమం పట్ల ఆయన చూపిన శ్రద్ధకు సంఘం తరఫున ప్రశంసలు వెల్లువెత్తాయి. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు, కార్యదర్శి, సభ్యులు పాల్గొన్నారు.

శాసనసభలో బీసీ బిల్లు ఆమోదించడం హర్షణీయం



విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టిన బీసీ బిల్లును అన్ని రాజకీయ పార్టీలు బలపరిచి ఏకగ్రీవంగా ఆమోదించడం పట్ల బీసీ హకుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు హర్షం ప్రకటించి ముఖ్యమంత్రికి శాసన సభ్యులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ గతంలో శాసనసభలో బిల్లులు ఏకగ్రీవంగా ఆమోదించి గవర్నర్ ద్వారా కేంద్రానికి పంపిస్తే, కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంతో ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉందని, గత్యంతరం లేని పరిస్థితుల్లో రాష్ట్ర శాసనసభ ప్రత్యేక సమావేశం నిర్వహించి 50% రిజర్వేషన్ పరిమితిని ఎత్తివేస్తూ బీసీ బిల్లు ఆమోదించి గవర్నర్ కు పంపించడం జరిగిందని ఇప్పుడైనా ఏమాత్రం ఆలస్యం చేయకుండా యుద్ధ ప్రాతిపదికన కేంద్ర ప్రభుత్వం స్పందించి రాజ్యాంగ సవరణ ద్వారా రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీల రిజర్వేషన్ అమలు జరగకుండ ఏ పార్టీ ప్రయత్నం చేసిన వారు బీసీ ద్రోహులుగానే మిగిలిపోతారని ఆయన హెచ్చరించారు.తరతరాలుగా అన్యాయానికి అణిచివేతకు గురవుతున్న బీసీలందరు రాజకీయాల కతీతంగా స్థానిక సంస్థల రిజర్వేషన్ తో పాటు చట్టసభలలో 50% రిజర్వేషన్, జనాభా ప్రాతిపదికన సంక్షేమం అభివృద్ధి కోసం నిధులు సాధించేదాకా విశ్రమించ కుండా" మేమెంతో మాకంతా" నినాదంతో పోరాటాడిలని వెంకట్రాములు పిలుపునిచ్చారు.

డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్లో కళాకృతి సాంస్కృతిక, వారసత్వ కార్యక్రమం

విశాలాంధ్ర - కాప్రా : నాచారం లోని డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్లో కళాకృతి సాంస్కృతిక, వారసత్వ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శనలు పలువురిని ఆకర్షించాయి. కళాకృతి భారత సాంస్కృతిక వారసత్వానికి అద్దంపడుతూ చూపరులను మంత్ర ముగ్ధులను చేసే విధంగా నృత్య ప్రదర్శనలు, మనోహరమైన సంగీతం, సంక్లిష్టమైన సాంప్రదాయ కళా, నాటక ప్రదర్శనల ద్వారా పాఠశాల ప్రాంగణం మారుమోగింది. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ కె.నవనీతరావు మాట్లాడుతూ ఇలాంటి వేదికలు విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ప్రయోగశాలలుగా పిలుస్తాయని కొనియాడారు. ఇలాంటి అద్భుతమైన అవకాశలతో విద్యార్థులు మరింత సృజనాత్మకత పొందుతారన్నారు. ఈ కళాకృతి వారసత్వం, సామరస్యం యొక్క చిరస్మరణీయ వేడుకగా నిలుస్తుంది అన్నారు. విద్యాపరంగా మాత్రమే కాకుండా సాంస్కృతిక వారసత్వ కార్యక్రమాల ద్వారా భవిష్యత్ తరాలను పెంపొందించడంలో ఉపయోగపడుతుందన్నారు. పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ కుమార్, డైరెక్టర్ డాక్టర్ కమలా మనోహర్ రావు, ఆపరేషన్స్ కోర్ హెడ్ కిషోర్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ స్వర్ణ అక్కినేని, వైస్ ప్రిన్సిపాల్స్, ప్రీ-ప్రైమరీ కోఆర్డినేటర్ పాల్గొన్నారు.

కాళేశ్వరంపై తొమ్మిది గంటల పాటు చర్చ

సీబీఐ విచారణకు ఆదేశిస్తున్నట్లు అసెంబ్లీలో ప్రకటించిన ముఖ్యమంత్రి

విశాలాంధ్ర - హైదరాబాద్ : కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీ నిర్మాణం - జస్టిస్ పినాకి చంద్రఘోష్ విచారణ కమిషన్ నివేదికపై శాసనసభలో సుదీర్ఘంగా చర్చించిన మీదట తదుపరి విచారణకు ఈ మొత్తం వ్యవహారాన్ని సీబీఐకి అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు శాసనసభలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటన చేశారు. "కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో జరిగిన అవకతవకలు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం, అవినీతి ఆరోపణలపై విచారణ కోసం తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్రఘోష్ నేతృత్వంలో విచారణ కమిషన్‌ను నియమించడం జరిగింది. దీనిపై విచారణ కమిషన్ తన నివేదికను జూలై 31, 2025 వ తేదీన ప్రభుత్వానికి సమర్పించింది. ఆగస్టు 4, 2025 వ తేదీన జరిగిన మంత్రిమండలి సమావేశం ఆ నివేదికను ఆమోదించింది. ఆ మేరకు ఈ అంశంపై శాసనసభలో చర్చ జరిగింది. జస్టిస్ ఘోష్ కమిషన్ తన నివేదికలో క్రిమినల్ చర్యలకు అర్హమైన అనేక లోపాలు, అవకతవకలను గుర్తించింది. నిర్లక్ష్యం, దురుద్దేశం, ఉద్దేశపూర్వకంగా వాస్తవాలను తొక్కిపెట్టడం, ఆర్థిక అవకతవకల వంటి అంశాలను ప్రస్తావించింది. మూడు బ్యారేజీల నిర్మాణంలో తప్పు జరిగిందని, అసలు ప్లానింగ్ లేదని కమిషన్ తేల్చి చెప్పింది. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఎన్డీఎస్ ఏ నివేదిక ప్రకారం మేడిగడ్డ నిర్మాణ వైఫల్యానికి ప్లానింగ్, డిజైన్, క్వాలిటీ కంట్రోల్ లోపాలు కారణమని తేలింది. నాణ్యతా నిర్వహణ సరిగా లేకపోవడం వల్ల నిర్మాణంలో లోపాలు ఏర్పడ్డాయని ఎన్డీఎస్ఏ గుర్తించింది. ఈ అంశాలన్నింటిపై లోతుగా, మరింత సమగ్రంగా దర్యాప్తు చేయాల్సిన అవసరాన్ని ఎన్డీఎస్ఏ, విచారణ కమిషన్ నివేదికలు స్పష్టం చేశాయి. ప్రాజెక్టు డిజైన్, నిర్మాణం, ఫైనాన్సింగ్‌లో, వ్యాప్కోస్ వంటి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు పీఎఫ్సీ, ఆర్ఈసీ వంటి ఆర్థిక సంస్థలు పాలుపంచుకున్నందున ఈ కేసును సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ సీబీఐకి అప్పగించడం సముచితం. అందుకే ఈ కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తూ శాసనసభ నిర్ణయం తీసుకుంటుంది. ఎన్నో రకాలైన అంశాలు, విచారణ అర్హమైన విషయాలు ఇందులో ఉండటం వల్ల సీబీఐ విచారణకు ఆదేశించాలని నిర్ణయించడం జరిగింది. నిజాయితీతో కూడిన విచారణ జరగాలని కోరుకుంటున్నాం.. అని కమిషన్ నివేదికపై చర్చకు సమాధానంగా ముఖ్యమంత్రి వివరించారు. అంతకుముందు జస్టిస్ పినాకి చంద్రఘోష్ విచారణ కమిషన్ నివేదికను నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శాసనసభ ముందుంచారు. అనంతరం స్పీకర్ అనుమతి మేరకు మంత్రి స్వల్పకాలిక చర్చను ప్రారంభించారు. తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు ప్రాజెక్టు స్థలాన్ని మార్చడం నుంచి మేడిగడ్డ ప్పియర్స్ కుంగిపోయిన పరిణామాల వరకు, తదనంతరం జస్టిస్ ఘోష్ నేతృత్వంలో విచారణ కమిషన్ నియామకం వరకు వివరాలను సభలో తెలియజేశారు. చర్చపై ముఖ్యమంత్రి సమాధానమిస్తూ, ఘోష్ కమిషన్ ఏర్పాటు నేపథ్యం, కమిషన్ సమర్పించిన 665 పేజీల నివేదికలోని సారాంశాన్ని, జరిగిన చర్చ వివరాలను ప్రస్తావించారు. నివేదికల్లో అనేక అంశాలతో మల్టిపుల్ కాంప్లికేషన్స్ తో ముడిపడి ఉన్నందున ఎలాంటి శషభిషలకు తావులేకుండా ఒక స్పష్టమైన, నిర్దిష్టమైన కార్యాచరణతో ముందుకు వెళ్లాలనుకున్న ప్రభుత్వం కేసును సీబీఐకి అప్పగించాలని నిర్ణయించినట్టు తెలిపారు.

పెద్దల సభలో గందరగోళం!

కాళేశ్వరంపై సీబీఐ విచారణ వ్యతిరేకించిన బీఆర్ఎస్

పూర్తిస్థాయి చర్చ లేకుండానే మూడు బిల్లులకు ఆమోదం

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ సవరణ బిల్లు, మున్సిపల్ చట్ట సవరణ బిల్లు, అల్లోపతిక్ చట్ట సవరణ బిల్లులను శాసనమండలి సోమవారం ఆమోదించింది. కాళేశ్వరంపై సీబీఐ విచారణను వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ సభ్యులు నిరసనకు దిగారు. దీంతో బిల్లులపై పూర్తి స్థాయి చర్చ జరగకుండానే సభ ఆమోదం తెలిపింది. అనంతరం సభను శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి నిరవధిక వాయిదా వేశారు. అంతకు ముందు శాసనమండలిలో పంచాయతీరాజ్ శాఖమంత్రి దనసరి అనసూయ (సీతక్క) పంచాయతీరాజ్ బిల్లును ప్రవేశపెట్టగా, వైద్య ఆరోగ్య శాఖమంత్రి దమోదర రాజనర్సింహా... అల్లోపతిక్ చట్ట సవరణ బిల్లును, శాసనసభ వ్యవహారాలు, పరిశ్రమల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు... మున్సిపల్ చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. పంచాయతీరాజ్ బిల్లుపై జరిగిన చర్చలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతుండగా బీఆర్ఎస్ సభ్యులు కాళేశ్వరంపై సీబీఐ విచారణను వ్యతిరేకిస్తూ, కాళేశ్వరంపై సభలో చర్చించాలని పట్టుబట్టారు. దీంతో శాసనమండలి చైర్మన్ స్పందిస్తూ శాసనసభలో జరిగిన చర్చకు శాసనమండలికి సంబంధం లేదని, శాసనసభలో జరిగిన అంశాలను ఇక్కడ ప్రస్తావించ వద్దని సూచించారు. బీఆర్ఎస్ సభ్యులకు ఎవరి స్థానాల్లో వారు కూర్చోవాలని విజ్ఞప్తి చేసినప్పటికీ పోడియం వద్దకు వెళ్లి నినాదాలు చేశారు. "కాళేశ్వరం కమిషన్ బూటకం, సీబీఐతో దోస్తీ బీజేపీతో కుస్తీ, కాంగ్రెస్... బీజేపీ నాటకం, 'రాహుల్‌కి సిబిఐ వద్దు, రేవంత్‌కి సీబీఐ ముద్దు'' అంటూ నినాదాలు చేస్తూ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను చింపేసి, వాటిని చైర్మన్‌పై విసిరేశారు. దీంతో బీఆర్ఎస్ సభ్యుల తీరుపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కావాలనే బీసీ రిజర్వేన్ బిల్లును బీఆర్ఎస్ అడ్డుకుంటోందని పొన్నం విమర్శించారు. అయినప్పటికీ బీఆర్ఎస్ సభ్యులు వినకపోవడంతో గందరగోళం మధ్యనే బిల్లులను శాసనమండలి ఆమోదించింది.

చిత్తశుద్ధి ఉంటే 42 శాతం రిజర్వేషన్‌లకు సహకరించండి: ఎమ్మెల్సీ నెల్లికంటి

బీజేపీ, బీఆర్ఎస్‌లకు చిత్తశుద్ధి ఉంటే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు సహకరించాలని సీపీఐ నేత, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. శాసనమండలి మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించేందుకు అడ్డంకిగా ఉన్న పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లుకు తాము సంపూర్ణంగా మద్దతిచ్చామన్నారు. 23 శాతం ఉన్న రిజర్వేషన్‌లను 42 శాతానికి పెంచుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన బిల్లు తీసుకొచ్చిందని తెలిపారు. కాళేశ్వరంపై నిష్పాక్షపాతంగా విచారణ జరిపించాలని కోరారు.

కాళేశ్వరంలో అవినీతి వాస్తవం:మహేశ్ కుమార్ గౌడ్

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగిన మాట వాస్తవమని టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఈ విషయాన్ని తెలంగాణలో 90 శాతానికి పైగా ప్రజలు నమ్మి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దెదించారని తెలిపారు. శాసనమండలి మీడియా పాయింట్ వద్ద మంత్రులు పొన్నం ప్రభాకర్, దనసరి అనసూయ సీతక్కలతో కలిసి ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగినందునే సీబీఐకి అప్పగించామని అన్నారు. కాళేశ్వరం అంశంపై మాట్లాడలేకే కేసీఆర్ మోహం చాటేశారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తుందని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆరోపించారు. గతంలో 32 శాతం రిజర్వేషన్‌ల అమలు కోసం బిల్లును ప్రవేశపెడితే హైకోర్టులో కేసు వేసి అడ్డుకున్నారని, ఇందిరా సహాని కేసు, హైకోర్టు, సుప్రీంకోర్టుల కేసులతో బీసీ బిల్లు అమలయ్యే పరిస్థితులు లేవని ఆయన చెప్పారు.

పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : అంగన్వాడి కేంద్రాల ద్వారా పిల్లలు, గర్భవతులు అలాగే బాలింతలకు సమయానికి నాణ్యమైన పోషక ఆహారం అందించాలని జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి సంబంధిత సిబ్బందికి సూచించారు. సోమవారం యూసుఫ్ గూడ ఆరోగ్యనగర్‌లో గల నాట్కో అంగన్వాడి కేంద్రం, సుభాష్‌నగర్‌లో గల మరో అంగన్వాడి కేంద్రాన్ని ఆమె సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు, గర్భవతులు అలాగే బాలింతలకు నాణ్యమైన పోషకాహారం అందించాలని అలాగే గర్భవతులకు క్రమం తప్పకుండా టీకాలు అందించాలని సూచించారు. జిల్లాలో వర్షాలు తరచుగా పడుతున్నందున వచ్చే పిల్లలకు వ్యాధులు సోకకుండా వారి ఆరోగ్య పరిరక్షణకు పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదేవిదంగా అంగన్వాడి కేంద్రాలతో పాటు పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఎస్ హెచ్ పి ఎస్ (న్యూట్రిషన్ హెల్త్ ప్యాకింగ్ సిస్టం) యాప్‌ను పరిశీలించి సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. కేంద్రాల నిర్వహణ తీరు సరిగా లేకపోవడంతో సంబంధిత అధికారులు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సుభాష్ చంద్రబోస్ ప్రాంతంలో గల అంగన్వాడి కేంద్రం సరిగా లేకపోవడంతో పిల్లలను ఆరోగ్య నగర్ అంగన్వాడి కేంద్రానికి పంపించాలని కలెక్టర్ సూచించారు. తాసిల్దార్ ప్రేమ్ కుమార్, సిడిపిఓ పుష్ప, భారతీరత్నం, టీచర్లు చంద్రకళ, ఝాన్సీ పాల్గొన్నారు.

ప్రజా అర్జీలపై సత్వరమే స్పందించాలి

ప్రజాలు ప్రజావాణిలో అందించిన అర్జీలపై సత్వరమే అధికారులు స్పందించాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు ముకుంద రెడ్డి, కదిరవన్ పలని, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారితో కలసి కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన దరఖాస్తులను అధికారులు పరిశీలించి తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. వికలాంగులు, వయోవృద్ధుల అర్జీల సమర్పణ సులభతరం చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి గారి ఆదేశాల మేరకు ప్రవేశపెట్టిన వాట్సాప్ నెంబరు ద్వారా వచ్చే అర్జీలకూ అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ప్రజల వద్ద నుండి దరఖాస్తులను స్వీకరించి, వారి సమస్యలను తెలుసుకుని, దరఖాస్తులపై ఎండార్స్మెంట్ చేసి సంబంధిత శాఖల అధికారులకు అందచేశారు. సి.ఎం. ప్రజావాణి ద్వారా అందిన దరఖాస్తుల పురోగతిపై ఆమె సమీక్షించారు.

నగరంలో యుద్ధ ప్రాతిపదికన రోడ్ సేఫ్టీ డ్రైవ్



విశాలాంధ్ర - హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రోడ్డు భద్రత చర్యలలో భాగంగా గుంతల పూడ్చివేత పనులు, క్యాచ్ పిట్ రిపేర్‌లు, కవర్ రీప్లేస్‌మెంట్‌లు, సెంట్రల్ మీడియన్ మరమ్మతులు నిరంతరంగా కొనసాగుతున్నాయి. సోమవారం కృష్ణా నగర్, నాంపల్లి బంజారా హిల్స్, ఎర్రమంజిల్, జూబ్లీహిల్స్, మచ్చ బొల్లారం, లకిడికపూల్, జవహర్నగర లలో డ్రైవ్ చేపట్టారు. కొత్త సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు గుంతల పూడ్చివేత క్యాచ్ పిట్‌లకు రిపేర్ చేశారు. సెప్టెంబర్ 1 నాటికీ నగరంలో మొత్తం 13,616 గుంతలు గుర్తించడం జరిగింది. వాటిలో 10,962 గుంతలకు మరమ్మతులు చేయడం జరిగింది. నిన్నటి వరకు 10,854 గుంతలను పూడ్చివేయగా, ఇవాళ ఒక్కరోజే 108 గుంతలకు మరమ్మతులు చేయడం జరిగింది. ఇప్పటి వరకు 544 క్యాచ్ పిట్స్ రిపేర్‌లు, 311 కవర్ రీప్లేస్‌మెంట్‌లు, 12 సెంట్రల్ మీడియన్ మరమ్మతులు పూర్తి అయ్యాయి.

ప్రజావాణి అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి: కమిషనర్

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు, విన్నపాలను సత్వరమే పరిష్కరించాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు కమీషనర్ కు తమ విన్నపాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రజల నుండి అందిన ఫిర్యాదులను కమీషనర్ క్షుణ్ణంగా పరిశీలించి సత్వర పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ ఆర్.వి కర్ణన్ మాట్లాడుతూ... ప్రజల విన్నపాల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని అధికారులను ఆదేశించారు. అర్జీదారులు ఒకే సమస్య పై పదేపదే రాకుండా హెచ్‌ఓడి లు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 63 విన్నపాలు రాగా, అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి 36, రెవెన్యూ (ప్రాపర్టీ ట్యాక్స్) 6, ఇంజనీరింగ్, ఫైనాన్స్ అకౌంట్ 5 విభాగాలకు చొప్పున, ఎలక్షన్, విజిలెన్స్ విభాగాలకు రెండు చొప్పున, యు.బి.డి, అడ్మినిస్ట్రేటివ్, యు.సి.డి, హెల్త్ విభాగాలకు ఒకటి చొప్పున ఫిర్యాదులు అందగా, ఫోన్ ఇన్ ద్వారా 3 ఫిర్యాదులు అందాయి. జిహెచ్‌ఎంసి పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 59 అర్జీలు వచ్చాయి. అందులో కూకట్ పల్లి జోన్ లో 25, శేరిలింగంపల్లి జోన్ లో 13, సికింద్రాబాద్ జోన్ లో 11, ఎల్బీనగర్ జోన్ లో 06, చార్మినార్ జోన్ లో 04 ఫిర్యాదులు అందాయి.

రైతులు పంట నమోదు చేసుకోండి

విశాలాంధ్ర - మొయినాబాద్: మొయినాబాద్ మండలంలోని రైతులకు సెప్టెంబర్ 1వ తారీకు నుంచి పంట నమోదు కార్యక్రమం ప్రారంభించబడినదని, మండలంలోని రైతులందరూ తమ క్లస్టర్ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి తమ యొక్క పంటను నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. అంతే కాకుండా ఈ సంవత్సరం డిజిటల్ క్రాప్ బుకింగ్ ద్వారా పంట నమోదు చేయడం జరుగుతుందని, వరి, పెసర, పత్తి మొదలగు పంటలను విక్రయించేటప్పుడు ఆన్లైన్ నమోదు తప్పనిసరి చేసినందున, పంట నమోదు అనేది రైతు భరోసాకి తప్పనిసరి చేసినందున, రైతులందరూ కూడా పంట నమోదును తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ఈ పంట నమోదు కార్యక్రమం అక్టోబర్ 31 లోపు చేయించుకోవాలని కోరారు.

ఇంగ్లీషు అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ప్రభుత్వ డిగ్రీ కళాశాల మల్కాజిగిరిలో ఇంగ్లీషు అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులను ఈనెల 3 సెప్టెంబరు 2025 వరకు స్వీకరించబడునని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బండి రాజు తెలియచేశారు. పై పోస్టుకు పీజీలో 55శాతం మార్కులు కలిగిన ఉండాలి. ఎస్సీ, ఎస్టీ కేటగిరీల వారికి 50శాతం మార్కులు ఉన్నవారు కూడా అర్హులు. మార్కులతోపాటు Ph.D, NET, SLET, SET కలిగిన అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును.డిగ్రీ అధ్యాపకులుగా అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుంది. అర్హత కలిగిన అభ్యర్థులు తమ అప్లికేషన్‌తో పాటు ఒక జత సర్టిఫికెట్లు జిరాక్స్ కాపీలను జతచేసి ఈనెల 03 సెప్టెంబరు 2025 తేదీ సాయంత్రం 6 గం.లోపు కళాశాలలో అందించగలరు. ఇతర వివరాలకు కళాశాలలో సంప్రదించగలరు.

లోటస్ ప్రైవేట్ ఆస్పత్రిని ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - షాద్‌నగర్, రూరల్ : నాణ్యమైన వైద్యాన్ని అందించాలని తక్కువ ధరతో ఖరీదైన వైద్యం అందించే విధంగా కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో లోటస్ ప్రైవేటు ఆసుపత్రికి డాక్టర్ ప్రతాప్ కుమార్, డాక్టర్ అరవింద మాచర్ల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరై ప్రవేట్ ఆసుపత్రిని ప్రారంభించడం జరిగింది. అనంతరం ఎమ్మెల్యే శంకర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ పేద ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలని సూచించారు. అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉంటుందని అన్నారు. ప్రతి రోగానికి పరీక్షలన్నీ నమ్మకుండా కొన్ని అనుభవపూర్వకంగా వైద్యం అందించాల్సి ఉంటుందని ప్రజలకు డబ్బులు వృధా చేయకుండా నాణ్యమైన వైద్యాన్ని అందిస్తే ఆసుపత్రులు విజయవంతంగా కొనసాగుతాయని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, సిబ్బంది, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రచయితలకు తెలుగు భాషా పురస్కారాలు

విశాలాంధ్ర - జవహర్ నగర్ : ప్రపంచ తెలుగు భాషా పరిరక్షకుడు పోరాట యోధుడు రచయిత గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ పల్నాడు జిల్లా నరసరావుపేటలోని భువనచంద్ర టౌన్ హాల్ లో తెలంగాణ ఆంధ్ర ప్రముఖ రచయితలకు తెలుగు తేజం తెలుగు భాషా పురస్కారాలు అందించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్ర రాష్ట్ర గ్రంథాలయం చైర్మన్ కోటేశ్వరరావు, నరసరావుపేట ఎమ్మెల్యే అరవింద్ బాబు, స్థానిక ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, శ్రీ శ్రీ కళావేదిక అంతర్జాతీయ కన్వీనర్ కత్తిమండ ప్రతాప్, బహుజన కవి గుర్రం జాషువా మనమరాలు, శ్రీకృష్ణదేవరాయ వంశీయులు రాయలవారి మునుమనములు, జాతీయ త్రివర్ణ పతాక రూపకర్త పింగళి వెంకయ్య మనమలు కార్యవర్గ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ రచయితలకు సన్మానించి అవార్డులు ప్రధానం చేశారు.

ఆధ్యాత్మికతను పెంపొందించడానికి గణేష్ ఉత్సవాలు దోహదం

విశాలాంధ్ర - పటాన్ చెరువు : సమాజంలో యువత సంఘటితం కావడానికి గణేష్ నవరాత్రి ఉత్సవాలు తోడ్పాటు అందిస్తాయని, యువతలో ఆధ్యాత్మిక స్పృహను చైతన్య పరిచేందుకు వినాయక ఉత్సవాలను యువత వినియోగించుకోవాలని మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు స్పష్టం చేశారు. ఆదివారం రాత్రి పటాన్చెరు పట్టణంలోని గోకుల్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలోని లాల్ బాగ్ కా రాజా వినాయకునికి ఎంపీ రఘునందన్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గోకుల్ యూత్ అసోసియేషన్ యువ నాయకులు ఎంపీ రఘునందన్‌రావును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మెదక్ ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ సమాజంలో ఐక్యమత్యానికి ప్రతీకగా వినాయక నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్నాయని స్పష్టం చేశారు. అన్ని వర్గాల ప్రజలు ఏకతాటిపై ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవడం శుభ పరిణామం అన్నారు. ఇటీవలి కాలంలో వినాయక నిమజ్జనాలలో తరచుగా అపశృతులు జరుగుతున్నాయని, నిమజ్జనం శోభయాత్రలలో యువత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. నిమజ్జన శోభాయాత్రలలో నిర్వాహకులు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అన్ని రకాల రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. నాయకులు కాసాల సుధాకర్, జర్నలిస్ట్ మెట్టు మదన్ యాదవ్ ఈ కార్యక్రమంలో గోకుల్ యూత్ అసోసియేషన్ సభ్యులు మెట్టు కార్తీక్ యాదవ్, మెట్టు కళ్యాణ యాదవ్, మెట్టు సాయి యాదవ్, మోడీ లోకేష్ యాదవ్, పాదం శ్రీశైలం యాదవ్, కొత్తగుళ్ల మల్లికార్జున యాదవ్, జి శ్రీశైలం యాదవ్, బోడి యాదయ్య యాదవ్, మెట్టు ఎల్లేష్ యాదవ్ పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనోత్సవాలు జరగాలి

విశాలాంధ్ర - బషీర్ బాగ్ : ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనోత్సవ వేడుకలు జరగాలని అగర్వాల్ సమాజ్ అధ్యక్షుడు అనిరుధ్ గుప్తా ఆకాంక్షించారు. నిమజ్జనోత్సవానికి సంబంధించి భక్తుల కోసం అవసరమైన సహకారం అందించేందుకు అందరూ ముందుకు రావాలని కోరారు. సోమవారం తెలంగాణ అగ్రవాల్ సమాజ్ కేంద్ర కార్యాలయంలో ప్రతిష్ఠించిన గణేష్ విగ్రహానికి పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో అగర్వాల్ సమాజ్ తెలంగాణ అధ్యక్షుడు అనిరుధ్ గుప్తా, ఉపాధ్యక్షుడు రూపేష్ అగ్రవాల్, గౌరవ కార్యదర్శి వికాస్ కుమార్ కేశన్, కార్యాలయ మేనేజర్ పవన్ డోకానియా, సహ మేనేజర్ శీతల్ అగ్రవాల్, కార్యాలయ సిబ్బంది రాజు, శివ హాజరయ్యారు. ఈసందర్భంగా అనిరుధ్ గుప్తా మాట్లాడుతూ మరో మూడు రోజుల్లో సామూహిక గణేష్ నిమజ్జనోత్సవాలు జరగనున్న దృష్ట్యా అగర్వాల్ సమాజ్ సభ్యులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

వినాయకునికి నగేష్ ముదిరాజ్ ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : రాంనగర్ గుండు ప్రాంతంలో విశాల్ యాదవ్ ఆధ్వర్యంలో "గల్లీ వాలా గణేష్ " అనే వినాయకుని సందర్శించి ప్రతేక పూజలు నిర్వహించారు. అన్నప్రసాద కార్యక్రమంలో బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు నాగేష్ ముదిరాజ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలోలో విశాల్ యాదవ్, సాయి, శ్రీనివాస్, మహేష్, చింటూ మొదలైన వారు పాల్గొన్నారు.

ఎస్సీలను అణిచివేస్తున్న రేవంత్ రెడ్డి సర్కారు

విశాలాంధ్ర - బషీర్ బాగ్: రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను అసంబద్ధంగా, అస్తవ్యస్థంగా చేసి రోస్టర్ పాయింట్ల కేటాయింపులో మాల, మాల అనుబంధ కులాల గొంతు కోసి అన్యాయం చేసిందని నేషనల్ అంబేద్కర్ సేన జాతీయ అధ్యక్షులు మన్నే శ్రీధర్ అన్నారు. సోమవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ "రేవంత్ రెడ్డి తనకు నచ్చినట్టు, మంద కృష్ణ మాదిగ చెప్పినట్లు ఎస్సీ వర్గీకరణ చేసి రేవంత్ రెడ్డి కాస్తా రేవంత్ మాదిగ లాగా వ్యవహరిస్తున్నాడనీ ఆరోపించారు. రోస్టర్ పాయింట్ల కేటాయింపులో మాలలకు తీవ్రమైన నష్టం చేశాడనీ, ఎస్సీ వర్గీకరణపై కాంగ్రెసు పార్టీ పునరాలోచన చేసి మాలలకు న్యాయం చేయాలన్నారు. లేకపోతే స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెసు పార్టీకి వ్యతిరేకంగా పని చేసి తగిన గుణపాఠం చెప్తామని" అన్నారు. అనంతరం మాల పొలిటికల్ జేఏసీ చైర్మన్ డా.మంచాల లింగస్వామి మాట్లాడుతూ 'రేవంత్ రెడ్డి సర్కారు చేసిన ఎస్సీ వర్గీకరణ అస్తవ్యస్తంగా, అశాస్త్రీయంగా ఉందన్నారు. రోస్టర్ పాయింట్ల కేటాయింపులో మాదిగలకు ఒక్కరి మెప్పు కోసం మాల, మాల అనుబంధ, మాదిగ అనుబంధ కులాలైన 58 కులాల హక్కులను, అవకాశాలను హరించారన్నారు. జీవో 10, 99లను సవరించి షమీమ్ అక్తర్ కమిషన్ రిపోర్టులో అత్యంత వెనుకబడిన ఎస్సీలుగా పేర్కొన్న గ్రూప్ 1 వారికి రెండో రోస్టర్ పాయింటును, గ్రూప్ 2 లో ఉన్న మాదిగలకు రోస్టర్ 7వ రోస్టర్ పాయింటును, గ్రూపు 3 లో ఉన్న మాల, మాల అనుబంధ కులాలకు 16వ రోస్టర్ పాయింటును కేటాయించాలన్నారు. మాలలకు అన్యాయం జరుగుతున్న అసెంబ్లీలో గొంతెత్తని మాల మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్లను త్వరలో ముట్టడిస్తామని, ఉద్యమాన్ని ఉగ్రరూపం దాల్చిస్తామని" హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ మాలల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు కరణం కిషన్, నేషనల్ అంబేద్కర్ సేన రాష్ట్ర అధ్యక్షులు తాలుకా రాజేష్, ఆల్ ఇండియా షెడ్యూల్డ్ క్యాస్ట్ రైట్స్ ప్రొటెక్షన్ యూత్ ప్రెసిడెంట్ దాసరి విశాల్, జై భీమ్ మహిళా సంఘం అధ్యక్షురాలు సుధామల్ల అంజలీ పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

విశాలాంధ్ర - మొయినాబాద్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని టిపియూఎస్ రాష్ట్ర అధ్యక్షులు అజయ్ కార్తిక్ అన్నారు. టిపియూఎస్ ఆధ్వర్యంలో కేఎస్‌ఆర్ గ్రౌండ్లో సీజన్ - 6 క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ క్రికెట్ టోర్నమెంట్లో 10 జట్లు పాల్గొనగా సుజాత స్కూల్ విద్యార్థులు మంచి ప్రతి కనబరిచారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో విజయం సాధించారు. సోమవారం సుజాత స్కూల్ లో విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్రీడలు శరీర దారుఢ్యానికి ఎంతో దోహాధపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ అరుణాసింగ్ ,జయప్రకాష్ సింగ్, డైరెక్టర్లు త్రిష సింగ్, ఉదయ్ సింగ్, ప్రిన్సిపల్ వీణ, వైస్ ప్రిన్సిపల్ జియా, ఉపాధ్యాయ బృందం, తదితరులు ఉన్నారు.

హైదరాబాద్ ప్రగతి నగర్‌లో జయంతి నివాస్‌లో గణపతి నవరాత్రులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం వినాయక నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం.

గణేష్ మండపాలను సందర్శించిన రాగం నాగేందర్ యాదవ్

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి డివిజన్ లో గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గణేష్ మండపాలను శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ సందర్శించారు. ఈ సందర్భంగా వెజిటేబుల్ మార్కెట్ లోని గణేష్ మండపాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మార్కెట్ డెవలప్మెంట్ పనులు త్వరలో ప్రారంభమవుతాయని హామీ ఇచ్చారు. ఇటీవలే గౌరవ జిహెచ్‌ఎంసీ మేయర్ శ్రీమతి గద్వాల్ విజయ లక్ష్మి గారి మార్కెట్ పర్యటనలో భాగంగా సంబంధిత అధికారులతో క్షేత్రస్థాయిలో చర్చించి పనులను ప్రారంభించే దిశగా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు వీరేశం గౌడ్, కే. రాంచందర్, లక్ష్మినారాయ ణ గౌడ్, నారాయణ, కర్ణాకర్ గౌడ్, లక్ష్మా రెడ్డి, కొయ్యాడ లక్ష్మణ్ యాదవ్, గోవింద్ చారీ, గోపి యాదవ్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

వినాయకుడి నిమజ్జనానికి వెళ్లి తండ్రి కొడుకులు మృతి

విశాలాంధ్ర-దుండిగల్: మన భారతదేశంలో అన్ని పండగల కన్నా గణేష్ చతుర్థిని అందరూ చాలా ఇష్టంగా జరుపుకుంటారు.నవరాత్రుల ప్రారంభం నుంచి నిమజ్జనం వరకు ఎంతో హడావిడిగా ఉంటుంది.ఈ పండుగ వేళ కొన్ని ప్రాంతాల్లో అపశృతి చోటుచేసుకుని.. కొన్ని కుటుంబాలకు తీరని శోకం మిగులుతోంది. వినాయకుడి నిమజ్జనానికి వెళ్లి ఇద్దరు తండ్రి కొడుకులు నీట మునిగి మృత్యువాత పడిన హృదయ విధారక సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి దుండిగల్ గ్రామానికి చెందిన డొక్కా శ్రీనివాస్(31) ఆయన కుమారుడు డొక్కా జాన్ వెస్లీ(7) ఆదివారం సాయంత్రం కాలనీ వాసులతో కలిసి గణేష్ నిమజ్జనానికి ఆటోలో వెళ్లారు.నిమజ్జనం పూర్తి చేసుకున్న తర్వాత కాలనీవాసులు ఇంటికి తిరిగి వచ్చారు.కానీ తండ్రి కొడుకులు కనిపించడం లేదని ఫోన్ చేశారు.అయిన ఫలితం లేక పోవటంతో ఇంట్లో వారికి సమాచారం అందించారు.ఇంటికి రాకపోవటం ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుండటం వలన ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు దుండిగల్ పోలీసులకు పిర్యాదు చేశారు.ఫిర్యాదు నమోదు చేసుకున్న పోలీసులు నాగులూర్ పెద్దచెరువు వద్దకు వెళ్లి పరిశీలించగా చెరువు వద్ద ఒక రాయి చిందర వందరగా ఉండటంతో చీకట్లో చెరువులో తండ్రి కొడుకులు ఆటో సహా అందులో పడినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు.పోలీసులు,డిఆర్ఎఫ్ సిబ్బంది 4 గంటలు శ్రమించి గాలింపు చర్యలు చేపట్టి చెరువులో పడిన ఆటోను మృత దేహాలను క్రేన్ సహాయంతో బయటకు తీశామని తెలియజేశారు.కేసును నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు.

ప్రయాణికులను సురక్షింతగా గమ్యానికి చేర్చే వాహనం ఆటో రిక్షా

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: ప్రయాణికులను ఒక ప్రదేశం నుండి మరో ప్రదేశానికి సురక్షితంగా చేర్చే వాహనమే ఆటో రిక్షా అని మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం పరిధి పాండు బస్తీలో కాలనీ ప్రజల కోరిక మేరకు నూతన ఆటో రిక్షా స్టాండును మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సురేష్ రెడ్డి మాట్లాడుతూ ఆటో స్టాండ్ల ఏర్పాటు వలన ప్రజలు ఆటో రిక్షాల కోసం సులభంగా వెతకడానికి సహాయపడతాయని, నిర్ణీత స్థలాలలో ఆటో రిక్షాలను నిలబెట్టడం ద్వారా రోడ్లపై ట్రాఫిక్ రద్దీ, ప్రమాదాలు తగ్గుతాయని తెలిపారు. వినియోగదారులు ఆటో కోసం వెతకడానికి సమయం వృధా చేయకుండా, నేరుగా స్టాండ్‌కు వెళ్లి ఆటో వాహనాలని అద్దెకు తీసుకోవడానికి ఒక కేంద్రంగా పనిచేస్తాయని, వ్యక్తులు లేదా వస్తువులను ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశానికి తీసుకెళ్లడానికి వీలు కల్పిస్తాయన్నారు. ఆటోలను ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేయకుండా మీకు కేటాయించిన స్థానంలోనే పెట్టాలని సురేష్ రెడ్డి డ్రైవర్లకు సూచించారు.

యుద్ధం ఆపండి: మోదీ

టియాంజిన్: షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సదస్సు అనంతరం భారత ప్రధాని నరేంద్రమోదీ-రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ద్వైపాక్షిక సంబంధాలతో పాటు ఉక్రెయిన్ సంక్షోభంపైనా చర్చించారు. ప్రపంచ శాంతి, స్థిరత్వం, శ్రేయస్సు కోసం భారత్-రష్యాల మధ్య సన్నిహిత సంబంధాలు ముఖ్యమైనవని మోదీ వెల్లడించారు. కఠిన పరిస్థితుల్లోనూ భారత్-రష్యా భుజం భుజం కలిసి నడిచాయన్నారు. ఉక్రెయిన్‌తో యుద్ధానికి త్వరగా ముగింపు పలికి, శాంతిని పునరుద్ధరించాలని పుతిన్‌కు మోదీ సూచించారు. "ఉక్రెయిన్ సంక్షోభ పరిష్కారానికి ఇటీవల జరుగుతున్న ప్రయత్నాలను మేం స్వాగతిస్తున్నాం. ఇందులో భాగస్వాములైన అన్ని పక్షాలు నిర్మాణాత్మకంగా ముందుకు సాగుతాయని ఆశిస్తున్నాం. ఈ ఘర్షణను వీలైనంత త్వరగా ముగించి, ప్రాంతీయంగా శాంతి, స్థిరత్వాన్ని నెలకొల్పే మార్గాలను మనం కనుగొనాలి. ఇది యావత్ మానవాళి పిలుపు" అని మోదీ స్పష్టం చేశారు. మోదీ వ్యాఖ్యలకు పుతిన్ కూడా సానుకూలంగా స్పందించారు. ఎస్‌సీఓ సదస్సులో తన ప్రసంగం సందర్భంగా.... ఉక్రెయిన్ సంక్షోభ పరిష్కారంలో భారత్, చైనా వంటి వ్యూహాత్మక భాగస్వాములు అందిస్తున్న సహకారాన్ని తాము ఎంతగానో గౌరవిస్తున్నామని పుతిన్ పేర్కొన్నారు. గత నెలలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో కుదిరిన అవగాహనలు ఉక్రెయిన్‌లో శాంతికి మార్గం సుగమం చేశాయని ఆయన ప్రస్తావించారు. ఈ భేటీ తర్వాత ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ, పుతిన్‌తో సమావేశం అద్భుతంగా జరిగిందని తెలిపారు. వాణిజ్యం, ఎరువులు, అంతరిక్షం, భద్రత, సాంస్కృతిక రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవడంపై చర్చించామని వెల్లడించారు. భారత్- రష్యాల మధ్య తరచూ జరుగుతున్న ఉన్నతస్థాయి భేటీలు తమ మధ్య ఉన్న ప్రత్యేక బంధాన్ని తెలియజేస్తున్నాయని ప్రధాని మోదీ అన్నారు. భారత్-రష్యా సంబంధాలు కొన్ని సూత్రాల ఆధారంగా బలంగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. బహుముఖ సహకారంతో తాము ముందుకువెళుతున్నట్లు తెలిపారు. తమ బంధం రాజకీయాలకు అతీతంగా చాలా విశ్వాసపూర్వకమైందని ప్రధాని మోదీ చెప్పారు. మరోవైపు ఎస్‌సీఓ సదస్సు తర్వాత ద్వైపాక్షిక చర్చల కోసం మోదీ, పుతిన్ ఒకే కారులో వెళ్లారు. ఈ విషయాన్ని ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా వెల్లడించారు. "ఉక్రెయిన్ సంక్షోభానికి శాంతియుత పరిష్కారంతో సహా ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై మేం అభిప్రాయాలు పంచుకున్నాం. మన ప్రత్యేక, విశేషాధికార వ్యూహాత్మక భాగస్వామ్యం ప్రాంతీయ, ప్రపంచ స్థిరత్వానికి కీలక స్తంభంగా నిలుస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, ఎస్‌సీఓ సదస్సు కోసం చైనాకు వచ్చిన వెంటనే శనివారం ప్రధాని మోదీకి ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ ఫోన్ చేయడం గమనార్హం. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, యూరప్ నేతలతో వాషింగ్టన్‌లో జరిగిన చర్చల వివరాలను జెలెన్‌స్కీ ప్రధానికి వివరించారు. ఈ సంక్షోభ పరిష్కారానికి అవసరమైన ప్రయత్నాలు చేసేందుకు భారత్ సిద్ధంగా ఉందని, ఎస్‌సీఓ సదస్సు వేదికగా రష్యాకు సరైన సంకేతాలు పంపుతామని మోదీ ఆయనకు హామీ ఇచ్చినట్లు తెలిసింది.

పశ్చిమ దేశాలే కారణం: పుతిన్

టియాంజిన్: ఉక్రెయిన్ సంక్షోభానికి పూర్తి బాధ్యత పశ్చిమ దేశాలదేనని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ స్పష్టం చేశారు. ఆ దేశాన్ని నాటో కూటమిలోకి లాక్కోవాలని చేసిన ప్రయత్నాలే ప్రస్తుత యుద్ధానికి దారితీశాయని తేల్చి చెప్పారు. ఎస్‌సీఓ శిఖరాగ్ర సదస్సులో ప్రసంగించిన పుతిన్... ఈ సంక్షోభంపై తమ వైఖరిని కుండబద్దలు కొట్టారు. శాంతి స్థాపన కోసం చైనా, భారత్ చేస్తున్న ప్రయత్నాలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు."ఇది ఆక్రమణతో పుట్టుకొచ్చిన సంక్షోభం కాదు. పశ్చిమ దేశాల మద్దతుతో ఉక్రెయిన్‌లో జరిగిన తిరుగుబాటు ఫలితమే ఈ యుద్ధం" అని పేర్కొన్నారు. ఒక దేశ భద్రత కోసం మరో దేశాన్ని బలిచేయకూడదన్న సూత్రాన్ని తాము నమ్ముతామని ఆయన అన్నారు. యుద్ధం మూలాల్లోకి వెళ్లి సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనాల్సిన అవసరం ఉందని, భద్రతా సమతుల్యతను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని పుతిన్ అభిప్రాయపడ్డారు. రష్యా అనుకూల అధ్యక్షుడిగా ఉన్న విక్టర్ యాంకోవిచ్‌ను మైదాన్ తిరుగుబాటుతో గద్దె దింపడం వెనుక పశ్చిమ దేశాల హస్తం ఉందని ఆయన పరోక్షంగా పేర్కొన్నారు. ఇటీవల అమెరికాలోని అలాస్కాలో మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో జరిగిన తన భేటీ వివరాలను కూడా పుతిన్ ప్రస్తావించారు. ఆ సమావేశంలోని ముఖ్యాంశాలను చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో పాటు ఇతర ప్రపంచ నేతలతో పంచుకున్నట్లు తెలిపారు. ట్రంప్‌తో తనకు కుదిరిన అవగాహన ఉక్రెయిన్‌లో శాంతికి మార్గం సుగమం చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

బెదిరింపు ధోరణి సహించం

ఎస్‌సీఓ దేశాలకు పరస్పర ప్రయోజనాలు ముఖ్యం: జిన్ పింగ్

టియాంజిన్: షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ)లోని సభ్య దేశాలన్నీ పరస్పర ప్రయోజనాల కోసం ప్రయత్నించాలని చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్ పిలుపునిచ్చారు. ఎస్‌సీఓ సభ్యదేశాలు మంచి ఫలితాలను సాధించాలని అభిప్రాయపడ్డారు. షాంఘై సహకార సంస్థ 25వ శిఖరాగ్ర సదస్సు ప్రారంభ ఉపన్యాసంలో జిన్ పింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. "షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సభ్య దేశాలు సంస్థ అభివృద్ధి, సహకారంలో విప్లవాత్మక, చారిత్రక విజయాలను సాధించాయి. ఎస్‌సీఓ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రాంతీయ సంస్థగా ఎదిగింది. ఎస్‌సీఓ సభ్య దేశాలు విభేదాలను పక్కనపెట్టి ఉమ్మడి అభిప్రాయాన్ని వెతకాలి. ఈ ఏడాదిలోపు షాంఘై సహకార సంస్థ సభ్య దేశాలకు 2 బిలియన్ యువాన్లు (సుమారు 281 మిలియన్ అమెరికా డాలర్లు) గ్రాంట్?గా అందిస్తాం" అని జిన్ పింగ్ పేర్కొన్నారు. అలాగే తన ప్రసంగంలో చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌పై పరోక్ష వ్యాఖ్యలు చేశారు. అంతర్జాతీయ సమాజంలో బెదిరింపు ప్రవర్తనను తాము అంగీకరించబోమని స్పష్టం చేశారు. నిష్పాక్షికత, న్యాయం, బహుళత్వానికి ప్రాధాన్యం ఉండాలన్నారు. ఐక్యరాజ్య సమితి కేంద్రీకృత వ్యవస్థలైన ప్రపంచ వాణిజ్య సంస్థ, ఐక్యరాజ్యసమితి వంటి సంస్థలను రక్షించుకోవాలని స్పష్టం చేశారు. ఎస్‌సీఓ సభ్య దేశాలు పరస్పర ప్రయోజనాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. దీంతో మంచి ఫలితాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

"ఎస్‌సీఓ సభ్యదేశాలు విభేదాలను పక్కనపెట్టి ఒక్కటవ్వాలి. వ్యూహాత్మక వ్యవహరించి ఏకాభిప్రాయంతో ఉండాలి. ఎస్‌సీఓ సభ్య దేశాలు అన్ని మిత్ర దేశాలు, భాగస్వాములుగా ముందుకెళ్లాలి.

అప్పుడే ఈ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, అభివృద్ధి, శ్రేయస్సు కోసం మన బాధ్యతను నెరవేర్చగలం. చైనా, భారత్ గ్లోబల్ సౌత్‌లో ముఖ్యమైన దేశాలు. ఎస్‌సీఓ సభ్య దేశాలు సమగ్రతను ప్రోత్సహించాలి. పరస్పరం ఆర్థిక సహకారం చేసుకోవాలి. వైవిధ్యాలను గౌరవించుకోవాలి. సహకార భావనతో ముందడుగు వేస్తే అన్ని సంస్కృతుల శ్రేయస్సు, సామరస్యం వర్ధిల్లుతుంది" అని జిన్ పింగ్ వ్యాఖ్యానించారు.

సుంకాల ఎత్తివేతకు భారత్ ముందుకొచ్చింది: ట్రంప్

వాషింగ్టన్: భారత్‌తో వాణిజ్యం పూర్తిగా ఏకపక్ష విపత్తు అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. అధిక సుంకాల కారణంగా భారత్‌కు అమెరికా వస్తువులను విక్రయించలేకపోతోందన్నారు. అమెరికా వస్తువులపై దిగుమతి సుంకాలను సున్నాకు తగ్గించేందుకు భారత్ ముందుకు వచ్చిందని... కానీ ఇప్పటికే ఆలస్యమైందని పేర్కొన్నారు. వారు కొన్నేళ్ల క్రితమే అలా చేసి ఉండాల్సిందని వ్యాఖ్యానించారు. మోదీ-పుతిన్ భేటీ నేపథ్యంలో ట్రంప్ నుంచి ఈ వ్యాఖ్యలు రావడం గమనార్హం. అమెరికాకు భారత్ ఎక్కువ వస్తువులు విక్రయించి...తక్కువ కొనుగోలు చేస్తుందని ట్రంప్ చెప్పారు. ఏ దేశంపై వేయనంత సుంకాలను భారత్ అమెరికాపై వేసిందన్నారు. సుంకాలు తగ్గిస్తామని భారత్ ఇప్పుడు ప్రతిపాదిస్తోందని, కానీ, ఇప్పటికే ఆలస్యమైందని ట్రంప్ అన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ- రష్యా అధ్యక్షుడు పుతిన్ భేటీ ముగిసిన కొన్ని గంటల సమయంలోనే ట్రంప్ సోషల్ మీడియాలో ఈ మేరకు పోస్టు పెట్టారు.

తెలుగు రాష్ట్రాల అభివృద్ధిలో

చంద్రబాబు ముద్ర చిరస్మరణీయం

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ ప్రశంసలు



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రెండు తెలుగు రాష్ట్రాల అభివృద్ధిలో చంద్రబాబు ముద్ర చిరస్మరణీయమని, పాలనలో ఎన్ని ప్రతికూలతలు ఎదురైనా వాటిని సవాళ్లుగా స్వీకరించి ముందడుగు వేశారని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, వివిధ శాఖల మంత్రులు కొనియాడారు. ముఖ్యమంత్రిగా తొలిసారి ప్రమాణం చేసి 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా చంద్రబాబుకు వారంతా హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తును ఊహించి ప్రణాళికాబద్ధంగా దూరదృష్టితో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన దార్శనికుడు చంద్రబాబు అని పవన్ కల్యాణ్ అన్నారు. హైదరాబాద్‌ను ఐటీ రంగానికి కేరాఫ్ అడ్రస్‌గా మార్చిన ఘనత చంద్రబాబుదేనని, ఆయన ఐటీకి పెద్దపీట వేయడంతోనే తెలుగు రాష్ట్రాల్లో మారుమూల గ్రామాల నుంచి ఐటీ ఉద్యోగులు వచ్చారన్నారు. రైతు బజార్లు, డ్వాక్రా సంఘాలు, పేదలకు వెలుగు ప్రాజెక్ట్, మీసేవా కేంద్రాలు ఏర్పాటువంటి నూతన ఆవిష్కరణలు ఆయన ముందుచూపును తెలియచేస్తాయన్నారు. రాష్ట్ర విభజన అనంతరం క్లిష్ట సమయంలో ఆంధ్రప్రదేశ్ సీఎంగా బాధ్యతలు చేపట్టి.. రాజధాని లేని రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రణాళికాబద్ధంగా సాగుతున్నారన్నారు. దార్శనికత కలిగిన చంద్రబాబు నిర్దేశకత్వంలో ఏపీ అభివృద్ధికి నిబద్ధతతో పని చేస్తున్నామని తెలిపారు. హైటెక్ సిటీ నుంచి క్వాంటం వరకూ సీఎంగా చంద్రబాబు ప్రయాణం ఒక సజీవ వారసత్వమని మంత్రి లోకేశ్ కొనియాడారు. బయోటెక్ ఆకాంక్షల నుంచి డేటా ఆధారిత ఆర్థిక వ్యవస్థల వరకు ఈ పురోగతే ప్రత్యక్ష సాక్ష్యమన్నారు. ముఖ్యమంత్రిగా తొలిసారి ప్రమాణం చేసి మూడు దశాబ్దాలు పూర్తి చేసుకున్న నాన్నకు హృదయపూర్వక శుభాకాంక్షలు అంటూ లోకేశ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఇంట్లో 'నాన్న', పనిలో 'బాస్' అని పిలుచుకునే అదృష్టం నాకు లభించిందన్నారు. ప్రజలకు నాణ్యమైన, పారదర్శక సేవలు అందిస్తున్న హైటెక్ సీఎం చంద్రబాబు అని హెూంమంత్రి అనిత అన్నారు. ఇంటికి, వంటింటికే పరిమితమైన మహిళలను ప్రగతి బాట పట్టించారని పేర్కొన్నారు. వివిధ శాఖల మంత్రులు ఆయన సేవలను కొనియాడుతూ ట్వీట్‌లు చేశారు.

రాజ్యాంగ రక్షణ కోసమే

ఉపరాష్ట్రపతి ఎన్నిక పోటీపై సుదర్శన్ రెడ్డి

హైదరాబాద్: భారతదేశంలో ఎన్నికల ప్రక్రియ ప్రమాదంలో పడబోతోందని ప్రతిపక్షాల ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి హెచ్చరించారు. ఎన్నికల సంఘం అత్యున్నతమైన వ్యవస్థ అని ఉద్ఘాటించారు. సోమవారం తాజ్ కృష్ణాలో సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ఎంపీలతో జస్టిస్ సుదర్శన్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడారు. తాను ఇండియా కూటమి అభ్యర్థిని కాదని, ప్రతిపక్షాల అభ్యర్థినని నొక్కిచెప్పారు. తాను ఏ పార్టీ సభ్యత్వం స్వీకరించనని స్పష్టం చేశారు. తనపై ఏవేవో ముద్రలు వేస్తున్నారని, వీటిపై బాధపడాల్సిన అవసరం లేదన్నారు. తనపై విమర్శలు చేస్తే ఉప రాష్ట్రపతి ఎన్నికల పోటీ నుంచి వెనక్కు తగ్గుతానని భావిస్తున్నారని, అది జరిగే పనికాదన్నారు. తనను విమర్శించే వారు తాను ఇచ్చిన తీర్పు ఒక్కసారి చదవాలని సూచించారు. అది కేవలం తన తీర్పు కాదని.. సుప్రీంకోర్టు తీర్పు అని ఉద్ఘాటించారు. తన తీర్పును 11 మంది న్యాయమూర్తులు చదివారని, అందులో ఒక్క విషయాన్ని కూడా మార్చలేకపోయారని పేర్కొన్నారు. ఇప్పటికి ఐదుసార్లు రాజ్యాంగంపై తాను ప్రమాణం చేశానని, రాజ్యాంగ పరిరక్షణ కోసమే తాను ఉపరాష్ట్రపతిగా పోటీ చేస్తున్నానన్నారు. ఉపరాష్ట్రపతి పదవి రాజకీయ పదవి కాదని, రాజ్యాంగ పదవని స్పష్టంచేశారు. ప్రజలకు ఓటు హక్కును దూరం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఇది అత్యంత దుర్మార్గమన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల ప్రకటన

రాష్ట్ర స్థాయిలో 52, జిల్లా స్థాయిలో 1,421

విశాలాంధ్ర - సచివాలయం: స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు - 2025 ను ప్రకటిస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. కేంద్రం అమలు చేస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ అవార్డులను ఆదర్శంగా తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం ఈ అవార్డులను ప్రారంభించింది. రాష్ట్రంలో ప్రతి నెల మూడో శనివారం "స్వచ్ఛ ఆంధ్ర డే" గా నిర్వహిస్తూ ప్రజల భాగస్వామ్యాన్ని పెంచుతోంది. అవార్డుల రూపంలో గుర్తింపును అందిస్తూ ఈ కార్యక్రమాన్ని శాశ్వతంగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర స్థాయిలో 52, జిల్లా స్థాయిలో 1,421 అవార్డులు ఇవ్వనున్నారు. పారదర్శకత కోసం స్వీయ అంచనా, జిల్లా స్థాయి బృందాల పరిశీలన, రాష్ట్ర స్థాయి సమీకరణ, స్వతంత్ర మూడో పార్టీ ధృవీకరణ విధానాన్ని అవలంభిస్తారు. అదనంగా, సామాజిక మాధ్యమాల ద్వారా అవగాహన కల్పించడంలో విశేషంగా కృషి చేసిన శాఖలకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వనున్నారు.స్వర్ణ ఆంధ్ర 2047 దిశగా పరిశుభ్రమైన, పచ్చని, ఆరోగ్యకరమైన రాష్ట్రంగా తీర్చిదిద్దడమే మా దృష్టి అని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేష్ కుమార్ తెలిపారు. మొదటి అవార్డుల ప్రదానోత్సవం అక్టోబరు రెండో తేదీ గాంధీ జయంతి సందర్భంగా జరుగనుంది. ముఖ్యమంత్రి విజేతలకు అవార్డులు అందజేస్తారు. జిల్లాల్లో ఇన్చార్జి మంత్రులు, జిల్లా కలెక్టర్లు అవార్డులు ప్రదానం చేస్తారు.

బీహార్ పోరాటం దేశంలో మార్పుకు నాంది

బీజేపీ ప్రజాస్వామ్య విధ్వంస కుట్రలు సాగనీయం

సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా

పట్నా: బీహార్‌లోని పట్నాలో సోమవారం జరిగిన 'ఓటర్ అధికార్ యాత్ర' ముగింపు ర్యాలీలో సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా నేతృత్వంలో వేలాది మంది పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఎర్రజెండాలు చేతబట్టిన కార్యకర్తలు "ఓట్ చోర్... గద్దీ చోడ్" అని దిక్కులు పిక్కటిల్లేలా నినదిస్తూ గాంధీ మైదాన్ దిశగా ముందుకు సాగారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ... ఓట్ల చోరీ ద్వారా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయాలన్న బీజేపీ కుట్రల్ని సీపీఐ, ఇండియా ఐక్యసంఘటన అనుమతించబోవని స్పష్టం చేశారు. బీహార్ ఎన్నికల్లో ప్రతి పౌరుడు తమ ఓటు వేస్తారని, ప్రజల ఐక్య బలం మోసపూరిత పాలనను ఓడిస్తుందన్నారు. బీజేపీ మోసం, తారుమారు రాజకీయాలు ఇక్కడ సాగబోవన్నారు. ప్రజాస్వామ్యాన్ని హైజాక్ చేయలేరని పట్నాలో ఓటర్ అధికార్ యాత్రకు తరలివచ్చిన జనసంద్రం... భారతదేశం అంతటా ప్రతిధ్వనించే సందేశాన్ని పంపిందన్నారు.

బీహార్‌లో జరిగిన ఈ చారిత్రాత్మక పోరాటం దేశవ్యాప్తంగా మార్పును ప్రేరేపిస్తుందని, నిరంకుశ శక్తులను ఓడించడానికి ఐక్యతను బలోపేతం చేస్తుందని స్పష్టం చేశారు. ఈ ర్యాలీలో రాజాతో పాటు సీపీఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు నాగేంద్ర నాథ్ ఓజా, అనీ రాజా, సీపీఐ బీహార్ కార్యదర్శి రామ్‌నరేష్ పాండే తదితరులు పాల్గొన్నారు.

భారత్-చైనా సహకారం... సానుకూల పరిణామం: సీపీఐ

న్యూఢిల్లీ: భారత్-చైనా మధ్య సహకార పురోగతిని భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) స్వాగతించింది. ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మధ్య జరిగిన సమావేశం సానుకూల ఫలితం ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు పార్టీ జాతీయ సమితి ఓ ప్రకటనలో పేర్కొంది. రెండు దేశాల ప్రజల మధ్య రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక సంబంధాలు సహా ఇతర అన్ని స్థాయిలలో మెరుగైన అవగాహన వైపు ముందుకు సాగడానికి ఈ చర్చలు నిబద్ధతను చాటాయి. ఇటువంటి సహకారం మన రెండు దేశాలకు మాత్రమే కాకుండా, గ్లోబల్ సౌత్ ఐక్యతను బలోపేతం చేయడానికి, అంతర్జాతీయ సంబంధాలలో బహుళ ధ్రువణత పురోగతికి కూడా చాలా ముఖ్యమైనదని సీపీఐ తెలిపింది. వలస శక్తుల వారసత్వం అయిన దీర్ఘకాలిక సరిహద్దు సమస్యలను శాంతియుత చర్చల ద్వారా పరిష్కరించడానికి రెండు దేశాలు రాజకీయ సంకల్పాన్ని ప్రదర్శించాయని తెలిపింది. ఈ పరిణామం మన ప్రాంతంలో శాశ్వత శాంతి, స్థిరత్వం, అభివృద్ధిని నిర్మించడానికి దోహదపడుతుంది. సామ్రాజ్యవాద శక్తులు ప్రపంచాన్ని విభజించి ఆధిపత్యం చెలాయించడానికి ప్రయత్నిస్తున్న సమయంలో భారత్- చైనాల ఐక్యత, సహకారం... దేశాల మధ్య సమానత్వం, న్యాయం, పరస్పర గౌరవం ఆధారంగా ప్రత్యామ్నాయ ప్రపంచ క్రమానికి శక్తివంతమైన ప్రేరణనిస్తాయి. భారత్-చైనా సంబంధాలలో ఈ సానుకూల పరిణామానికి మద్దతు ఇవ్వాలని సీపీఐ అన్ని వర్గాల ప్రజలకు పిలుపునిచ్చింది.

రాజావాసిరెడ్డి వెంకటాద్రినాయుడు జిల్లాగా అమరావతి: జాస్తి

విశాలాంధ్ర-సచివాలయం: శ్రీ రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు పేరును అమరావతి జిల్లాగా నామకరణం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌కు అఖిల భారత పంచాయతీ పరిషత్(ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు విజ్ఞప్తి చేశారు. అమరావతిని రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించి... జిల్లా కేంద్రాన్ని టెంపుల్‌టౌన్ వారసత్వ నగరమైన అమరావతిలో ఏర్పాటు చేయాలని కోరారు. ఆ మహనీయుడి జయంతిని ప్రభుత్వాలు రాష్ట్ర పండుగగా నిర్వహించాలన్నారు. రాజధాని అమరావతిలో రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు స్మృతివనం నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. అమరావతిలో ఉన్న రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు జమిందారీ కోటను మ్యూజియంగా అభివృద్ధి చేయాలని, అమరావతిలో ఉన్న శిల్పసంపదకు ప్రపంచ గుర్తింపు ఉందన్నారు. లండన్‌లోని బ్రిటిష్, చెన్నైలోనే ఎగ్మోర్ మ్యూజియంలో ఢిల్లీ, కోల్‌కతా, హైదరాబాద్ మ్యూజియంలోని అమరావతి శిల్పసంపదను అమరావతికి రప్పించేందుకు చంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకొని కేంద్ర ప్రభుత్వానికి, తమిళనాడు ప్రభుత్వానికి లేఖలు రాశారని తెలిపారు.

'సర్'పై అపనమ్మకంతోనే అనిశ్చితి

ఫిర్యాదుల గడువు పొడిగింపునకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ: బీహార్‌లో ఓటర్ల జాబితా సవరణ అంశానికి సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం(సీఈసీ) ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్‌పై గందరగోళ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో సోమవారం సుప్రీంకోర్టులో మరోసారి విచారణ జరిగింది. ఓటర్ల ఫిర్యాదులు, అభ్యంతరాలను స్వీకరించడానికి సీఈసీ విధించిన తుది గడువు సెప్టెంబరు 1వ తేదీని పొడిగించాలంటూ బీహార్ రాజకీయ నాయకులు దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చితో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. కేంద్ర ఎన్నికల సంఘం(సీఈసీ) ఏర్పాటు చేసిన 'సర్'పై నమ్మక లోపం వల్లే ఇంత పెద్ద అనిశ్చితి ఏర్పడిందని వ్యాఖ్యానించింది. 'సర్' అంశానికి సంబంధించి గందరగోళ పరిస్థితులు చక్కబడాలంటే రాజకీయ పార్టీలు తమను తాము క్రియాశీలం చేసుకుని... సమస్య పరిష్కారం దిశగా అడుగులు వేయాలని సూచించింది. అభ్యర్థనలు, ఫిర్యాదులకు తుది గడువు అనేది అవసరం లేదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. అభ్యర్థనలకు సెప్టెంబరు 1 చివరి తేదీగా ఉన్నప్పటికీ క్లెయిమ్‌లు, అభ్యంతరాలు, దిద్దుబాట్లను దాఖలు చేయడం వంటి అంశాలకు సంబంధించి ఈసీ నిర్దేశించిన తుది గడువు ముగింపు తేదీ తర్వాత కూడా పరిగణనలోకి తీసుకోవాలని సుప్రీంకోర్టు తమ ఉత్తర్వులో పేర్కొంది. ఇందుకోసం ప్రత్యేకంగా డెడ్‌లైన్ పొడిగింపు తేదీ అంటూ ఏమీ అవసరం లేదని తెలిపింది. ఫలితంగా సెప్టెంబరు 1 తర్వాత కూడా అభ్యంతరాలను యథావిధిగా స్వీకరిస్తామని కోర్టుకు ఈసీ హామీ ఇచ్చింది. నామినేషన్ చివరి తేదీ వరకూ అభ్యంతరాలను స్వీకరిస్తామని సీఈసీ తెలిపింది. అదే సమయంలో పారా లీగల్ వలంటీర్లను నియమించాలని బీహార్ లీగల్ సర్వీసెస్ అథారిటీని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఓటర్లకు సహాయం చేసే క్రమంలో పారా లీగల్ వలంటీర్లను నియమించడమే సరైనదిగా సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. పారా లీగల్ వలంటీర్లు ఇచ్చే నివేదికను జిల్లాస్థాయి జడ్జిలు సమీక్షించాలని స్పష్టం చేసింది. ఫిర్యాదులకు ఆధార్‌ను ఐడెంటిటీ ప్రూఫ్‌గా ఉపయోగించవచ్చని, కానీ అది పౌరసత్వం నిర్ధారణకు కాదని సుప్రీంకోర్టు పేర్కొంది. కాగా, బీహార్‌లో 'సర్' తొలగించిన 65 లక్షల ఓట్లతో ఒక్కసారిగా రాజకీయ వాతావరణం వేడెక్కింది. దీన్ని ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీ... కేంద్ర ప్రభుత్వం కుట్రగా అభివర్ణించింది. ఎన్నికల కమిషన్‌తో కలిసి కేంద్రం చేస్తున్న ఓట్ చోరీ అంశంగా ఆరోపణలు చేస్తోంది. ఈ క్రమంలోనే ఓట్ అధికార్ యాత్ర పేరుతో ఇప్పటికే బీహార్‌లో రాహుల్ గాంధీ యాత్ర చేశారు. మరొకసారి ఇదే అంశానికి సంబంధించి ఇండియా ఐక్యసంఘటన పెద్ద ఎత్తున నిరసనకు సిద్ధమైంది.

హరీశ్, సంతోష్ వల్లే కేసీఆర్‌కు చెడ్డపేరు

పార్టీ ఉంటే ఏంటి? లేకపోతే ఏంటి?

ఎమ్మెల్సీ కవిత సంచలన వ్యాఖ్యలు



విశాలాంధ్ర-హైదరాబాద్: కేసీఆర్ పక్కనున్న కొందరు చేసిన పని వల్లే ఆయనకు చెడ్డపేరు వచ్చిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత ఆవేదన వ్యక్తంచేశారు. అందులో ఐదేళ్లపాటు ఇరిగేషన్ శాఖ మంత్రిగా ఉన్న హరీశ్‌రావు పాత్ర లేదా? అని ప్రశ్నించారు. మాజీ ఎంపీ సంతోష్, హరీశ్‌రావు వల్లే కేసీఆర్‌కు చెడ్డపేరు వచ్చిందన్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడారు. కాళేశ్వరంలో చిన్నభాగం కుంగితే మొత్తం ప్రాజెక్టు పోయినట్లు రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు.

"కేసీఆర్ జనం కోసం పని చేస్తే.. వాళ్లు ఆస్తుల పెంపుకోసం పని చేశారు. హరీశ్‌రావు, సంతోష్ నాపై ఎన్నో సార్లు కుట్రలు చేశారు. అయినా నేను నోరు మెదపలేదు. ఈ రోజు కేసీఆర్ బిడ్డగా నేను ఎంతో బాధపడుతున్నా. హరీశ్‌రావు, సంతోష్ వెనుక రేవంత్‌రెడ్డి ఉన్నారు. వారి మధ్య లోపాయకారి ఒప్పందం కుదిరింది. హరీశ్‌రావు, సంతోష్‌ను రేవంత్ రెడ్డి ఏమీ అనరు. నా తండ్రిపైనే బాణం వేస్తారు. కేసీఆర్ మీద సీబీఐ దర్యాప్తు వేశాక పార్టీ ఉంటే ఏంటి? లేకపోతే ఏంటి? ఇది నా తండ్రి పరువునకు సంబంధించింది. నా లేఖ బయటకు వచ్చినా నేను ఎవరి పేర్లు బయటపెట్టలేదు. రేవంత్‌రెడ్డి ప్రీ-ప్లాన్డ్‌గా సీబీఐ పేరు చెప్పారు. కేసీఆర్ హిమాలయ పర్వతం లాంటి వారు. ఆయనకు అవినీతి మరక అంటితే బాధగా ఉంది. నాకు పెళ్లి చేసేందుకు కూడా మా నాన్న ఆర్థిక ఇబ్బంది పడ్డారు. దేవుడి లాంటి నా తండ్రిపై సీబీఐ దర్యాప్తుకు ఆదేశిస్తే నాకు బాధగా ఉండదా? కేసీఆర్‌ని నిన్న అన్ని మాటలు అంటుంటే, ఒక్కరు కూడా నోరు విప్పకపోవడం ఏంటి? రేవంత్.. మీకు దమ్ముంటే.. లోపాయకారీ ఒప్పందం లేకపోతే నేను పేర్లు కూడా చెప్పా.. చర్యలు తీసుకోండి. బీసీల రిజర్వేషన్లపైనా బిల్ పెడతారు. కానీ, ఎందుకు సుప్రీం కోర్టు దాకా వెళ్లి పోరాడటం లేదు. బిహార్ కోసం తెలంగాణ బీసీ బిడ్డలను రేవంత్ బలి చేస్తున్నారు. తెలంగాణ జాగృతి నుంచి బిహార్ వెళ్లి మీ బండారం బయటపెడతాం. సీబీఐ కాదు, ఇంకే ఎంక్వైరీ వేసిన కేసీఆర్ కడిగిన ముత్యంలా వస్తారు" అని ధీమా వ్యక్తం చేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.